సోమవారం
30-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 279
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

### ఎవిన్ జైలుపై దాడిలో 71 మంది మృతి

**తెహ్రాన్:** ఇరాన్ రాజధాని తెహ్రాన్‌లోని ఎవిన్ జైలుపై ఇజ్రాయిల్ ఈనెల 23న చేసిన దాడిలో 71 మంది చనిపోయినట్లు అక్కడి న్యాయశాఖ అధికార ప్రతినిధి జహంగీర్ ఆదివారం వెల్లడించారు. వైమానిక యుద్ధం ముగింపు క్రమంలో రాజకీయ ఖైదీలను ఉంచే తెహ్రాన్ జైలుపై ఇజ్రాయిల్ దాడి చేసింది. తద్వారా కేవలం సైనిక స్థావరాలు, అణు కేంద్రాలే తమ లక్ష్యాలు కాదని చెప్పే ప్రయత్నం చేసింది. కాగా, మృతుల్లో ఖైదీలతో పాటు వారిని కలిసేందుకు వచ్చిన కుటుంబ సభ్యులు, సైనిక శిక్షణలో ఉన్న యువత, సిబ్బంది, జైలు పరిసరాల్లో ఉన్న కొందరు ప్రాణాలు కోల్పోయినట్లు జహంగీర్ తెలిపారు. జైలులోని కొంత భాగం ధ్వంసం కాగా మిగతా ఖైదీలను తెహ్రాన్ పరిధిలోని వేరే జైళ్లకు బదిలీ చేసినట్లు వెల్లడించారు.

## 'మేకిన్ ఇండియా' కాదు...
# 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ' మా లక్ష్యం

**ఐటీఈఎక్స్ ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు**

**విశాలాంధ్ర - హైదరాబాద్:** 'మేకిన్ ఇండియా' కాదు... 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ' అన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ నినాదం, లక్ష్యమని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని, తెలంగాణను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైటెక్స్‌లో ఆదివారం 'ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ' అధ్వర్యంలో నిర్వహించిన 'ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్ పో - 2025' ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తెలంగాణ ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కంపౌండ్ నెలవారీ వృద్ధి రేటు 2.9 శాతం. జాతీయ సగటు 0.52 శాతం మాత్రమే. అధికంగా ఆరు రెట్లు తెలంగాణలో నమోదైంది. 2024-25లో ఇండస్ట్రియల్ గ్రాస్ స్టేట్ వాల్యూయాడెడ్ రూ.2.77 లక్షలకు చేరింది. ఇంధన వినియోగంలో 15.6 శాతం, జీఎస్టీ వసూళ్లలో 9.8 శాతం, పే రోల్ ఎన్ రోల్‌మెంట్స్‌లో 13.9 శాతం వృద్ధి రేటు నమోదయ్యింది' అని మంత్రి వివరించారు.

**ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కేంద్రంగా ప్రత్యేక జోన్లు**

'తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరూ విష ప్రచారం చేస్తున్నారు. ఏడాదిన్నరలోనే

- మిగతా 2 లో

## జగన్నాథ రథయాత్రలో
# తొక్కిసలాట

**ముగ్గురు భక్తుల మృతి... 10 మందికి తీవ్ర గాయాలు**

- ఘటనపై ఉన్నతస్థాయి విచారణ: ఒడిశా సీఎం
- ఖర్గే, రాహుల్ విచారం

**భువనేశ్వర్:** ఒడిశాలోని పూరీలో జరుగుతున్న జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గుండిచా ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మరో నలభైమంది వరకు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనతో యాత్రలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మరోవైపు రథయాత్ర ఆలస్యం కావడంపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ దుమారం రేగింది. జగన్నాథ ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్రలో భాగంగా జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి విగ్రహాలతో కూడిన మూడు పవిత్ర రథాలు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని గుండిచా ఆలయానికి చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో రథాలు గుండిచా ఆలయం వద్దకు రాగానే, స్వామివార్ల దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. రథాలు సమీపించే కొద్దీ ఒక్కసారిగా

- మిగతా 2 లో

# జనగణనతోనే కులగణన

- డిసెంబరు 31కి పరిపాలనా యూనిట్ల సరిహద్దుల్లో మార్పులు
- రెండు దశల్లో నిర్వహణ
- రాష్ట్రాలు, యూటీలకు కేంద్రం లేఖ




**న్యూదిల్లీ:** జనగణన-2027కు సంబంధించి కీలక పరిమాణం చోటుచేసుకుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఎస్‌లకు భారత జనాభా లెక్కల కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ మృతుంజయ్ కుమార్ నారాయణ్ లేఖ రాశారు. జనాభా లెక్కల ప్రక్రియకు తుది తేదీగా పరిగణించే ఈ ఏడాది డిసెంబర్ 31కి ముందే పరిపాలనా యూనిట్ల సరిహద్దుల్లో ఏవైనా ప్రతిపాదిత మార్పులుంటే చేయాలని అందులో కోరారు. జనగణన కోసం అన్ని గ్రామాలు, పట్టణాలను ఏకరీతి గణన బ్లాక్‌లుగా విభజించామని పేర్కొన్నారు. జనగణన సమయంలో ఎటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రతి బ్లాక్‌కు ఒక గణకుడిని నియమిస్తామని వెల్లడించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్లు, సూపర్ వైజర్లు, గణకుల నియామకం, వారి మధ్య పని విభజన జరుగుతుందని మృతుంజయ్ కుమార్ తెలిపారు. 2027 ఫిబ్రవరి 1 నాటికి జనగణన ప్రారంభమవుతుందని వెల్లడించారు. డిసెంబర్ 31 లోపు మున్సిపల్ కార్పొరేషన్లు, రెవెన్యూ గ్రామాలు, సబ్ డివిజన్లు, జిల్లాల సరిహద్దుల్లో ఏవైనా ప్రతిపాదిత మార్పులు చేయాలని అన్ని విభాగాలను ఆదేశించాలని అన్ని రాష్ట్రాల

- మిగతా 2 లో

### ఇకపై ఎనిమిది గంటల ముందే రైల్వే చార్ట్ సిద్ధం

**న్యూదిల్లీ:** టికెట్ల రిజర్వేషన్లలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రైళ్లు బయలుదేరడానికి ఎనిమిది గంటల ముందే రిజర్వేషన్ చార్టులను సిద్ధం చేయాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. అంటే మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరే రైలు రిజర్వేషన్ చార్టులు ముందు రోజు రాత్రి 9గంటలకు సిద్ధం చేయబోతున్నది. రైల్వేల్లో టికెట్ బుకింగ్‌ను సులభతరం చేయడానికి అనేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల

- మిగతా 2 లో

### ఆస్కార్ కమిటీ సభ్యుడిగా కమల్‌హాసన్

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** సినీ పరిశ్రమలో వైవిధ్యమైన పాత్రలు పోషించి అభిమానులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న దిగ్గజ భారతీయ నటుడు కమల్ హాసన్‌కు అరుదైన గౌరవం దక్కింది. సినీరంగంలో దశాబ్దాల కృషి అనంతరం ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ కమిటీ సభ్యునిగా ఆయనకు ఆహ్వానం లభించింది. పదుల కొద్దీ రాష్ట్ర, జాతీయ, ఫిలింఫేర్ అవార్డులు అందుకున్న కమల్‌కు ఈ గౌరవం దక్కడంపై హర్షాతిరేకాలు

- మిగతా 2 లో

### 'ఉచిత ల్యాప్‌టాప్' పేరిట నయా మోసం

**న్యూదిల్లీ:** అమాయకులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రజలకు ఆశల్ని కల్పించేలా సైబర్ మాయా వలను విసిరి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేందుకు కొత్త పన్నాగాలు రచిస్తున్నారు. తాజాగా దేశంలో విద్యార్థులందరికీ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్లు పేర్కొంటూ వాట్సప్‌లో వారు మెసేజ్‌లు పంపడంపై కేంద్రం అప్రమత్తమైంది. ప్రభుత్వం ఎలాంటి ఉచిత ల్యాప్‌టాప్‌లూ ఇవ్వడంలేదని స్పష్టం చేస్తూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

### ఇదీ లోకం!

రెడీ చేస్తున్నాం..తర్వాత రామ్మా!

# డ్రగ్స్ దందా ఆగేనా?

- గంజాయిలో కలుపు మొక్కలు
- పోలీసులు, రాజకీయ నేతల కుమ్మక్కు?
- ఈ ఏడాదిలో రూ.24 వేల కోట్ల వ్యాపారం
- యువత భవిష్యత్ అంధకారం
- పేదలపై తప్పుడు కేసులు
- చంద్రబాబు ప్రభుత్వానికి సవాళ్లు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** డ్రగ్స్ దందాను నియంత్రించడం, గంజాయి సాగును అరికట్టడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వాటిని నిర్మూలించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న దందానే ప్రస్తుతం... ఏడాది తర్వాత చంద్రబాబు ప్రభుత్వంలోనూ యథాతథంగా కొనసాగుతోంది. మద్యం స్కామ్‌కు మించి తారా స్థాయిలో గంజాయి, డ్రగ్స్ దందా కొనసాగుతున్నట్లు ప్రచారం ఉంది. డ్రగ్స్, గంజాయి బారిన పడిన యువత బంగారు భవిష్యత్ నాశనమైపోతోంది. చదువులకు వారు దూరమై... ఆ మత్తులో అసాంఘిక, హింసాత్మక చర్యలకు, దొంగతనాలకు పాల్పడటం తదితర దారుణమైన అలవాట్లు చేసుకుంటున్నారు. వాటి బారిన యువత పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో విడుదల చేసిన లెక్కల ప్రకారం... మాదక ద్రవ్యాల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. రాయలసీమ నుంచి ఉత్తరాంధ్రలోని అనేక జిల్లాల్లో గంజాయి మొక్కల సాగు విచ్చలవిడిగా జరుగుతోంది. ఈ సాగు దందా వెనుక కొందరు పోలీసులు, కొందరు రాజకీయ నేతలనే కలుపు మొక్కలున్నాయి. డ్రగ్స్ దందాపై లిబరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జి.విజయ్‌కుమార్ మీడియాకు సంచనల విషయాలను వెల్లడించారు. అటు మాదక ద్రవ్యాల దందాను ఎదుర్కోవడానికి నిర్ణయాత్మక చర్యగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల గుంటూరు కేంద్రంగా గంజాయి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పూర్తి స్థాయి ప్రచారం ప్రారంభించారు. ఆంధ్ర ప్రదేశ్‌ను మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మారుస్తామని ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవడంలో భాగంగా మాదక ద్రవ్యాల సాగు, రవాణా/అమ్మకాలలో పాల్గొన్న వ్యక్తుల ఆస్తులను జప్తు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే గంజాయి, డ్రగ్స్ మాఫియాను నిర్మూలిస్తామంటూ అప్పటి టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేసిన హామీ కార్యరూపం దాల్చలేదు. ఏడాది దాటినా గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించలేకపోయారు. ఇక డ్రగ్స్ కేసుల్లో అసలు నేరస్తులను వదిలేసి... కేవలం పేద, అమాయక యువతే లక్ష్యంగాను... వారిని ఉద్దేశపూర్వకంగా

- మిగతా 2 లో

### ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి

- 477 డ్రోన్లు, 60 క్షిపణులు సహా 537 అస్త్రాల ప్రయోగం
- మరో ఎఫ్-16ను కోల్పోయిన ఉక్రెయిన్

2లో

## ప్రపంచ మార్కెట్‌లోకి
# నిజామాబాద్ 'పసుపు'

- మార్కెటింగ్, ఎగుమతి కార్యాలయాలు ఇక్కడే
- బోర్డు ప్రారంభోత్సవంలో అమిత్ షా

**విశాలాంధ్ర- హైదరాబాద్:** నిజామాబాద్‌లో పసుపుబోర్డు జాతీయ కార్యాలయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం ప్రారంభించారు. పసుపు బోర్డు ఏర్పాటు ఏర్పాటు చేయాలన్న రైతుల డిమాండ్ ఎట్టకేలకు సాకారమైంది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత... రైతులు పసుపు పంటకు మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యాల కోసం పోరాటం కొనసాగించారు. ఒక్క నిజామాబాద్‌లోనే కాకుండా హైదరాబాద్‌లో కూడా ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా ఉంది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కలను ప్రధాని మోదీ నెరవేర్చారని అన్నారు. పసుపు బోర్డు ఇక్కడికి రావడంలో బీజేపీ తెలంగాణ ఎంపీల కృషి చాలా ఉందన్నారు. నిజామాబాద్ పసుపు ప్రపంచ మార్కెట్ లోకి వెళ్తుందని, పసుపు ధర పెరుగుతుందని, వ్యాపారాలు వృద్ధి చెందుతాయన్నారు. మార్కెటింగ్, ఎగుమతి కార్యాలయాలు కూడా నిజామాబాద్‌లో ఉంటాయని, వివిధ దేశాలకు ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావిస్తూ... పహల్గాం ఘటనకు ప్రతీకారంగా పాకిస్థాన్ మూకలకు బుద్ధి చెప్పామన్నారు.

**మావోయిస్టులు లొంగిపోవడం మంచిది**

మావోయిస్టులు ఆయుధాలు పక్కన పెట్టి లొంగిపోవడం మంచిదని అమిత్ షా సూచించారు.మావోయిస్టులకు వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆయుధాలు పట్టిన వారిని వదిలేది లేదని హెచ్చరించారు. మావోయిస్టులకు మద్దతుగా మాట్లాడే వారు, బాధిత కుటుంబాల పరిస్థితి తెలుసుకోవాలని అన్నారు. 2026 మార్చి చివరి నాటికి మావోయిస్టులను పూర్తిగా అంతమొందిస్తామన్నారు. రాష్ట్రంలో భారీ అవినీతి జరిగిందని, తెలంగాణ మొన్నటి వరకు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా ఉందని, ఇప్పుడు రేవంత్ రెడ్డికి మారిందని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అవినీతి అంతం అవుతుందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

# కేంద్రం దేశాన్ని వంచించింది

**న్యూదిల్లీ:** ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం యుద్ధ విమానాలను కోల్పోయిందని ఇండోనేసియాలో రక్షణ అధికారి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ ఉదహరించింది. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని తప్పుదారి పట్టించిందని ఆరోపించింది. అఖిలపక్ష సమావేశానికి అధ్యక్షత వహించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎందుకు నిరాకరిస్తున్నారని, పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి డిమాండ్ ఎందుకు తిరస్కరిస్తున్నారని ప్రశ్నించింది.

ఇండోనేసియాలో ఇటీవల జరిగిన ఒక సెమినార్‌లో కెప్టెన్ (భారత నౌకాదళం) శివకుమార్ మాట్లాడారు. 2025 మే 7న రాత్రి పాక్, పీవోకేలోని ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన దాడుల్లో భారత వైమానిక దళం యుద్ధ విమానాలను కోల్పోయిందని తెలిపారు. ఆ విషయంలో మీడియాలో రాగా... దానిని కాంగ్రెస్

- మిగతా 2 లో

# పౌర సేవలకు కొత్త వ్యవస్థ

**రంగాల వారీగా ర్యాంకులిచ్చిన ఎంఏయూడీ**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** పౌర సేవలను మరింత సమర్థంగా ప్రజలకు అందించేందుకు సేవా-స్థాయి ఫలితాలను కొలిచే సరికొత్త వ్యవస్థ వచ్చింది. రాష్ట్రంలోని అర్బన్ లోకల్ బాడీలు (యూఎల్‌బీ) పది వేర్వేరు సేవా ప్రమాణాల ఆధారంగా ర్యాంకులు ఇవ్వడం, వాటి ఆధారంగా పనులు రూపొందించడం జరిగేది. యూఎల్‌బీలలో సేవలకు నిర్దేశించిన కాలపరిమితుల ప్రకారం కొత్త వ్యవస్థను పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ రూపొందించారు.

యూఎల్‌బీలలో ప్రధాన సేవా-స్థాయి సూచికలలో ఇంటింటికీ నీటి కనెక్షన్ల ద్వారా తాగునీటి సరఫరా, చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్, పాత వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి, వర్షపు నీటి కాలువల నిర్మాణం, పక్కా రోడ్లు, ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు, పట్టణ (మహిళా) స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదాయం కలిగించే కార్యకలాపాలతో పాటు మున్సిపల్, రెవెన్యూశాఖ సేవలు ఉన్నాయి. సరికొత్త వ్యవస్థ ఉత్తమ ఫలితాలను సాధించడానికి, వనరుల సక్రమ వినియోగానికి దోహదమవుతుంది. ఎమ్మెల్యేలకు, కలెక్టర్లకు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ కార్పొరేటర్లు, చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లకు సేవా-స్థాయి సూచికల గురించి అవగాహన కల్పించాలని ఎంఏయూడీ అధికారులను సీఎం ఆదేశించారు. పనులన్నీ

- మిగతా 2 లో

## పనితీరు మార్చుకోకుంటే
# అంతే సంగతులు!

- ఎమ్మెల్యేలకు చంద్రబాబు హెచ్చరిక
- కేంద్ర సహాయం మరువలేనిది
- అధికారం కాదు... రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం
- ఆగస్టు 15 నుంచి మహిళలకు 'ఉచిత బస్సు'



**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** 'ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాలి. లేకుంటే... ఇక అంతే సంగతులు' అంటూ సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. 'పనితీరుపై తాను క్షేత్రస్థాయి పరిస్థితిపై ఎప్పటికప్పుడూ సమాచారం తెప్పించుకుంటున్నాను. అనేక మార్గాల ద్వారా సర్వేలు చేయిస్తున్నాను. అన్ని సర్వేలను విశ్లేషించి వాస్తవాలను బేరీజు వేస్తున్నట్లు' సీఎం వెల్లడించారు. మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు అధ్యక్షతన ఆదివారం టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ

- మిగతా 2 లో

# ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి

- 477 డ్రోన్లు, 60 క్షిపణులు సహా 537 అస్త్రాల ప్రయోగం
- మరో ఎఫ్-16ను కోల్పోయిన ఉక్రెయిన్

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి చేసింది. యుద్ధం మొదలైన తర్వాత ఇంత భారీస్థాయిలో దాడి జరగలేదు. నాల్గో ఏడాదిలోకి అడుగుపెట్టిన యుద్ధం విరమణపై ఆశలను తాజా బాంబుల దాడి చంపేసింది. పోలాండ్ గగనతల రక్షణ కోసం మిత్రదేశాల యుద్ధ విమానాలు రంగంలోకి దిగినట్లు పోలాండ్ వాయు సేన పేర్కొంది. అయితే ఉక్రెయిన్‌పై శనివారం అర్ధరాత్రి రష్యా విరుచుపడింది. 477 డ్రోన్లు, డికాయ్‌లు, 60 క్షిపణులు సహా మొత్తం 537 గగనతల అస్త్రాలను ప్రయోగించింది. ఈ మేరకు ఉక్రెయిన్ వాయు సేన అధికారులు ఆదివారం తెలిపారు. వీటిలో 249 అస్త్రాలను తాము కూల్చివేయగా, మరో 226 ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యవస్థల ప్రభావంతో కూలినట్లు చెప్పారు. డ్రోన్లు, వివిధ రకాల క్షిపణులతో దాడి జరిగిందని, పశ్చిమ ఉక్రెయిన్‌తో పాటు సుదూర ఆరు లక్ష్యాలపై రష్యా దాడ ఇచేసిందని ఉక్రెయిన్ వాయుసేనకు కమ్యూనికేషన్ కమాండర్ యూరీ ఇహ్నాట్ తెలిపారు. ఖెర్సాన్ ప్రావిన్స్ గవర్నర్ ఓలెక్సాండర్ ప్రాకుడిన్ మాట్లాడుతూ డ్రోన్ దాడిలో ఒకరు చనిపోయారని తెలిపారు. ప్రాదేశిక గవర్నర్ ఇహోర్ తబురెట్స్ మాట్లాడుతూ చెర్కాసీలో ఆరుగురు గాయపడ్డారని చెప్పారు. పశ్చిమ ఉక్రెయిన్‌లోని లీవ్ ప్రాంతంలోని డ్రోహోబైస్కీ నగరంలోని పారిశ్రామిక వాడలో డ్రోన్ దాడితో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయని, నగరంలోని చాలా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం కూలిపోగా పైలట్ ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకూ మూడు ఎఫ్-16 విమానాలను రష్యా కూల్చివేసిందని ఉక్రెయిన్ సైన్యం వెల్లడించింది. తీరప్రాంత నగరమైన ఒడెసాలోని అపార్ట్‌మెంటుపై డ్రోన్ దాడిలో దంపతులు మరణించారు. మరో 17 మంది గాయపడ్డారు. ఈ యుద్ధం కొత్త ప్రాణాంతక అస్త్రాల పరీక్షకు వేదికగా మారింది. ఇదిలావుంటే, టర్కీ ఇస్తాంబుల్‌లో శాంతి చర్చల క్రమంలో ప్రత్యక్ష భేటీకి మాస్కో సిద్ధమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ప్రకటించారు. ఇప్పటివరకు ఇస్తాంబుల్ వేదికగా ఉక్రెయిన్-రష్యా మధ్య రెండు దఫాలు జరిగిన చర్చలు ఎటువంటి పురోగతి సాధించకపోవడం విదితమే.

# గాజాపై ఒప్పందం చేసుకోండి

## ఇజ్రాయిల్, హమాస్‌పై ట్రంప్ ఒత్తిడి

వాషింగ్టన్: గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి పెంచారు. రాజీకి రావాలని, బందీలను విడిచి పెట్టాలని, ఈ దిశగా గాజాలో ఒప్పందం జరగాలని ఇజ్రాయిల్, హమాస్‌కు సూచించారు. 'గాజాలో ఒప్పందం చేసుకోండి. బందీలను వెనక్కి తీసుకురండి' అని సామాజిక మాధ్యమం 'ట్రూత్' ద్వారా సందేశమిచ్చారు. ఆయన గతంలో ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆమోదించాలని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై ఒత్తిడి తెచ్చారు. నెతన్యాహుపై కేసులను వదిలేయాలని ఇజ్రాయిల్ ప్రాసిక్యూటర్లను రెండవ సారి అభ్యర్థించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ పోస్టు పెట్టారు. ఆయన హమాస్‌తో ఒప్పందం కుర్చుకునే కసరత్తు చేస్తున్నారని, తద్వారా బందీలను వెనక్కి తెస్తారని ట్రంప్ వెల్లడించారు. నెతన్యాహు 'వార్ హీరో' అంటూ ట్రంప్ శనివారం ప్రశంసించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన కేసుల్లో చిక్కుకుంటేగనుక ఇరాన్, హమాస్‌తో దౌత్యపరంగా చేస్తున్న కసరత్తుకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. కాగా, అవినీతి కేసులో నెతన్యాహు ఫిర్యాదును ఇజ్రాయిల్ కోర్టు ఇటీవల తిరస్కరించిన విషయం విదితమే. తాజా పరిణామాల క్రమంలో నెతన్యాహుపై కేసులను 'పొలిటికల్ విచ్‌హంట్' (రాజకీయపరంగా అబద్ధపు ఆరోపణలతో వేధించడం) అని ట్రంప్ వర్ణించారు. తాను ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నట్లు తెలిపారు. కాగా, ఇరాన్‌పై యుద్ధంలో అండగా నిలిచినందుకుగాను ట్రంప్‌కు నెతన్యాహు ధన్యవాదాలు తెలిపారు.

## దశాబ్దం తర్వాత నేపాల్ క్రియాశీల

# రాజకీయాల్లోకి విద్యాదేవి భండారి

ఖాట్మండు: నేపాల్ మాజీ అధ్యక్షురాలు విద్యాదేవి భండారి (62) క్రియాశీల రాజకీయాల్లోకి తిరిగి వచ్చారు. అధికార సీపీఎన్-యూఎంఎల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకున్నారు. దేశ అత్యున్నత స్థానాన్ని అధీష్టించేందుకు పార్టీని వీడిన దశాబ్దం తర్వాత ఆమె మళ్లీ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తన భర్త, సీపీఎన్-యూఎంఎల్ మాజీ ప్రధాన కార్యదర్శి మదన్ భండారి 74వ జయంతిని పురస్కరించుకొని ఖాట్మండులో మదన్ భండారి ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె... రాజకీయాల్లో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. నా పార్టీ కుటుంబాన్ని కలుసుకోవడం ఆనందంగానూ గర్వంగానూ ఉందన్నారు. విద్యాదేవి తిరిగి రావడంతో సీపీఎన్-యూఎంఎల్ చైర్మన్, ప్రధాని కేపీ ఓలి స్థానానికి పోటీ పెరుగుతుందన్న చర్చ పార్టీలో ఇప్పటికే మొదలైనట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. కాగా, ఖాట్మండు కార్యక్రమానికి ఓలి కూడా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీపీఎన్-యూఎంఎల్ చీలికకు తావులేదన్నారు. పార్టీ ఐక్యంగా, బలంగా ఉందని, దీనిని చీల్చే కలలు వద్దంటూ వారించారు. ఎవరి పేరు ప్రస్తావించకుండా ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాలు చర్చకు దారితీశాయి. అదే సమయంలో 2027-28లో జరగాల్సి ఉన్న సార్వత్రిక ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించాలని తమ పార్టీ సభ్యులకు ఓలి సూచించారు. ఇదిలావుంటే, విద్యా దేవి భండారి 2015 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు నేపాల్‌కు అధ్యక్షురాలిగా వ్యవహరించారు. దేశానికి తొలి మహిళా అధ్యక్షురాలిగా నిలిచారు. అధ్యక్ష పగ్గాలు చేపట్టకముందు సీపీఎన్-యూఎంఎల్ వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2009లో మాధవ్ కుమార్ నేపాల్ ప్రభుత్వంలో రక్షణ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆమె భర్త మదన్ భండారి ప్రముఖ మార్క్సిస్టు నాయకుడు. 1993లో జీపు ప్రమాదంలో చనిపోయారు. ఈ ఘటన అప్పట్లో వివాదాస్పదంగా మారింది. కుట్ర కోణంపై అనుమానాలు వచ్చాయి. అయితే ఇది కచ్చితంగా ప్రమాదనమేనని దర్యాప్తులు తేల్చలేదు.

# అమిత్‌షాకు బీజేపీ ఎంపీల ఘనస్వాగతం

విశాలాంధ్ర - హైదరాబాద్: నిజామాబాద్ జిల్లా వినాయక నగర్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వెళుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బేగంపేట విమానాశ్రయంలో ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ, విశ్వేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్ తదితర ప్రజా ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించి పూల బొకేలు అందజేశారు.

## 90 డిగ్రీల వంతెన..

# ఏడుగురు ఇంజినీర్ల సస్పెన్షన్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఇటీవల నిర్మించిన ఓ రైల్వే వంతెన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ వంతెన 90 డిగ్రీల మలుపుతో నిర్మించడమే అందుకు కారణం. దీనికి సంబంధించి మీడియాలో అనేక కథనాలు రావడంతోపాటు సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరిగింది. ఇలాంటి డిజైన్‌లను రూపొందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం తాజాగా ఏడుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు విధించింది. మరో విశ్రాంత చీఫ్ ఇంజినీర్‌పై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. 'ఐష్‌బాగ్‌లో ఆర్‌వోబీ నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యంపై దర్యాప్తునకు ఆదేశించా. నివేదిక ఆధారంగా ఎనిమిది మంది పీడబ్ల్యూడీ ఇంజినీర్లపై చర్యలు తీసుకున్నా. ఇందులో ఏడుగురు ఇంజినీర్లపై తక్షణమే సస్పెన్షన్ విధించా. నిర్మాణ ఏజెన్సీ, డిజైన్ రూపొందించిన కన్సల్టెంట్‌లను బ్లాక్‌లిస్టులో చేర్చాం. ఆర్వోబీ పునరుద్ధరణ కోసం ఓ కమిటీని ఏర్పాటు చేశాం' అని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు. భోపాల్‌లో ఐష్‌బాగ్ వద్ద రూ.18 కోట్లతో ఇటీవల కొత్తగా ఓ రైల్వే వంతెన నిర్మించారు. అయితే, అది 90 డిగ్రీల మలుపు కలిగి ఉండటం తీవ్ర విమర్శలకు దారితీసింది. నిర్మాణ సంస్థ మాత్రం ఆ డిజైన్‌ను సమర్థించుకుంది. సమీపంలో మెట్రో రైల్ స్టేషన్, భూమి కొరత దృష్ట్యా ఇలా నిర్మించడం తప్పితే మరో మార్గం లేదని వివరణ ఇచ్చింది. కొంచెం అదనపు భూమి అందుబాటులో ఉంటే ఆ మార్గం సవ్యంగానే ఉండేదని చెప్పింది. అయినప్పటికీ తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

# ఆస్కార్ కమిటీ సభ్యుడిగా కమల్‌హాసన్

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆయనను అభినందిస్తూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'ప్రతిష్ఠాత్మకమైన అకాడమీ అవార్డు-2025 కమిటీ సభ్యుడిగా పద్మభూషణ్ కమలహాసన్ ఎంపిక కావడం భారతీయ చిత్ర పరిశ్రమకు ఎంతో గర్వకారణం. ఆరు దశాబ్దాల పాటు తన అద్భుతమైన నటనా జీవితాన్ని గడిపిన కమల్ హాసన్ కేవలం నటుడి కంటే ఎక్కువ. నటుడిగా, కథకుడిగా, దర్శకుడిగా ఆయన సినీ ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞ, దశాబ్దాల అనుభవం భారతీయ, ప్రపంచ సినిమాపై శాశ్వత ప్రభావాన్ని చూపాయి. రచయిత, గాయకుడు, దర్శకుడు, నిర్మాత, నటుడిగా చిత్రనిర్మాణంలోని ప్రతి అంశంపై ఆయన అసాధారణమైన పట్టు నిజంగా స్ఫూర్తిదాయకం. ఆయన నిజమైన కళాత్మక నిపుణుడు. నేను హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ప్రపంచ సినిమాకు ఆయన మరిన్ని సంవత్సరాలు ప్రభావవంతమైన సేవ చేయాలని కోరుకుంటున్నాను' అని పవన్ ట్వీట్ చేశారు.

# పౌర సేవలకు కొత్త వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

నిర్దేశిత కాలంలో పూర్తి కావాలన్నారు. కాగా, రంగాల వారీ సేవల ఆధారంగా మొదటి దశ ర్యాంకింగ్ ప్రక్రియను ఎంఏయూడీ శాఖ పూర్తి చేసింది. రాష్ట్ర సగటు ర్యాంకింగ్ 66.3 శాతంగా ఉండగా, విశాఖపట్నం జిల్లా 74.4 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో ఎన్టీఆర్ (72.6 శాతం), తిరుపతి (66.2 శాతం), గుంటూరు (64.9 శాతం), తూర్పు గోదావరి (64 శాతం), అనంతపురం (62 శాతం), వైఎస్ఆర్ కడప (61.7 శాతం), పల్నాడు (61.4 శాతం), అన్నమయ్య (60.4 శాతం), కర్నూలు (60.3 శాతం) నిలిచాయి. అనకాపల్లి జిల్లా 51.8 శాతంతో సేవా స్థాయి ర్యాంకింగ్‌లలో అట్టడుగున ఉంది.

# ఎనిమిది గంటల ముందే రైల్వే చార్ట్ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

రైల్వేల్లో తీసుకురానున్న సంస్కరణలకు సంబంధించిన పనుల పురోగతిపై సమీక్షించారని రైల్వే శాఖ తెలిపింది. టికెటింగ్ వ్యవస్థ స్మార్ట్‌గా, పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని, ప్రయాణికుల సౌలభ్యంపై దృష్టి సారించాలని సూచించినట్లు తెలిపింది. ప్రస్తుతం రిజర్వేషన్ చార్ట్ రైలు బయలుదేరడానికి నాలుగు గంటల ముందు తయారవుతున్నది. దాంతో ప్రయాణికుల్లో అనిశ్చితి నెలకొంటున్నది.

# డ్రగ్స్ దందా ఆగేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఇరికిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## రూ.24 వేల కోట్ల దందా

గంజాయి సాగుపై రాష్ట్రంలో నెలవారీగా రూ.2 వేల కోట్లు... ఏడాదికి రూ.24 వేల కోట్ల వ్యాపార లావాదేవీలు కొనసాగుతున్నాయని, ఇందులో రాజకీయ, పోలీసుల జోక్యం పెద్దఎత్తున ఉన్నట్లు సమాచారం. డ్రగ్స్, గంజాయి మాఫియా నుంచి ప్రభుత్వ పెద్దలకు కమీషన్లు వస్తున్నాయన్నా ఆరోపణలు ఉన్నాయి. ఏకంగా ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంజాయి సాగు మాఫియాతో చేతులు కలిపి రూ.200 కోట్లు వివిధ చోట్ల లాభాల కోసం పెట్టుబడులు పెట్టినట్లుగా కథనాలు వస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల మధ్యన జరిగిన ఆడియో సంభాషణ నిలిచింది. వారి సంభాషణ ఆధారంగా డ్రగ్స్ కేసులో అసలు నిందితులను వదిలేసి... నిరుపేదలైన యువతపై కేసులు నమోదు చేస్తున్నారని తెలిసింది. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎకరాల కొద్దీ గంజాయి సాగవుతున్నట్లు సమాచారం. అక్కడ గంజాయి మొక్కలు పూర్తిగా వేయకుండా ప్రభుత్వం నివారణ చర్యలు తీసుకోలేదు. సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలోనూ గంజాయి కోసం టీడీపీ నాయకులు పరస్పరం దాడులకు తెగబడిన సంఘటన చర్చనీయాంశమయ్యింది. రాయదుర్గం నియోజకవర్గంలో అక్కడ టీడీపీ నాయకుడు మామిడి తోటలో గంజాయి సాగు చేస్తున్నారన్న ఆరోపణలు ఆ పార్టీ ప్రతిష్ఠతను తగ్గించేలా ఉంది. వాటిపై ప్రభుత్వం తక్షణమే చర్యలకు ఉపక్రమించాల్సి ఉంది.

## ఈగల్ కార్యకలాపాలేవీ?

గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు గత ప్రభుత్వం సెబ్‌ను పెట్టగా... ఈ ప్రభుత్వం ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఫోర్స్‌ను, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెట్టినట్లు చెబుతోంది. ఇంతవరకు ఈగల్ విభాగానికి చెందిన ఐజీకి ఎలాంటి అధికార బదలాయింపులు, మౌలిక సౌకర్యాలు కల్పించలేదు. దాని కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణకు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, విజయవాడలో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ వాటి కార్యకలాపాలు కొనసాగడం లేదు. దీనిని అదునుగా చూసుకుని డ్రగ్స్ దందా, గంజాయి సాగు విచ్చలవిడిగా పెరిగిపోతోంది. ఇటీవల గుంటూరు వేదికగా సీఎం చంద్రబాబు... డ్రగ్స్, గంజాయి నియంత్రణపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించినప్పటికీ... అది ఆచరణలో సాధ్యమవుతుందా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, వాట్సాప్ హెల్ప్‌లైన్ (8977781972), టోల్-ఫ్రీ నంబర్ (1972) తో సహా అంకితమైన పౌర-రిపోర్టింగ్ ఛానెళ్లను ప్రవేశపెట్టినట్లు, 56 కొత్త డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా తన పునరావాస మౌలిక సదుపాయాలను విస్తరిస్తోందని సీఎం ప్రకటించారు. ముందు గంజాయి మొక్కలు నాటకుండా నియంత్రించాలని కోరుతున్నారు. పెద్ద పెద్ద నగరాలు, ఆదివాసీ నివాస ప్రాంతాల్లో వాటి నివారణకు అవగాహన కేంద్రాలు కూడా ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. డ్రగ్స్ బారిన పడిన యువతకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించకపోవడం, గంజాయికు ప్రత్యామ్నాయ పంట ఇచ్చి వారికి ఆదాయ వనరులు ఇచ్చే అవకాశం ఆదివాసీలకు కల్పించడం వంటి ఏ చర్యలనూ ప్రభుత్వం చేపట్టలేదు. ఆ పంట సాగు జరపకుండా ఆపలేకపోతోంది. ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం స్పందించి ఇంతటి భారీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పనితీరు మార్చుకోకుంటే అంతే సంగతులు!

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జిలు, పరిశీలకులు హాజరయ్యారు. రోజుకు నలుగురు ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాడుతున్నానని, కొంతమంది తమ పనితీరు మార్చుకోవాల్సిందేనని స్పష్టంచేశారు. ఎంతపని చేశామనే అంశంతో పాటు ఎలా చేస్తున్నామనేదీ కీలకమని, పార్టీలోని ప్రతి ఒక్కరూ అదే తరహా ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. వారసులకు హ్యాండ్ హోల్డింగ్ ఇస్తామేగానీ, దాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వాళ్లపై ఉంటుందన్నారు. 2029 ఎన్నికలే తన లక్ష్యమని, పనితీరు బాగాలేని వారికి మొహమాటం లేకుండా గుడ్‌బై చెప్పేస్తానని, రాబోయే ఎన్నికల్లో గెలిచేందుకు కౌంట్‌డౌన్ పెట్టుకుని పని చేస్తున్నామని, ఏళ్లను, నెలలను, రోజులను గంటలను లెక్కిస్తున్నానన్నారన్నారు. తానా, ఆటా అంటూ విదేశీ ప్రయాణాలు వద్దని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల గ్రాఫ్ పెరుగుతుందా... తగ్గుతుందా అనేది పరిశీలిస్తున్నానని చెప్పారు. వైసీపీ తరహాలో బరితెగించిన పార్టీ దేశంలోనే లేదని, పేపర్, టీవీలను అడ్డం పెట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల వేదికగాను మహిళలను వేధిస్తున్నారని, ప్రజా భద్రతే తనకు ముఖ్యమని, తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని తేల్చిచెప్పారు. నేరస్థులను నేరస్థులుగానే చూస్తామని తప్పులు చేసిన వారు ప్రత్యర్థి పార్టీలో ఉంటే చర్యలు తీసుకోకూడదా అని ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్... సత్తెనపల్లి పర్యటనలో ఏం జరిగిందో అందరూ చూశారన్నారు. ఎవరికైనా ప్రమాదం జరిగితే, వారిని కాపాడి ఆస్పత్రికి పంపుతామేగానీ, తన కారు కిందే కార్యకర్త పడిపోతే పక్కకు పడేసి వెళ్లిపోయారని ధ్వజమెత్తారు. దీనికి సంబంధించిన ఆధారాలు లభ్యమైన తర్వాత సొంత మీడియా ఉందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరామర్శల పేరుతో గంజాయి బ్యాచ్, రౌడీల వద్దకు వెళ్తారా అని మండిపడ్డారు. ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు, 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం పునరుద్ఘాటించారు. అమరావతి రాజధాని నిర్మాణం సహా అన్ని పనులను వేగవంతం చేశామని, రాజధానికి రూ.15 వేల కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని, అదే రోజు నుంచి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 703 సేవలు ఆన్‌లైన్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సుపరిపాలనలో తొలి అడుగు వేశామని, రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. డబ్బులతో ఎన్నికల్లో గెలవలేమనే విషయం స్పష్టమైందని, అభివృద్ధితో ఆదర్శంగా రాజకీయాలు చేద్దామని నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వాల కొనసాగింపు అనేది చాలా ముఖ్యమని, వైకుంఠపాళి అభివృద్ధి వద్దని సూచించారు. ప్రభుత్వాలు కొనసాగితే అభివృద్ధి జరుగుతుందని, సుస్థిరపాలన ఉంటే రాష్ట్రం బాగుంటుందని స్పష్టంచేశారు. 11 ఏళ్లుగా కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వమే ఉందని, అందుకే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. 2019 ఎన్నికల్లో మనమే గెలిచి ఉంటే రాష్ట్రం అభివృద్ధిలో అగ్రభాగాన ఉండేదన్నారు. ప్రజలు ఇచ్చిన 94 శాతం మద్దతును కాపాడుకోవాల్సిన బాధ్యత నేతలందరిపై ఉందని సీఎం సూచించారు.

# జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

జనసందోహం పెరిగిపోగా... కొందరు భక్తులు కిందపడిపోవడంతో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను ప్రభాతి దాస్, బసంతి సాహు, ప్రేమకాంత్ మహంతిగా గుర్తించారు. వీరంతా పూరీ రథయాత్ర కోసం ఖుర్దా జిల్లా నుంచి వచ్చినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటన జరిగిన ప్రదేశంలో గుంపును నియంత్రించడానికి పోలీసులు సరైన ఏర్పాట్లు చేయలేదని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. సంప్రదాయం ప్రకారం జగన్నాథ, బలభద్ర, సుభద్రల విగ్రహాలతో కూడిన రథాలను గుండిచా ఆలయానికి తీసుకువస్తారు. అక్కడ దేవతలు వారం రోజుల పాటు బస చేసి, ఆ తర్వాత తిరిగి జగన్నాథ ఆలయానికి చేరుకుంటారు. అయితే, ఈసారి యాత్ర ఆలస్యం కావడం, తొక్కిసలాట జరగడం తీవ్ర ఆందోళనకు దారితీసింది.

## రాజకీయ దుమారం

ఇక, రథయాత్ర ఆలస్యం కావడంపై రాజకీయ వివాదం రాజుకుంది. బీజేడీ అధినేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ ఈ పరిస్థితిని దారుణమైన గందరగోళంగా అభివర్ణించారు. "మనం చేయగలిగింది ప్రార్థించడం మాత్రమే. ఈ ఏడాది ఈ దివ్యమైన ఉత్సవానికి నీలినీడలు అలుముకునేలా చేసిన ఈ గందరగోళానికి బాధ్యులైన వారందరినీ మహాప్రభు జగన్నాథుడు క్షమించాలి" అని ఆయన అన్నారు. నవీన్ పట్నాయక్ వ్యాఖ్యలపై ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ పరోక్షంగా స్పందించారు. బీజేడీ అనవసరంగా రాజకీయ ప్రకటనలు చేస్తోందని విమర్శించారు. "గతంలో బీజేడీ ప్రభుత్వం తప్పులు చేసి జగన్నాథుడిని అవమానించింది. 1977 నుంచి రథాలు ఎప్పుడూ రెండో రోజే గుండిచా ఆలయానికి చేరుకునేవి" అని ఆయన తెలిపారు.

## ఖర్గే, రాహుల్ విచారం

మరోవైపు పూరీ తొక్కిసలాట దుర్ఘటనపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి పూర్తిగా నిర్లక్ష్యం, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే జరిగిందని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి కారణాలు తెలుసుకోవాలని సూచించారు. క్షతగాత్రులకు సరైన సహాయం అందించాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఈ తొక్కిసలాట ఘటనపై పూరీ రాజు గజపతి మహారాజ దివ్యసింగ్‌దేవ్ విచారం వ్యక్తం చేశారు. సమగ్ర దర్యాప్తు చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పూరీ జగన్నాథ్ రథయాత్రకు మరిన్ని ఏర్పాట్లు చేసి ఉండాల్సిందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభిప్రాయపడ్డారు. అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తొక్కిసలాట చోటుచేసుకుందని భక్తులు ఆరోపించారు. అంబులెన్సులు కూడా అందుబాటులో ఉంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## సీఎం క్షమాపణ... కలెక్టర్, ఎస్పీ బదిలీ

పూరీ జగన్నాథ రథయాత్రలో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనపై ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగన్నాథ్ భక్తులందరికీ ప్రభుత్వం తరఫున క్షమాపణలు చెబుతున్నట్లు మాఝి ప్రకటించారు. ఈ భద్రతా నిర్లక్ష్యం క్షమించరానిదన్న ముఖ్యమంత్రి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భద్రతా వైఫల్యంపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ప్రకటించారు. పూరీ కలెక్టర్ సిద్ధార్థ్, ఎస్పీ బినిత్ అగర్వాల్‌ను బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. వీరితో పాటు పూరీ డీసీపీ బిష్ణు చరణ్ పాటి, పోలీస్ కమాండెంట్ అజయ్ పధిని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# జనగణనతోనే కులగణన

(మొదటిపేజీ తరువాయి)

సీఎస్‌లను కోరారు.

- రాబోయే జనాభా లెక్కల కోసం గృహాల గుర్తింపు (హౌస్ లిస్టింగ్) కార్యకలాపాలు 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతాయని మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. ఇది జనాభా లెక్కల మొదటి దశ ప్రారంభాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. పర్యవేక్షకులు, గణకుల నియామకాలు రాష్ట్రాలు, జిల్లా పరిపాలన సహకారంతో జరుగుతుందని వెల్లడించారు.
- జనాభా లెక్కింపు కార్యక్రమం రెండు దశల్లో జరగనుంది. మొదటి దశలో గణకులు ఇంటింటికి వెళ్లి గృహాల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందులో ప్రతి ఇంటి గృహ పరిస్థితులు, ఆస్తులు, సౌకర్యాల గురించి సమాచారం సేకరిస్తారు. ఆ తర్వాత రెండో దశలో ఇంటింటికి వెళ్లి జన గణన చేపడతారు. ప్రతి ఇంట్లోని జనాభా, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలను తీసుకుంటారు. ఇది 2027 ఫిబ్రవరి 1 నాటికి జరగనుంది.
- జనగణనతో పాటు కుల గణన కూడా జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటనలో తెలిపింది. జనగణన కార్యకలాపాల కోసం 34 లక్షలకు పైగా గణకులు, పర్యవేక్షకులు, సుమారు 1.3 లక్షల జనాభా గణన కార్యకర్తలను నియమించనున్నారు. మరికొద్ది రోజుల్లో చేపట్టనున్నది 16వ జనాభా గణన. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎనిమిదవది. కాగా రాబోయే జనాభా గణనను మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి డిజిటల్ విధానంలో నిర్వహిస్తారు. డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతోపాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్లు వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్పీజీ/పీఎన్జీ కనెక్షన్ గురించి కూడా అడుగుతారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటీరియల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.

## పదేళ్లకొకసారి జనగణన

సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. ఆ తర్వాత కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన నిలిచిపోయింది. తాజాగా 16వ జనగణనకు సిద్ధమైంది కేంద్రం.

# 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ' మా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

రూ.మూడు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకొచ్చాం. ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.40 వేల కోట్ల పెట్టుబడులొచ్చాయి. కొత్తగా 150 కొత్త ప్రాజెక్టులు మొదలయ్యాయి. 51వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ సిటీ, గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్స్‌ను అభివృద్ధి చేస్తున్నాం. పారిశ్రామికాభివృద్ధి వికేంద్రీకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. అవుటర్ రింగ్ రోడ్డు లోపల టెక్నాలజీ, సర్వీసెస్ జోన్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య మ్యానుఫాక్చరింగ్ జోన్, ఆర్ఆర్ఆర్ బయట వ్యవసాయ, గ్రామీణ ఇన్నోవేషన్ జోన్ ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం' అని మంత్రి వివరించారు.

## మా ప్రణాళికలు భవిష్యత్ తరాల కోసమే

'మేం అయిదేళ్ల కోసం ప్రణాళికలు రూపొందించడం లేదు. రాబోయే తరాల కోసం ఆలోచిస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ దిశగానే అడుగులు వేస్తున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చిన టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ కు ధన్యవాదాలు. రాష్ట్రాభివృద్ధిలో కలిసొచ్చే వారందర్నీ కలుపుకుని ముందుకెళ్తాం' అని అన్నారు.

## సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు బలోపేతం

'దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్‌ఎంఈ)ల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గత 18 నెలల్లో కొత్తగా 15వేల ఎంఎస్‌ఎంఈలు ప్రారంభమయ్యాయి. మన జీఎస్‌డీపీలో ఎంఎస్‌ఎంఈల వాటాను 10 శాతానికి పెంచేలానే సంకల్పంతో గతేడాది ప్రత్యేక పాలసీకి రూపకల్పన చేశాం. ప్రతి జిల్లా కేంద్రాల్లోనూ ప్రత్యేకంగా ఎంఎస్ ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. వీటిల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇస్తాం' అని చెప్పారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు డా.సురేశ్ కుమార్ సింఘాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్. రవి కుమార్, ఉపాధ్యక్షుడు కేకే మహేశ్వరి, ఐఐటీఈఎక్స్ 2025 కన్వీనర్ విమలేష్ గుప్తా పాల్గొన్నారు.

# కేంద్రం దేశాన్ని వంచించింది

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్, కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

"ముందుగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సింగపూర్‌లో ముఖ్యమైన విషయాలను వెల్లడిస్తారు. తర్వాత ఇండోనేసియా నుంచి సీనియర్ రక్షణ అధికారి ఒకరు ఫాలో అవుతారు. కానీ ప్రధాని అఖిలపక్ష సమావేశానికి అధ్యక్షత వహించడానికి, ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవడానికి ఎందుకు నిరాకరిస్తున్నారు? పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఎందుకు తిరస్కరించారు?" అని జైరామ్ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం మొదటి నుంచి దేశాన్ని తప్పుదారి పట్టించిందని ఖేరా ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో విమాన నష్టాలను వెల్లడించడంలో విఫలమైందన్నారు. జాతీయ భద్రతపై వారు రాజీ పడ్డారని, కాంగ్రెస్ పార్టీ భారత ప్రజల ముందు ఏమి బయటపెడుతుందోనని వారు భయపడుతున్నారని ఆరోపించారు.

అధికారుల నిర్లక్ష్యంతో

## ఉపకార వేతనాలకు దూరమవుతున్న మైనారిటీ విద్యార్థులు

**విశాలాంధ్ర - కొత్తగూడెం :** అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో ఉన్నతవిద్యను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దూరమవుతున్నారని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ. యాకూబ్ పాషా విమర్శించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేసి అధికారుల విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపకారవేతనాలు పొందేందుకు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రూ. 1.50 లక్షలు పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికీ రూ. 2 లక్షల ఆదాయ పరిమితి గతంలో ఉండేదన్నారు. 2022 లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ, ఎస్టీ తరహాలో గ్రామీణ ప్రాంతాల్లోని మైనారిటీ విద్యార్థులకు కూడా పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆదాయ పరిమితిని రూ.2 లక్షలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చెయ్యడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఈ-పాస్ పోర్టర్‌లో విద్యార్థులు ఉపకారవేతనాలకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు 1.50 లక్షల ఆదాయ పరిమితి ఉన్న వారికి ఆన్లైన్ స్వీకరించడంలేదని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి జరిగిన పొరపాటును సరిదిద్దుకొని రూ. 1.50 లక్షలు ఆదాయ పరిమితిని అర్హులుగా ప్రకటిస్తూ వెంటనే ఈ-పాస్ పోర్టల్ లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. విధించిన గడువు తేదీని 10 రోజులు పొడిగించాలని కోరారు. అప్పుడే మైనార్టీ విద్యార్థులకు ఉపయోగం జరుగుతుందని తెలిపారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న తిరుపతిరెడ్డి

**విశాలాంధ్ర - తొర్రూరు:** మండలంలోని చర్లపాలెం గ్రామా నికి చెందిన యాదవ రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న తొర్రూర్ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి రైతులు పొలా లకు వెళ్లే దారి లేక ఇన్నాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విన్న ఆయన, తక్షణమే స్పందించి అవసరమైన ఫార్మ్ రోడ్ నిర్మాణానికి ముందు కొచ్చారు. అలాగే, వ్యవసాయ కార్యకలాపాలకు అవసరమైన పైపులు కూడా ఏర్పాటు చేయించి, రైతులకు తాగునీటి అవసరాలను తీర్చారు. ఈ మేరకు శనివారం చర్లపాలెం గ్రామాన్ని తిరుపతి రెడ్డి స్వయంగా సందర్శించి, రైతులతో కలిసి దారిని పరిశీలించారు. రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఏళ్ల తరబడి ఎదురుచూసిన సౌకర్యం ఇప్పుడు అందిందనీ, తిరుపతి రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకొని చేసిన మేలుకి సంతోషం వ్యక్తం చేస్తున్నాం అంటూ అభినందనలు తెలిపారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాన్ల నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమండ్ల నరేందర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్య క్షుడు నాగిరెడ్డి, పార్టీ నాయకులు బీరెల్లి పెద్ద మహబూబ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దర్గయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బీరెల్లి మహేందర్ రెడ్డి, ధర్మారపు మహేందర్, రామ్ రెడ్డి, చిట్టి మల్ల, మహేష్, కుర్ర సుధా కర్, ధర్మారపు వెంకన్న, టైగర్ మల్లయ్య, బుచ్చిరెడ్డి సుధాకర్, సింగారపు యాకన్న, యాదవకుల సంఘ అధ్యక్షుడు గజ్జి మల్లయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు ఎద్దు మహేష్ యాదవ్, యాకన్న యాదవ్, నరసయ్య యాదవ్, ఉబ్బుడు యాకన్న యాదవ్, సైదులు, ఐలేష్, ముఖేష్, జక్కుల మహేందర్, జక్కుల యాకన్న, యాదవసంఘ సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజనులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర - గూడూరు :** గూడూరు మండలం పొనుగోడు గ్రామ పంచాయతీలో ధారం శ్రీనివాసును స్పెషలాఫీసర్‌గా నియమించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన జాతి గౌరవ్ కేలో ధర్తీ ఆభా జనాభాగిదారి అభియన్ పథకం ద్వారా 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 4 ఉండడంతో ఆ ప్రాంతాలలో గిరిజనులు 700 తెగలు ఉన్నారని 5.5 కోట్ల గిరిజనులకు అదనంగా 63 వేలకు చేరుకున్నారని ఈ పథకం ద్వారా వారు అందరూ లబ్ది పొందారని అన్నారు. అక్టోబర్ 2, 2024న జార్ఖండ్ నుండి ఈ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహాత్మాగాంధీ జయంతి సందర్భం గా ప్రారంభించారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం విరిగిన ప్రాంతాల లో అనేక సదుపాయాలు కల్పించడం ఇల్లు, రోడ్లు, వైద్యం, విద్య జీవనో పాధి కల్పించి ప్రజలందరికీ మేలు జరిగేటట్లు ఈ పథకం రూపొందించ బడిందని దారం శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయ, కారోబార్ నన్నేసాబ్, లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫైజల్ అహ్మద్ జన్మదిన వేడుకలు

**విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి :** టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైజల్ అహ్మద్ పుట్టినరోజును సంగారెడ్డి జర్నలి స్టులు ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బందారు యాదగిరి ఆధ్వర్యంలో ఐబిలో జరిగిన కార్యక్రమంలో ఫైజల్ అహ్మద్ ద్వారా కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. పూలదండలు వేసి శాలువాతో సత్కరించారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు మొహమ్మద్ సిద్దిఖ్, రాష్ట్ర హౌసింగ్ కమిటీ సభ్యుడు అన్వర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ విలాస్ (విల్సన్) ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు మొహమ్మద్ ఆరిఫ్, మసూద్ ఇంతియాజ్, డేవిడ్, అన్వర్, మతీన్, రాజు, మురళి, హాజీ, మిన్ హాజ్, దయానంద్, శ్రీనివాస్, షౌకత్ అలీ, అబ్బు, సంతోష్, కృష్ణ, సతీష్, సాయి, శ్రీకాంత్, మల్లేశం, నాగేందర్, ఆమీర్, యూసఫ్, లడ్డు, తదితరులు పాల్గొన్నారు. టీఎస్జేవోస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ అలీ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌస్ హాష్మీ వేడుకల్లో పాల్గొని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బందారు యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ నాయకత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఫైజల్ అహ్మద్ ఆధ్వర్యంలో తమ యూనియన్ అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి ఫైసల్ అని కొనియాడారు. ప్రతి జర్నలిస్టుకు అండగా ఉంటూ అందరి సంక్షేమాన్ని కాపాడే నాయకుడు అని పేర్కొన్నారు.

# ప్రజల సమస్యలున్నంత కాలం కమ్యూనిజం మనుగడ సాగిస్తుంది

### సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**విశాలాంధ్ర - ఇల్లందు :** దేశంలో ప్రజల సమస్యలు ఉన్నంతకాలం కమ్యూనిజం మనుగడ సాగిస్తూనే ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా స్పష్టం చేశారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడే కమ్యూనిస్టులకు అంతం లేదన్నారు. ఆదివారం పట్టణంలోని 24 వ వార్డు కమ్యూనిటీ హాల్ ఏపూరి బ్రహ్మం మీటింగ్ హాల్‌లొ ఏర్పాటు చేసిన సిపిఐ పట్టణ 18వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ స్వతంత్రం కోసం ఆనాడు కమ్యూనిస్టులు ఎన్నో త్యాగాలు అర్పించారాని గుర్తు చేశారు. స్వాతంత్ర స్వేచ్ఛ ఫలాలు అందరికీ సమానంగా లభించాలని నేటికీ పోరాడుతూనే ఉన్నామని గుర్తు చేశారు. దశాబ్దాలుగా ఏలిన బూర్జువా పార్టీలతో విసిగి వేసారిన ప్రజలు నేడు కమ్యూనిజం వైపు చూస్తున్నారని తెలిపారు. నేటి సమాజంలోనూ నిజాయితీగల రాజకీయాలు ఉన్నాయని, కమ్యూనిస్టులు ఆచరణత్మకంగా ప్రజలలో భరోసా కల్పించాలన్నారు. ఇటీవల కాలంలో వేలాదిమంది ప్రజలు కమ్యూనిస్టు పార్టీలో చేరుకున్నారని గుర్తు చేశారు. వారికి సరైన నాయకత్వం వహించి లక్ష్యాసాధన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమాజంలో ప్రజల వైపు నిలబడి ప్రశ్నించే నాయకులను, ముఖ్యంగా యువతను తయారు చేసుకోవాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ క్యాడర్ను ముందుగానే సిద్ధం చేసి గెలుపు కోసం విశ ప్రయత్నాలు చేయాలని కోరారు. దశాబ్దాలుగా ఇల్లందు ప్రాంతం కమ్యూనిస్టులకు కంచుకోట లాంటిదన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యల కోసం పోరాడినప్పుడే ఏ పార్టీకైనా, నాయకుడికైనా మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. వందేళ్ళ సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి కమ్యూనిస్టు శ్రమించారని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న వందేళ్ళ వేడుకల్లో ఇల్లందు ప్రాంతంలో ఏదోవొక చారిత్రక కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మిరియాల రంగయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, ఇల్లందు పట్టణ, మండల కార్యదర్శులు బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ నజీర్ అహ్మద్, అసిస్టెంట్ సెక్రటరీ దాసరి రాజారాం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాస శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ రవీందర్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కమటం చంద్రకళ, వివిధ సంఘాల నాయకులు సదానందం, బొల్లి కొమరయ్య, కనక తార, ఉమ్మగాని హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సెక్యులర్ సోషలిజం అంటే ఆర్ఎస్ఎస్ బిజెపికి భయం ఎందుకు

**విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ :** సెక్యులర్ సోషలిజం పదాలంటే ఆర్ఎస్ఎస్ బిజెపికి భయం ఎందుకు, వాటి వల్ల వచ్చే నష్టమేందో సమాధానం చెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ పార్టీ సిపిఐ 22వ వార్డు పరిధిలోని కొండపల్లి గోపాల్‌రావు నగర్ కాలనీ సిపిఐ శాఖ కంకర బోర్డు సిపిఐ శాఖ మహాసభలకు చింతకుంట్ల వెంకన్న గారా రవిచంద్రబోస్ అధ్యక్షతన జరిగిన మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇటీవల ఆర్ఎస్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ, కొంతమంది వ్యక్తులు సెక్యులర్ సోషలిజం పదాలను తొలగించాలని కోర్టులో కేసు వేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇక తప్పు 11 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సెక్యులర్ దేశమైన మన దేశంలో కులాల మతాలు రెచ్చగొడుతూ తన పబ్బం గడుపుకుంటుందన్నారు. దేశంలో బిజెపి గ్రాఫ్ పడిపోతుందన్నారు. పూర్తిగా సీట్లు రాకపోయినా కొన్ని పార్టీల మద్దతుతో మనుగడ సాగిస్తుందన్నారు. ఆపరేషన్ కగారు పేరుతో ఛత్తీస్గఢ్ నల్లగుట్టలో మారణ హోమం చేస్తున్న బిజెపి మారణ హోమాన్ని ఆపాలన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా మహాసభలు జూలై 5, 6 కొరివిలో జరగబోతున్నాయని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్‌సారధి రెడ్డి, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, ఎండి మహమూద్మాలోతు రవీందర్, గార రవిచంద్రబోస్, కూరాకుల పాల్, తోట రమేష్, తండా శ్రీనాథ్, పూర్ణాచారి, ఓం ప్రకాష్, శ్రీనివాస్, సోమయ్య, ఐలయ్య, చరణ్ సాయి, శ్యామ్, ఉపేందర్, లక్ష్మీనరసు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

**విశాలాంధ్ర - తొర్రూర్ :** రానున్న స్థానిక ఎన్నికలలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సీతారాములు అన్నారు. ఆదివారం మండలములోని వెలికట్ట ఎంపీటీసీ పరిధిలోని నాలుగు గ్రామపంచాయతీల ఎన్నికల సన్నాహక సమావేశం వెలికట్ట గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని వారు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, ప్రమోద్, బిందు శ్రీను, కొండ వెంకన్న, ఎంపిటిసి పరిధిలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, అధ్యక్షులు, ఎంపీటీసీ, ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, సోషల్ మీడియా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వేముల రవి కుటుంబానికి ఆర్థిక సాయం

**విశాలాంధ్ర - నేరేడుచర్ల :** ఇటీవల అనారోగ్య కారణాలతో (బ్రేన్ డెడ్) ఐన వేముల రవికి మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ తరుపున వైద్య ఖర్చులు నిమిత్తం 40 వేల రూపాయలు 50 కేజీల బియ్యన్ని ఆర్థిక సహాయం ఆదివారం అందించారు. ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన్న వెంకట్ రెడ్డ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మల్యాద్రి, కొణతం రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ జితేందర్ రెడ్డి, మాల్యాద్రి చింతమల్ల సైదులు, మచ్చ శ్రీను రాణపంగా నాగయ్య, రామావత్ పాండు, గుంటూరు శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌పై మహా టీవీ చేసిన అసత్య ప్రచారంపై ఖండన

**విశాలాంధ్ర - కారేపల్లి :** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్‌పై మహా టీవీ చేసిన ఆసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బిఆర్ఎస్వీ జిల్లా నాయకుడు జూపల్లి రాము తెలిపారు. ఆదివారం కారేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహా న్యూస్ ఛానల్ పై దాడి చేశారని తెలంగాణ బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ని అక్రమంగా అరెస్టు చేయటం సరి కాదన్నారు. గతంలో ఇలాంటి థంబ్ నేల్స్ పెట్టి కేటీఆర్‌ను వ్యక్తిగతంగా అవమాన పరుస్తూ క్యారెక్టర్‌ని బదనాం చేసే విధంగా ఆంధ్ర మీడియాలో ప్రసారం చేయడం హేయమైన చర్య అన్నారు. మళ్లీ ఇలాంటివి జరిగితే బిఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చలేక కేటీఆర్ పైన ఫోన్ టాపింగ్ అని చెప్పి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెలంగాణలో తెరలేపిందనీ ఎద్దేవా చేశారు.

## నిస్వార్థ సైనికుడు సీతారాములు

**విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం :** కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని దశాబ్దాలుగా నిస్వార్థ సేవకుడిగా, సైనికుడిలా ప్రజల మధ్య వుంటూ శ్రమిస్తున్న టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములుకు అధిష్టానం రాష్ట్ర కార్పొరేషన్ పదవి ఇవ్వాలని సర్వత్ర జిల్లాలో డిమాండ్ వినిపిస్తుంది. ఏ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సీతారాములకు యాదవ సంఘ నాయకులు ఆత్మీయంగా సన్మానించారు. సుజాతనగర్ లోని ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘ అధ్యక్షులు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ పార్టీ కోసం సీతారాములు తండ్రి కూడా ఎన్నో దశాబ్దాలు సేవలందించారని గుర్తు చేశారు. భాగస్ సీతారాములు విద్యార్థి దశలోంచి కాంగ్రెస్‌ని నమ్ముకుని సైనికుల పని చేస్తున్నారని తెలిపారు. గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో తమ సామాజిక వర్గం నుంచి ఆయనకు టికెట్టును ఆశించామన్నారు. సంఘం నాయకుల ప్రోద్భలంతో సీతారాములు తొలుత ఎమ్మెల్యేగా తదుపరి ఎంపి ఎన్నికల్లో పోటీకి దిగినప్పటికీ కాంగ్రెస్ అధిష్టానం హామీ మేరు విత్ డ్రా చేసుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉందని ఇప్పటికైనా ఏదో ఒక కార్పొరేషన్ పదవిని సీతారాములకు ఇవ్వాలని నాగభూషణం కోరారు. అధిష్టానం ఇప్పటికైనా ఆయనకు రాష్ట్ర కార్పొరేషన్ పదవి ఇస్తే యాదవ సామాజిక వర్గానికి సముచిత గౌరవం ఇచ్చినట్టు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు అల్లాడి నర్సింహరావు, మాజీ వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మా రోషయ్య, ఖమ్మం యాదవ సంఘ పెద్దలు కోడి లింగయ్య, జడ మల్లేష్, చిత్తారు ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

## మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాష్టీకమే

**విశాలాంధ్ర - ఇల్లందు :** హైదరాబాద్‌లో మహా టీవీ హెడ్ ఆఫీసుపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ ప్రజావాణి వినిపించే మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాష్టీకంగానే పరిగణించాలని ఇల్లందు జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. మీడియాపై దాడిని ఖండిస్తూ ఆదివారం పట్టంలోని ప్రధాన రహదారి జగదాంబ సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఏదుట ఆందోళన వ్యక్తం చేశారు. మహా టీవీపై దాడి చేసిన గుండాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏ మీడియాలో నైనా కథనాలు, ప్రసారాల పట్ల అభ్యంతరాలు ఉంటే వివరణ కానీ ఖండన కానీ చేయొచ్చని లేదా చట్టపర చర్యలు కూడా తీసుకోవచ్చని అన్నారు. అంతేగాని గుండాల నేరుగా హింసాత్మక దాడులకు పాల్పడటం ఏంటని ప్రశ్నించారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలే ఇలా దాడులు చేస్తే సమాజంలో ప్రజాస్వామ్యం అదుపు తప్పుతోందని హెచ్చరించారు. మహా యాజమాన్యానికి జర్నలిస్టులు మద్దతు తెలిపి, సంఘీభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులతో పాటు పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా అబాకస్ మానసిక అంకగణిత పోటీ

**విశాలాంధ్ర - శేర్లింగంపల్లి:** శంషాబాద్ సమీపంలోని క్లాసిక్ కన్వెన్షన్-3లో ఆదివారం ఉదయం జరిగిన 21వ తెలంగాణ ప్రాంతీయ ఎస్ఐపీ ప్రాడిజీ పోటీ 2025లో రికార్డు స్థాయిలో 3,100 మంది పిల్లలు పాల్గొన్నారు. భారతదేశంలోని ప్రముఖ పిల్లల నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎస్ఐపీ అబాకస్ నిర్వహించిన ఈ కార్యక్రమం మానసిక చురుకుదనం మరియు విద్యా నైపుణ్యానికి పోటీ నిర్వహించింది. ఎస్ఐపీ ప్రాడిజీ అనేది వార్షిక అబాకస్ మానసిక అంకగణిత పోటీ. ఉత్సాహంతో నిండిన, "మానవ కాలిక్యులేటర్లు" అని పిలువబడే పిల్లలు కేవలం 11 నిమిషాల్లో 200 కి పైగా అంకగణిత సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించారు. ఈ పోటీలో వారి అబాకస్-ఆధారిత మానసిక గణిత నైపుణ్యాలను ప్రదర్శిం చారు. పోటీని ప్రారంభిస్తూ ఎస్ఐపీ అకాడమీ డైరెక్టర్ సిబి శేఖర్, "అబాకస్ గణితానికి అతీతమైనది. ఇది అవసరమైన జీవిత నైపుణ్యాలను - ఏకాగ్రత, వినడం, జ్ఞాపకశక్తి మరియు పోటీ స్ఫూర్తిని - నిర్మిస్తుంది - ఇవన్నీ విద్యా నైపుణ్యం, ఆత్మవిశ్వాసానికి పునాది వేస్తాయి" అని నొక్కి చెప్పారు. "ఏదైనా పోటీలో రెండు ఫలితాలు ఉంటాయి: ఒకటి విజేత, మరొకటి అభ్యాసకుడు. గెలవడం లేదా ఓడిపోవడం కంటే పాల్గొనడం ముఖ్యం - ఇది స్థితిస్థాపకత, ఎదగడానికి స్ఫూర్తిని పెంచుతుంది." ఈ కార్యక్రమానికి ముందు మీడియాతో మాట్లాడుతూ, శ్రీ శేఖర్ సంస్థ ప్రతిష్టాత్మక విస్తరణ ప్రణాళికలను పంచుకున్నారు. ప్రస్తుతం 23 భారతీయ రాష్ట్రాలు, 11 దేశాలలో ఉన్న ఎస్ఐపీ అకాడమీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, ఆస్ట్రేలియా, ఇతర ప్రపంచ మార్కెట్లకు విస్తరించాలని యోచిస్తోంది. ఇది రెండు దశాబ్దాలలో 1 మిలియన్ కంటే ఎక్కువ మంది పిల్లలకు శిక్షణ ఇచ్చింది.

## ఉచిత వైద్య పరీక్షలను ఉపయోగించుకోవాలి : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర - భద్రాచలం :** భద్రాచలంలొ నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సలను నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కోరారు. ఆదివారం కునవరం రోడ్ మారుతి నర్సింగ్ కాలేజీ ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, వికాసా తరంగణి, లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం, లైన్స్ క్లబ్ జటాయువు సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ ఆర్ ఐ వాసవి అసోసియేషన్ సహకారంతో ఎం ఎన్ జె క్యాన్సర్ హాస్పిటల్, పుష్పగిరి కంటి హాస్పిటల్ బృందంతో ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, నేత్ర శస్త్ర చికిత్స శిబిరంలో నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్పొరేట్ ఆసుపత్రుల ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. ఉచితంగా వైద్య సేవలు అందించడం కోసం సంస్థలు ఆస్పత్రి యాజమాన్యాలు శిబిరం నిర్వహించటం అభినందనీయ మన్నారు. నామమాత్రంగా కాకుండా ప్రజలకు ఆచరణాత్మకంగా వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మీడియాపై దాడులు చేసే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి

**విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ :** రాజకీయ నాయకుల సహకారం ప్రోత్భలంతోనే మీడియా, జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని ఈ పరిణామాల్లో మార్పు రాకుంటే సమాజానికి చాలా నష్టమని టీయూడబ్ల్యూజే (ఐ జె యు) జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ ఆరోపించారు. మహా న్యూస్ టీవీ ఛానల్ ఆఫీస్ పై రాజకీయ గుండాల దాడిని ఖండిస్తూ జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఆదివారం జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మీడియాపై దాడులు చేసే వారు ఏ స్థాయి వారైనప్పటికీ ఉపేక్షించకుండా క్రిమినల్ కేసులు పెట్టినప్పుడే ఇలాంటి దాడులు ఆగుతాయన్నారు. ఏమైనా తప్పుడు కథనాలు, వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి కానీ నేరుగా దాడులు చేయటం నేర ప్రవృత్తి కి నిదర్శనమన్నారు. మహా న్యూస్ టీవీ ఛానల్ ఆఫీస్ పై బి ఆర్ ఎస్ గుండాలు దాడి చేసి విధ్వంసం సృష్టించటం ప్రతి మీడియా సంస్థ పై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. మీడియా సంస్థపై జరిగిన దాడిని ప్రజాస్వామ్య వాదులు, సంఘాలు మద్దతు పలికి ఉద్యమించాలని కోరారు. ఈ దాడి చేసిన గుండాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారపక్షమైన, ప్రతిపక్షమైన మీడియా స్వేచ్ఛను కాపాడకపోతే సమాజానికి తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎర్రా ఈశ్వర్, లక్ష్మణ్, రాజేందర్, బాదావత్ దశరథ్, రాజేష్, ఖలీమ్, భాస్కర్, శివ కృష్ణ కృష్ణంరాజు, అనిల్, నరసింహారావు, శేఖర్, రవికుమార్, బాబు, నజీర్, మజీద్, రాందాస్, శ్రీను, కొప్పుల రమేష్, పిట్టల రమేష్ , గండికోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవ లక్ష్యాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**విశాలాంధ్ర - పెనుబల్లి :** వన మహోత్సవం కింద నిర్దేశిత లక్ష్యాన్ని అధికారులు ప్రణాళికా బద్ధంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, వన మహోత్సవ కార్యాచరణ, ఉపాధి హామీ పథకం అమలుపై పెనుబల్లి మండల ఎంపిడివో కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మానవ మనుగడకు చెట్ల ఆవశ్యకత దృష్ట్యా, వన మహోత్సవం క్రింద మొక్కలు నాటి, వాటి సంరక్షణ చేపట్టాలన్నారు. మొక్కలు నాటుటకు పటిష్ట ప్రణాళిక చేసి, కార్యాచరణ చేయాలన్నారు. ఏ మొక్క, ఏ రోజు, ఎక్కడ నాటుతారు, వాచ్ అండ్ వార్డ్ తదితర విషయాలు స్పష్ట పరచాలన్నారు. నాటిన మొక్కల పరిరక్షణ చేయాలని, వంద రోజులు వాటిని జాగ్రత్తగా కాపాడితే, ఆ తర్వాత అవి మనుగడ పొందుతాయన్నారు. నర్సరీల్లో ఎన్ని మొక్కలు లభ్యంగా ఉన్నవి, మొక్కలు నాటుటకు ఎన్ని ప్రదేశాలు గుర్తించింది ప్రణాళికలో ఉండాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కొరకు 8 ఫీట్ల పైబడిన ఎత్తు గల మొక్కలు నాటాలన్నారు. హైవే ఎంత పరిధి ఉన్నది చూసుకొని, రోడ్డుకిరువైపుల కిలోమీటర్ కు 400 చొప్పున మొక్కలు నాటుటకు కార్యాచరణ చేయాలన్నారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత సంబంధిత గ్రామ పంచాయతీకి అప్పగించాలన్నారు. ఉపాధి హామీ క్రింద మండల టార్గెట్ ను కలెక్టర్ సమీక్షించారు. ఎన్ని పని దినాలు, ఏ ఏ పనులు చేపట్టారు, మేజర్ పనులు ఏవి చేపట్టినవి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉపాధి హామీలో మెటీరియల్, వేజ్ క్రింద ఎంత మొత్తం ఖర్చయింది అడిగి తెలుసుకున్నారు. ఫిష్ ఫాడర్ పాండ్స్ తో ఉపాధితో పాటు, ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ సమీక్షలో కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, పెనుబల్లి ఎంపిడివో డి. అన్నపూర్ణ, తహశీల్దార్ నారాయణ మూర్తి, ఏపివో బి. మధుసూదన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల వేడుకలు

**విశాలాంధ్ర - కారేపల్లి :** సింగరేణి మండల పరిధిలోని బొక్కలతండా గ్రామంలో ఆదివారం ఆషాఢమాస బోనాల వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గ్రామదేవతలకు మహిళలు నీళ్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువతులు, మహిళలు గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరారు. మేళతాళాలు, డప్పు నృత్యాలు మధ్య మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో గ్రామంలో తిరిగి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. కారేపల్లి రోడ్డు సమీపంలో ఆలయంలో నాఅభిశయులకు బోనాలు సమర్పించి ఆలయంలో పూజలు జరిపారు.బోనాల వేడుకల్లో దేవతామూర్తుల వేషదారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.దీంతో బోనాల వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ బోనాల సమర్పణల కార్యక్రమంలో గ్రామ పెద్దలు బానోతు రాందాస్, అజ్మీర భావుసింగ్, అజ్మీర నారాయణ, పత్య, బాబులాల్, హతిరాం, రాంబాబు, కుమార్, లక్మ తదితరులు పాల్గొన్నారు.

# తరగని వ్యధను తెరకెక్కించిన నాటకం మట్టిమనిషి

సాహితి

డా. సమ్మెట విజయ

మట్టిమనిషి వాసిరెడ్డి సీతాదేవి రచించిన సాంఘిక నవల. గుంటూరు జిల్లాలోని వ్యవసాయ కుటుంబాల నేపథ్యంలో మూడు తరాల జీవిత చిత్రాలను చిత్రీకరించినటువంటి నవలగా మట్టిమనిషి మలచ బడింది. ఈ నవల ప్రత్యేకత 14 భారతీయ భాషలలోకి అనువదింపబడడం. ఇది రైతు, దళారి వ్యవస్థ మధ్య ఉన్న సంఘర్షణని చిత్రీకరించినటువంటి నవల. ప్రధాన పాత్రధారి సాంబయ్య అనే రైతు. ఈ నవలలో సాంబయ్యకు భూమిపట్ల గల ప్రేమను కళ్ళకు కట్టినట్లు చూపించారు. భూమి అనేది రైతు జీవితంలో ఎంత ముఖ్యపాత్ర పోషిస్తుందన్నది ఈ నవలలో ప్రస్ఫుటంగా వివరించే ప్రయత్నం చేశారు వాసిరెడ్డి సీతాదేవి.

39కి పైగా నవలలు 100కిపైగా కథలు రచించినటు వంటి ప్రముఖరచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి. వీరి మరీచిక నవలను ఆనాటి ప్రభుత్వం నిషేధించింది. ఆ తర్వాత అది తొలగిపోయింది. సీతాదేవి 1970ప్రాంతాల్లో మట్టిమనిషి నవలను రచించారు. కొన్నినవలలు ప్రజానాయకుడు, మన స్నాక్షి, ఆమెకథ, మృగతృష్ణ మొదలైనవి సినిమాలుగా వచ్చాయి.

జవహర్ బాలభవన్ డైరెక్టర్‌గా, ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పనిచేశారు. కొన్ని అనువాదాలు కూడా చేశారు. 5సార్లు ఆంధ్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకుని, రచయిత్రిగా ప్రత్యేకస్థానం పొందారు వాసిరెడ్డి సీతాదేవి.

ఈ నవల నాటకీకరణకు పూనుకున్న రచయిత వల్లూరు శివప్రసాద్ కథా, నాటక రచయితగా సాహితీలోకంలో విశేషంగా కృషి చేస్తున్నారు. 100కి పైగా రచించిన కథల్లో 35కి పైగా బహుమతులు పొందినవి. వీరు రచించిన కొరివి కథకు స్వాతి అనిల్ అవార్డు కథలపోటీలో 25వేల బహుమానం అందు కున్నారు. అనేకమైన నాటికలు రచించారు. 25 నాటికల సంపుటి, ఆరు కథా సంపుటులు వెలువరించారు. శ్రీచక్రం, హింసధ్వని, ఎడారికోయిల, మిస్సెడ్ కాల్స్, ధ్వంస రచన, క్షతగాత్ర గానం, వానప్రస్థం, ఇంటింటి భాగోతం వంటి అనేక నాటికలు, నాటకాలు, శ్రవ్య నాటికలు రాశారు. అరసం ప్రధాన సంపాదకులుగా విభిన్న సంపుటాలను 100కు పైగా వెలువరించారు. నాటిక, నాటకాల సంకలనాలను ప్రచురింపచేశారు.

మట్టిమనిషి నాటకీకరణ చేసి మొదట్లో నాలుగుగంటల నాటకంగా గతంలో ప్రదర్శనలిచ్చారు. ప్రస్తుతం 3గంటలకు కుదించి ఈ నాటకాన్ని ఇటీవల రంగభూమిలో మే నెల 31, జూన్ 1వ తేదీ రెండురోజులు ప్రదర్శన ఏర్పాటుచేశారు. విజయవంతంగా రెండూ ప్రదర్శనలు జరిగాయి. నాటకం చూసేందుకు సీతాదేవి మనవరాలు కుమారి సంజన వచ్చి నాటక సమాజానికి 50వేల నగదు పారితోషికం అందజేశారు.




మట్టిమనిషి నాటకం దర్శకత్వం చేసినవారు యస్.యం. బాషా. అనేక నాటకాలలో నటించి, దర్శకత్వం వహించిన బాషా స్వయంగా ఈ నాటకంలో కీలకమైన కనకయ్య పాత్రలో నటించి గొప్పగా రక్తికట్టించారు. నాటకానికి నిండుతనం చేకూర్చేలా ఆ పాత్రలో తనదైన నటనను ప్రదర్శించారు.

మట్టిమనిషి పెద్ద నవల. రైతుకు భూమికిగల అనుబంధాన్ని విభిన్న దృక్కోణాల నుంచి చిత్రించిన నవల. వీరభద్రయ్య దగ్గర పాలేరుగా వెంకయ్య పని చేసేవాడు. ఆ పాలేరు వెంకయ్య కొడుకు సాంబయ్య. యజమాని అయిన వీరభద్రయ్య కొడుకు బలరామయ్య. బలరామయ్య కూతురు వరూధిని. సాంబయ్య కొడుకు వెంకటపతి. తండ్రి పాలేరుగా పడిన అవస్థ నుంచి బయటపడి, ఏనాటికైనా తనకు కొంతభూమి సమకూర్చుకుని స్వంతంగా వ్యవసాయం చేసి, ఆ భూమిని క్రమంగా పెంచు కుంటూ పోవాలన్న తాపత్రయం సాంబయ్యది. దానికోసం చాలా కష్టపడి భూమిని కంటికి రెప్పలా చూసుకుని క్రమక్రమంగా కొన్ని ఎకరాల భూమి, ఇల్లు సంపాదిస్తాడు.

ఈ క్రమంలో భార్య కష్టం కూడా తోడ్పడుతుంది. భార్య పురిటి నొప్పులతో ఉందని తెలిసి పంటనూర్పిడి కూలీలకు అప్పగించి భార్య దగ్గరకు వస్తాడు. మగబిడ్డ పుట్టాడని మురిసి పోయాడు. కానీ భార్య అనారోగ్యంతో ఉందని పట్నం ఆసుపత్రికి తీసుకువెళ్ళాలని నాటు వైద్యుడు చెప్పగానే ఖర్చుకు వెనుకాడి తగిన నిర్ణయం తీసుకోలేకపోతాడు. ఫలితంగా భార్యను కోల్పోతాడు. పొలం పనుల ధ్యాసలో వేరే వివాహంచేసుకోకుండా కొడుకు వెంకటపతిని కూడా తన బాటలో నడిపిస్తాడు.

పెంచుకున్న భూమి తనలో అహం పెంచింది. ఏ యజమాని దగ్గర తన తండ్రి పనిచేశాడో అదే యజమాని మనుమరాలైన బలరామయ్య కూతురు వరూధినిని తన కొడుకు వెంకటపతికిచ్చి పెళ్లి జరిపించాడు. వరూధిని కోడలిగా ఇంట్లో అడుగు పెడుతుంది. మొగదిక్కులేని ఇంటిని అందంగా తీర్చిదిద్ది ఇంటిని, తన భర్తను అధీనంలోకి తీసుకుంటుంది.

పట్టణ నాగరిక జీవితానికి ఆకర్షితురాలైన వరూధిని మామ సాంబయ్య కష్టార్జితమైన భూమిని దౌర్జన్యంగా తెగనమ్మించి సినిమా హాలు కట్టిస్తుంది. ఈ క్రమంలో రామనాథబాబనే వంచకుడ్ని నమ్మి తన సర్వస్వం అర్పించి మోసపోతుంది. కుటుంబ పతనానికి కారకులై చనిపోతుంది. భర్త వెంకటపతి తండ్రికి ముఖం చూపలేక కొడుకైన రవిని సాంబయ్య ఉండే ఊరికి పంపి ఎటో వెళ్ళిపోతాడు.

మనవడు రవి రాకతో సర్వంకోల్పోయిన దుఃఖంలో ఉన్న సాంబయ్యకు ప్రాణం లేచివస్తుంది. తన వారసుడికి పొలం సమ కూర్చాలన్న పట్టుదలతో బంజరుభూమిని సాగుచేస్తాడు. ఈ క్రమంలో తాతామనవడి సంభాషణలు హృదయానికి తాకి రైతుకు పొలంపట్ల మట్టితోఉన్న అనుబంధాన్ని కళ్లకు కట్టిస్తాయి.

తీరా పంటచేతికి వచ్చే సమయానికి కనకయ్య ఆ బంజరు ప్రభుత్వం స్వతంత్ర సమరయోధునికి ఇచ్చిన భూమి అని పోలీసులను తీసుకొస్తాడు. చేతికొచ్చిన పంట భూమి తనది కాకుండా పోతుందన్న విషయాన్ని జీర్ణించుకోలేక గుండె పగిలి ఆ మట్టిలోనే ప్రాణం విడుస్తాడు సాంబయ్య. తాత కళ్లముందే చనిపోవడం తట్టుకోలేక చిన్నవాడైన రవి కర్రతో కనకయ్యని కొట్టబోగా అది పక్కన ఉన్న ఫ్రీడమ్ ఫైటర్‌కి తలకు తగిలి గాయం అవుతుంది. కనకయ్య ప్రోద్బలంతో హత్యాప్రయత్నం చేశాడని పోలీసులు రవిని అరెస్ట్‌చేస్తారు. రవి, 'తిరిగి వస్తా నీ అంతుతేలుస్తా' అనడంతో కథ ముగుస్తుంది.

ఇంత పెద్దకథనాన్ని నాటకంగా మలచడం ఆషామాషీ కాదు. మొదట నాటకీకరణ చేసినప్పుడు నాలుగు గంటలకు పైగా వచ్చిన నాటకాన్ని కుదించి మూడు గంటల ప్రదర్శనగా మలిచారు వల్లూరు శివప్రసాద్. అయినా నాటకం మూడు గంటలపైన సాగింది. మధ్యలో పది నిమిషాల విరామం ఇచ్చి నాటకం కొనసాగించారు.

నాటకం ముందు ప్రస్తావనతో మధ్య మధ్య జరిగే కథనం వ్యాఖ్యానంతో సురభి నిఖిలేశ్, సురభి ప్రియాంక అందరినీ ఆకట్టుకున్నారు. ప్రధాన పాత్రధారి సాంబయ్య పాత్రను మొదటి దశలో భుజంగరావు, తర్వాత దశలో రాజర్షి ఇరువురూ తమ పాత్రలకు న్యాయం చేశారు. అద్భుతమైన నటనను ప్రదర్శించారు. వరూధిని పాత్రలో షణ్ముఖి పూర్తిగా పాత్రలో ఇమిడిపోయే నటనను ప్రదర్శించింది. నాటకంలో వరూధిని పాత్ర నిడివి ఎక్కువ అనిపించినా నవల రచనా పరంగా అది తప్పనిసరి.

నాటకం ఆద్యంతం రకరకాల హావభావాలతో, సమయాను కూల స్పందనలతో కనకయ్య పాత్రధారి అయిన నట దర్శకుడు యస్.ఎం. బాషా పాత్రౌచిత్య నటనతో అందరినీ అలరించారు. నటన, దర్శకత్వం రెండు బాధ్యతలను స్వీకరించి తదనుగుణంగా సమర్థవంతంగా నాటకాన్ని నడిపించారు.

కొడుకు వెంకటపతిగా గోవర్ధన్ అమాయకంగాను, రామనాథ బాబుగా ఎస్.కె.టి. హాసన్ మోసకారిగాను చక్కని నటనను అందించారు. నాటకంలో ఇతర పాత్రలలో సోల్జర్ షఫీ, మాధవి, మధుకర్, స్వరాజ్ కుమార్, రత్నరాజ్, ధానిష్ అలీ, సుజిత్ రామకృష్ణ, దేవేశ్, సాయికిరణ్ గుర్రం, వై.వి.ఆర్ ఆచార్యులు, దాక్షాయని చిత్కళ, దివ్య, రూపానికి, వంశీ, సంధ్య, తదితరులు నటించగా నాగరాజ్, మరికొందరు సంగీతం, ఆహార్యం, ఇతర సాంకేతిక సహాయ సహకారాలు అందించారు.

ఇంతమంది కళాకారులను సిద్ధం చేసుకుని సమన్వయం చేసుకుంటూ చేసిన ప్రయత్నం గొప్పది. దీనిని మరింత ఆకట్టుకునేలా చేసేందుకు, మొదటి చివరి సన్నివేశాలలో ఉన్న మట్టిమనిషి ప్రాధాన్యతను మరింత పెంచి వరూధిని పాత్ర కొంత తగ్గించవచ్చనిపించింది. నాటకంలోని సాంబయ్య మనవడు రవితో అన్న మాటలతో శ్రమ విలువ తెలుస్తుంది.

'మనిషికి సంతోషం ఎక్కడుందంటావు? కష్టపడి పని చేయడంలో ఉంది. చెమటోడ్చి భూమిదున్నడంలో ఉంది. రెక్కల కష్టం అక్కరకు రావడంలో ఉంది. మన కష్టార్జితం మన చేతుల్లోకి వచ్చే ఆనందాన్ని మించినది మరొక్కటి లేదురా.. అంటాడు రవితో.

బడిలో చదివే విద్యార్థికి పొలంలో పనిచేసే రైతుకి సామ్యం చెప్పే ఒక గొప్ప డైలాగ్ సాంబయ్య మనవడితో అంటాడు. "ఈ నేల నా పలక. నాగలే నా బలపం. పొలమే నా బడి. భూమిమీద దిద్దాను. రోజుకు ఒక్కొక్కమాట ఈ భూమే నాకు నేర్పింది. నా తల్లి, దైవం, గురువు ఈ భూమేరా రవీ! ఇప్పుడు చెప్పరా మనవడా నీ బడి గొప్పదా నా బడి గొప్పదా?"

పొలాన్ని బడిగా మార్చుకున్న మట్టిమనిషి జీవన రేఖా నాటకమిది.

దళిత చైతన్యం నింపుతూ, వస్తాను భూమిని ఆక్రమించే వారి పని పట్టడానికి అని చెప్పడం ఆశావహ దృక్పథం కలిగిస్తుంది చివరిగా.

'మట్టిలో పుట్టిన వాడ్ని/మట్టిమీద బతికినవాడ్ని / మట్టిలో కలిసిపోతున్న వాడ్ని/వంటిమీద మట్టిఉండక / మరి బంగారం ఉంటుందా !' – అని ప్రశ్నించిన పాత్ర మట్టిమనిషి. మట్టిమనిషిని మాత్రమే హైలైట్ చేసే నాటకంగా మరింతగా మెరుగులు దిద్దితే ప్రేక్షకుల మనసులలో నిస్సందేహంగా కలకాలం నిలిచి ఉండే నాటకం, మట్టి మనిషి.

## ఆశల మబ్బులు రాల్చే చినుకు కోసం

ఎస్.ఆర్.పృథ్వి
సెల్: 9989223245

మట్టిలోంచి పచ్చదనం చిగురించాక
మనిషి, మౌనంలోంచి కళ్లు తెరిచాడు
నేతగాడు వస్త్రం సృష్టించాక
దిశ మొలకి అలంకారమైన
ఆకులు అలమలు విడిచి
ఆధునీకుడయ్యాడు
విశ్వాన్ని, అరచేతిలోకి తీసుకునిపుడు
ప్రజల్ని పాలించే రాజయ్యాడు
అభివృద్ధి అట్టహాసం చేస్తూ
విను వీధుల విహరిస్తా ఉంది
మేధస్సులోంచి
యంత్రం పురుడు పోసుకున్నాక
ఆ యంత్రమే చేతివృత్తుల్ని చిదిమేసింది
నేతగాడు, ఊహలకి రంగులద్ది
వస్త్రం అందానికి మెరుగులు దిద్దాడు
వేళ్లకి నాట్యంనేర్పి కళలకి జీవంపోశాడు
ముడిసరుకు, మూతి
ముడుచుకొంటున్నప్పుడు
పేదరికం పెన్నిదై పొంగి
నేతగాడి బతుకుతో
దొంగాట మొదలుపెట్టింది
పెట్టుబడిదారీ వర్గం
పచ్చని పొలంలో విస్తరించింది
పంట పండించేది శ్రామికుడు
పంట అమ్ముకుని
లాభపడేది పెట్టుబడిదారుడు
వస్త్రం నేసేవాడు కూలివాడై
పస్తుల పక్కమీద వాలిపోతున్నాడు
మగ్గమిపుడు మూగబోతోంది
మెతుక్కి దూరమౌతా ఉంది
నేతగాడి చూపుల్లో
ఆశలసౌధాలు కూలిపోయి
నూలిపోగే కంఠానికి
ఉరితాడై బిగుసుకొంటా ఉంది
నేతను నమ్ముకున్న వాడి
జీవనయాత్రకి భరోసా కావాలి
ఇచ్చేవాడి కోసమీ వర్గం
వేల కన్నులు ఆశగా...

## 'భువనవిజయం' గ్రంథావిష్కరణ సభ

డాక్టర్ జి.వి.పూర్ణచందు రాసిన 'భువనవిజయం–రాయలకాలం నాటి కథలు, గాథలు' గ్రంథావిష్కరణ సభ జూలై 5వతేదీ శనివారం సాయంత్రం6గంటలకు విజయవాడ గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో జరుగుతుంది. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగే సభలో ఆం.ప్ర. ప్రభుత్వం హై పవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు ముఖ్య అతిథిగా విచ్చేసి గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. అతిథులుగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, సమాచార హక్కు పూర్వ కమిషనర్ ఐలాపురం రాజా, ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు పాల్గొంటారు. సాహితీ విశ్లేషకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథావలోకనం చేస్తారు.

డాక్టర్ జి.వి.పూర్ణచందు, శతాధిక గ్రంథ రచయిత, 94401 72642

## 'ఓమారు వెనక్కి వెళ్లిరావాలి' ఆవిష్కరణసభ

డాక్టర్ కె. దివాకరాచారి కవితాసంపుటి 'ఓమారు వెనక్కి వెళ్ళిరావాలి' ఆవిష్కరణ సభ జూలై 6వతేదీ ఆదివారం ఉదయం 10గంటలకు హైదరాబాద్, రవీంద్రభారతి మినీ హాల్‌లో జరుగుతుంది. సభకు నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. నిఖిలేశ్వర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. సభలో ఎన్. వేణుగోపాల్, నాళేశ్వరం శంకరం, కవి యాకూబ్, పి. జ్యోతి, ఆనంద్ ప్రసంగిస్తారు.

## తెలుగు సాహితీసమితి ఆహ్వానం

తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు సాహితీసమితి వారి ఆధ్వర్యంలో ఈ నెల 30న సోమవారం మధ్యాహ్నం తెలుగు అధ్యయనశాఖలో 'కథా సాహిత్యం–గ్రామీణ జీవనం'అనే అంశంపై రచయిత ఆర్.సి.కృష్ణస్వామిరాజు ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆచార్య కొలకలూరి మధు జ్యోతి అధ్యక్షత వహిస్తుండగా సాహితీసమితి సలహాదారు డాక్టర్ వై.సుభాషిణి, తెలుగుశాఖ విద్యార్థినులు పాల్గొననున్నారు.

# పలకరించే కొద్దీ పెనవేసే 'దాపల'

కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ

గ్రంథ సమీక్ష

'గాయం ఒక కథ/వినే కొద్దీ
వెంటపడుతూనే ఉంటుంది
బతుకు ఊకొడుతూనే ఉంటుంది/
గాయం ఒక కవిత/పలకరించే కొద్దీ
పెనవేస్తూనే ఉంటుంది
మనసు మెలిపెడుతూనే ఉంటుంది
'గాయ'కులు/ పాత్రలుగా మారిపోయే వేదికమీద
జీవితం/ఒక ధారావాహిక" (పొద్దుపాట)

ఒక బడిపంతులు కథ ఇది. ఒక అభ్యుదయకవి కవిత ఇది. ప్రగతి బాట చూపే గానం ఇది. ఈ పంతులుగారు వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయం అంటే ఆయనకు ఎంతోఇష్టం. ఆశ్చర్యపోకండి. ఆ వ్యవసాయమే కాదు, సాహితీ వ్యవసాయం కూడా. ఈ వ్యవసాయమూ గిట్టుబాటు కాని కాలమే ఇది. అయినా ఆగని కవనం. కాడిని చూసినా మేడిని చూసినా, నాగలి కర్రుని చూసినా ఎద్దు అర్రుని చూసినా ఈ కలం ఆగదు. 'గులాబిరంగు పురుగుపట్టిన చెట్టు'ను చూసినా, 'తొక్కిడిబడ్డ నారుమడి' గట్టును చూసినా, ఏదో రహస్యాన్ని దాచుకున్న 'ఏటొడ్డు'ను చూసినా ఒకటే అలజడి. అదో మథనం. ఒకప్పుడు 'బతకలేక బడిపంతులు'. నేడట్టా కాదు. మరెందుకు ఈ తిప్పలు? ఈ రవికి. ఓ కవికి.

'పలనాడు వెలలేని మాగాణిరా!' అన్నారు అలనాటి పల్నాటి అభ్యుదయ కవి పులుపుల వేంకట శివయ్య. ఆ మాగాణం అందించిన ఈతరం కవితాకర్షకుడు కోసూరి రవికుమార్. ఆయన ఇటీవల పండించిన పంట 'దాపల' కవితా సంపుటి. అచ్చమైన వ్యవసాయ పదం, స్వచ్ఛమైన తెలుగు పదం 'దాపల'. అరకకు కట్టిన ఎడ్లని ఎలపటెద్దు, దాపటెద్దు అని అంటారు. ఎలపల అంటే కుడివైపు, దాపల అంటే ఎడమవైపు. సమాజానికి మార్గదర్శనం చేయడంలో రవి కవిత కూడా దాపలే అంటారు పరిచయ వాక్యాల్లో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ. కవి ఎక్కడోచోట ఎప్పుడోకప్పుడు గాయపడితేనే కవిత పుడుతుంది. కవితే కాదు, మరే రచన అయినా. అందుకే గాయమే కథ, కవిత, గానం అన్నారు రవి.

"ఏటొడ్డు ఒక స్నేహితుడు/ ఎన్ని వింతలు చూపి/నన్ను తీరంచేర్చిందో!/........./నా ఏటొడ్డు/ఇప్పుడు మాత్రం/ కొంగు బిగించినా ఒక స్త్రీ/ ఏదో లోహపు గొట్టం/ తన రెల్లు పైటలోంచి తొంగి చూస్తోంది/ బహుశా అది ఆయుధమేనేమో!/తప్పనిసరి ఆయుధమై/ఎవరికోసమో మాటేసి వున్నట్లుంది ఏటొడ్డు/... ... .../పసిపంటమీదికి ఎగబడ్డ పశువుల కోసం/పంటను చెరిపేసే అడవి పందుల కోసం/ కాపేసే వున్నట్లుంది ఏటొడ్డు/ఇపుడు ఏటొడ్డు ఒక స్నేహితుడే కాదు/మృగం కోసం మాటేయటాన్ని నేర్పే/మార్గదర్శకుడు కూడా."(ఏటొడ్డు)

నాగులేరు పల్నాటి మధ్యలోంచి ప్రవహిస్తుంటే ఓ పక్కన కృష్ణమ్మ పరుగులెత్తుతుంది. ఆ ఏటిగట్ల సహచర్యం చెప్పిన రహస్యాల్ని అలా మనకు అందించారు కవి.

"జెల్లకొట్టిపోయినవానకారు,
కొల్లగొట్టిపోయిన వరద జోరు
మట్టిగొట్టుకు పోయిన మట్టి కట్టలతో
నీళ్ళొదిలేసుకున్న నేల మాట్లాడే
రెండు మాటలూ... నొప్పి...నొప్పి.../........./ ఏడీ... ఎవడూ రాడేం...
ఈ నొప్పిని తొలగించే కత్తెర తీసుకురాడేం
శస్త్ర చికిత్సల కోసం బల్లను సిద్ధం చెయ్యడేం
రాడు...ఎవడో రాడు.../నేనే బయటకు రావాలి/బతికి బతికించటం కోసం/ ఈ రాత్రికి రెక్కలు సరిచేసి/పగట్లోకి ఎగరేసి తీరాలి"(నొప్పి)

ఇది నేల బాధ. అంతేనా! కాదు; నేలను నమ్ముకున్న రైతు బాధకూడా. దానికి సహానుభూతి పొందుతున్నాడిక్కడ కవి. అక్కడితో ఆగక ఇంకేదో కూడా చేస్తానంటున్నాడు. అదేంటో మీరే చదవండి.

"అమ్మ నిజంగా గోరింటాకే/ చేతికి ఉన్నంతసేపూ అర్థంకాదు/పండిన అరచేతులు చూసుకున్నప్పుడే/ఆమె హృదయం అర్థమవుతుంది/... ... .../
అమ్మా, ఆమే/ రూపాలు మారినా
వాళ్ళ ప్రేమలో మార్పు లేదు/ నన్నూ నా రూపాలనూ
వెలిగించే మట్టి ప్రమిదలు/ మనిషిచెట్టుకు పూసిన వెన్నపూలు"(మట్టి ప్రమిదలు)




దాపల (కవితా సంపుటి) - కోసూరి రవికుమార్
ప్రచురణ: అభ్యుదయ రచయితల సంఘం(అరసం), గుంటూరుజిల్లా శాఖ
పుటలు:110; వెల: రూ.120/-

అమ్మ గురించీ ఆమె గురించీ ఎంత బాగాచెప్పారు, కవిగారు. అమ్మ సరే, మరి ఆమె ఎవరు?

వ్యవసాయం ప్రధానమైన ఈ దేశంలో రైతు ప్రాధాన్యత ఏమిటో చెప్తున్నారు కవి ఇలా...

"నేల నాలుగు దిక్కులనూ చెక్కి/ చెమట చుక్కల్ని వరుసల్లో చల్లి/ ప్రతి ఏటా మొలకెత్తుతాడతడు/ నేల నడుముకు/ పచ్చటి సిగ్గు వస్త్రమై నిలుస్తాడు/... ... ...
అతను లేకపోతే/ నేల అంగారక గ్రహమై పోదూ!
నడిచే మనుషులంతా/ అంతరిక్ష జీవులై పోరూ!
ధర్మజుడి నెత్తుటి సంగతేమోగానీ
ఇతడి కంటినీరు ఇంకిన చోట
మిగిలిన కాసింత పచ్చదనమూ
పరాయిదై పోదూ..."(పోరు)

అంతేనా, కోపం అంటే తెలియని రైతు కోపగిస్తే ఎలా ఉంటాడు? ఏమంటాడు?

"ఎన్ని ప్రాణాలు పలుపులుకు ఏలాడేసుకుంటాం?
ఎన్ని గాదెలపంటను
నడిరోడ్లో నగుబాటు చేసుకుంటాం?
అందరి ఎండిన ఎంగిలి చేతుల మీద ఆన
నిండిన మాకుండలమీద ఆన/పండిన పంటలమీద ఆన
మీరు దిగొచ్చేదాకా/గెనుమ్మీంచి దిగేదే లేదు,
రేపటికి నేనుండక పోతే,/మీరుంటారాంట?!"(ఆన)

ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధరకల్పించని ప్రభుత్వాన్ని నిలదీసిన రైతువిసిరిన సవాలిది.

"కొన్ని మెతుకుల కోసమో, కాస్తంత నీడ కోసమో
నిన్ను నువ్వే సమూహంలో పోగొట్టుకున్నాక
వెతుకులాటకూ, బతుకుపాటకూ నువ్వే వంత
నిన్ను వెతుక్కునేందుకు/ నాగలికర్రొకటి తీసుకునిరా"(నాగలికర్రొకటి తీసుకునిరా)

అరాజకీయపు ఆకర్షణలకు ఆశలకు లోనయితే జరిగేది ఇదే. అస్తిత్వం కోల్పోయిన మనిషి ఇలా తనను తాను వెతుకులాడుకోవాల్సిందే.

"రాళ్ళ చాటునుంచి తొంగిచూసిన నేల
రాళ్ళు మయమై రూపాయిలైపోతున్నకాలం
గడ్డికోసం మోరెత్తిన దున్నకుర్రా
గులాబీరంగు పురుగు నోటిలోంచి
సగం చేతులార్చిన పత్తిపువ్వూ
దూసరవర్ణ చిత్రాలే అన్నీ" ('కొత్తపల్నాడు కోసం')

ఈ కవిత చదవగానే చటుక్కున 15వ శతాబ్దం నాటి శ్రీనాథమహాకవి చెప్పిన చాటుపద్యం గుర్తుకురాక మానదు.

"చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగులేటి నీళ్ళు నాపరాళ్ళు
సజ్జ జొన్న కూళ్ళు సర్పంబులును దేళ్ళు
పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు"

ఆరు శతాబ్దాల అనంతరం నేటి మన రవి కవి చెప్పిన కవితా సారాంశానికీ శ్రీనాథ కవి పద్య భావానికి ఏమంత తేడా లేదనిపిస్తుంది.

"ప్రజలే నాయకుడి తయారీదారులుగా ఉండేవాళ్ళు ఒకపుడు/నాయకులే ప్రజల్ని తయారు చేసుకుంటున్నా రిపుడు"('కొత్త పల్నాడు కోసం') పల్నాటి నేటి స్థితికి మూల కారణం గుట్టును ఇలా రట్టు చేశారు.

"విస్తరిస్తున్న రోడ్లమీదా/ కుంచించుకుపోతున్న జలనిధులమీదా/ మురిగి ముదనష్టం అవుతున్న/రాజకీయం మీద అభివృద్ధి పేరిట/అలుక్కుపోతున్న చూపుమీదా/ కొత్త ఆలోచనలను/మొలిపించుకోవాలి/ కొత్తపల్నాడును చెక్కుకోవాలి"('కొత్తపల్నాడు కోసం')

అని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాడు. నిజానికి కొత్తపల్నాడునే కాదు కొత్త దేశాన్ని చెక్కుకోవాలి.

పల్నాటికి ఆ పక్కగా ఉన్న నల్లమల అడవి అస్తిత్వాన్ని, రూపురేఖల్ని కోల్పోతున్న దృశ్యాల్ని, సంగతి సందర్భాలను తలుచుకొంటూ

"చెల్లీ నల్లమలా/ నువ్వేం బుగులు పడగాక
ఆదరినేసిన బాణాలే ఈదరినా చాదుతాం
ములుకులకు పాషాణం పూసిమరీ ఏస్తాం
... ... ...
చెల్లీ నల్లమలా/బుగులు పడగాక/ నీకోసంనగరం నుంచి
కొన్ని గొంతులు కదిలొస్తున్నాయ్..."( చెల్లీ నల్లమల!)

అంటూ పర్యావరణ పరిరక్షణను, ఖనిజ సంపద దోపిడీపై తిరుగుబాటును సంకేతిస్తున్నాడు.

ఇలా సాగింది రవికుమార్ చేసిన 'దాపల' కవితా వ్యవసాయం. ఈ సంపుటికి ప్రముఖ కవి, సాహితీవేత్త డా.పాపినేని శివశంకర్ 'పచ్చని పల్నాటి కవిత' అని చక్కని ముందు మాట రాశారు. రవికుమార్ కవితాత్మను మరింత అందంగా, కళాత్మకంగా ఆవిష్కరించారు. తులనాత్మకంగా విశ్లేషించారు. "బాధపడుతుందేగాని, ఎవర్నీ బాధిం చటంలా. కోప్పడుతుందే గాని ఎవర్నీ ద్వేషించటంలా. ఎక్కడైనా చిన్న మొట్టికాయ వేస్తుందే గాని గాయ పరచటంలా. ఆ మృదుత్వం ఏదో కవి హృదయంలోనే దాగి ఉంది." అంటారు పాపినేని. అరసం 80వ వార్షికోత్సవం సందర్భంగా దాపల కవితా సంపుటి అరసం గుంటూరు జిల్లా శాఖ ప్రచురించింది.

## పాకిస్థాన్ సైన్యానివి తప్పుడు ఆరోపణలు: భారత్ ఖండన

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌లో శనివారం జరిగిన ఆత్మాహుతి దాడి వెనుక భారత్ హస్తం ఉందని పాక్ సైన్యం చేసిన ఆరోపణలను భారత విదేశాంగ శాఖ ఆదివారం ఓ ప్రకటలో ఖండించింది. ఆ దాడితో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. దాడి వెనుక తమ హస్తం ఉందంటూ పాకిస్థాన్ సైన్యం చేస్తున్నవి పూర్తిగా తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పాక్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం ఈ ఆత్మాహుతి దాడి జరిగిందని, ఈ దాడి నేపథ్యంలో భారత్‌పై నిందలు వేస్తూ పాకిస్థాన్ సైన్యం చేసిన అధికారిక ప్రకటన తమ దృష్టికి వచ్చిందని విదేశాంగ పేర్కొంది. పాక్ సైన్యం ప్రకటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టంచేసింది. కాగా పేలుడు పదార్థాలున్న వాహనంతో ఓ ఉగ్రవాది ఆర్మీ కాన్వాయ్‌పైకి దూసుకెళ్లాడు. దాంతో వాహనంలో భారీపేలుడు సంభవించింది. 13 మంది పాక్ సైనికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పౌరులు, ప్రభుత్వాధికారులు కలిపి మరో 24 మందికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, పాకిస్థాన్‌లోని తాలిబన్ హఫీజ్ గుల్ బహదూర్ గ్రూపునకు చెందిన ఉసూద్-అల్-హర్బ్ ఈ పేలుడుకు బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది.

## రోడ్డు పక్కన బుట్టలో నవజాత శిశువు

**'ఆర్థిక పరిస్థితి బాగోలేదు క్షమించండి' అంటూ లేఖ**

**ముంబై:** మహారాష్ట్రలోని నవీ ముంబైలో మూడు రోజుల నవజాత శిశువును ఒక ప్లాస్టిక్ బుట్టలో ఉంచి రోడ్డు పక్కన వదిలేశారు. 'మా ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇలా చేయాల్సి వచ్చింది. క్షమించండి' అంటూ ఒక నోట్‌ను అందులో ఉంచారు. ఆ శిశువును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే... పన్వేల్ ప్రాంతంలోని టక్కా కాలనీలో రోడ్డు పక్కన నీలిరంగు బుట్టలో మూడు రోజుల కిందట పుట్టిన నవజాత శిశువును తల్లిదండ్రులు వదిలేశారు. ఇంగ్లీషులో రాసిన నోట్ కూడా అందులో ఉంచారు. తమ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, దీనివల్ల ఆడ బిడ్డను తాము పెంచలేమని పేర్కొన్నారు. తమకు మరో మార్గం లేక ఇలా చేయాల్సి వచ్చిందని, క్షమించాలని ఆ లేఖలో కోరారు. కాగా, రోడ్డు పక్కన నీలిరంగు బుట్టలో నవజాత శిశువు ఉండటం చూసి స్థానికులు షాక్ అయ్యారు. పోలీసులకు ఈ సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. ఆడపిల్లను స్వాధీనం చేసుకున్నారు. పిల్లల డాక్టర్‌కు చూపించగా ఆ శిశువు ఆరోగ్యంగానే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజుల ఆడపిల్లను రోడ్డు పక్కన బుట్టలో వదిలేసిన తల్లిదండ్రుల కోసం వెతుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## రెండో పెళ్లి చేసుకున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే... పార్టీ నుంచి బహిష్కరణ

**డెహ్రాడూన్:** బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లి చేసుకున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యేను ఆ పార్టీ నుంచి అధిష్ఠానం బహిష్కరించింది. బహుభార్యత్వానికి వ్యతిరేకంగా అమలు చేసిన యూనిఫాం సివిల్ కోడ్‌ను ఆయన ఉల్లంఘించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెళితే... హరిద్వార్‌లోని జ్వాలాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సురేశ్ రాథోడ్ రెండో పెళ్లి చేసుకున్నారు. సహరాన్‌పూర్‌కు చెందిన నటి ఊర్మిళా సనావర్‌ను తన రెండవ భార్యగా ఆయన పరిచయం చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, ఈ ఏడాది జనవరిలో బహుభార్యత్వానికి వ్యతిరేకంగా యూనిఫాం సివిల్ కోడ్‌ను ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం అమలు చేసింది. అయితే మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే బీజేపీ నేత సురేశ్ రాథోడ్ రెండో పెళ్లి చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. 'బీజేపీ తన సొంత నాయకులపై చట్టాన్ని అమలు చేయడం లేదు. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా యూసీసీని ఒక ఆయుధంగా మాత్రమే ఉపయోగిస్తోంది' అని కాంగ్రెస్ ఆరోపించింది. దీంతో స్పందించిన బీజేపీ సురేశ్ రాథోడ్‌కు నోటీస్ జారీ చేసింది. ఆయన వివరణతో బీజేపీ నాయకత్వం సంతృప్తి చెందలేదని తెలిపింది. 'మీరు పార్టీ క్రమశిక్షణ, సామాజిక ప్రవర్తన నిబంధనలను నిరంతరం ఉల్లంఘించారు. ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు మిమ్మల్ని ఆరు సంవత్సరాల పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నాం' అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్ర బిష్ట్ ఒక లేఖలో పేర్కొన్నారు.

## క్యాబిన్‌లో కాలిన వాసన.. వెనుదిరిగిన ఎయిరిండియా విమానం..!

**ముంబై:** ఈ మధ్య కాలంలో ఎయిరిండియా విమానాల్లో తరచూ సమస్యలు వెలుగు చూస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా మహారాష్ట్ర రాజధాని ముంబై నుంచి తమిళనాడు రాజధాని చెన్నై కి బయలుదేరిన ఎయిరిండియా విమానంలో సమస్య తలెత్తింది. శనివారం రాత్రి 10.55 గంటలకు ఏఐ-639 విమానం ముంబై నుంచి చెన్నైకి బయలుదేరింది. ఆ తర్వాత కాసేపటికే క్యాబిన్‌లో కాలిన వాసన రావడంతో పైలట్ ఆ విమానాన్ని వెనక్కి తీసుకొచ్చి ముంబైలోనే సురక్షితంగా దించాడు. అనంతరం ఎయిరిండియా అధికారులు మరో విమానంలో ప్రయాణికులను చెన్నైకి పంపించారు. ఈ విషయాన్ని ఎయిరిండియా అధికార ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. ప్రయాణికులు, సిబ్బంది క్షేమమే తమ సంస్థ తొలి ప్రాధాన్యమని ఆయన చెప్పారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపారు.

# ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి

- భారీ వర్షాలు... 9 మంది గల్లంతు
- చార్‌ధామ్ యాత్రకు విరామం

**నైనిటాల్:** భారీ వర్షాలతో ఉత్తరాఖండ్ అతలాకుతలం అవుతోంది. అనేక ప్రాంతాల్లో రహదారులపై భారీగా కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఉత్తర కాశీ జిల్లాలో 9మంది వరదనీటిలో కొట్టుకుపోయారు. బార్‌కోట్ - యమునోత్రి రహదారిపై బాలీఘడ్ సమీపంలో ఆదివారం ఉదయం మేఘ విస్ఫోటనం సంభవించింది. దీంతో అతి భారీ వర్షం కురిసింది. దీంతో బాలీఘడ్‌లో హెూటల్ నిర్మాణ పనుల్లో పాల్గొన్న తొమ్మిదిమంది కార్మికులు ఆ వర్ష ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ ఆర్య సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. కార్మికులు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక పోలీసులు, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సిబ్బంది, జాతీయ విపత్తు నిర్వహణ సిబ్బంది ఈ గాలింపు చర్యల్లో పాల్గొన్నారని ఆయన వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉత్తరాఖండ్‌లోని ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చార్ ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆదివారంఅధికారికంగా ప్రకటించింది. 24 గంటలు.. అంటే ఒక రోజుపాటు ఈ యాత్రను నిలిపి వేయాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం వివరించింది. వాతావరణ పరిస్థితులు ఏ మాత్రం అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. భారీగా కొండచరియలు విరిగిపడడంతో రహదారులు వివిధ ప్రాంతాల్లో మూసుకుపోయాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎక్కడి వారు అక్కడ ఉండి పోవాలని యాత్రికులకు ప్రభుత్వం సూచించింది. వాతావరణ పరిస్థితులు, రహదారులపై శిథిలాలను శుభ్రం చేసిన తర్వాత యాత్ర చేపట్టాలని స్పష్టం చేసింది. మరోవైపు హరిద్వార్, రుషికేశ్, శ్రీనగర్, రుద్ర ప్రయాగ్, సోన్ ప్రయాగ్, వికాస్ నగర్ తదితర ప్రాంతాల్లో యాత్రికులు తాత్కాలికంగా నివసించేందుకు ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే పోలీసులు, ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని ఘర్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర పాండే వెల్లడించారు. చార్ ధామ్ యాత్ర.. ఏప్రిల్ 30వ తేదీన ప్రారంభమైన సంగతి తెలిసిందే. అక్షయ తృతీయ సందర్భంగా గంగోత్రి, యమునోత్రిలలో ఈ యాత్ర ప్రారంభమైంది. ఇక మే 2వ తేదీన కేథార్‌నాథ్, మే 4వ తేదీన బద్రీనాథ్ యాత్రలు ప్రారంభమైన విషయం విదితమే. ఈ నాలుగు దేవాలయాలు.. ఏడాదిలో ఆరు మాసాలు మాత్రమే తెరిచి ఉంటాయి.

శీతాకాలంలో భారీ చలి గాలులు కారణంగా.. అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఈ దేవాలయాలను మూసి ఉంచుతారు. భారీ వర్షాల కారణంగా.. రాష్ట్రంలోని నదులన్నీ ప్రమాద స్థాయిలో పొంగి ప్రవహిస్తున్నాయి. ఇక ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం, సోమవారం రెండ్రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో రెడ్ అలర్ట్ ప్రకటించినట్లు వివరించింది.

# 11ఏళ్లలో 29వేల మంది మృతి!

**ముంబై స్థానిక రైళ్లలో ప్రమాదాలు**

**ఇంకా 8వేల మందిని గుర్తించని వైనం**

**ముంబై:** గడచిన పదకొండేళ్లలో ముంబై సబర్బన్ రైళ్లలో జరిగిన ప్రమాదాల్లో 29 వేల మంది మరణించారు. ఇందులో ఇంకా ఎనిమిదివేల మంది మృతదేహాలను గుర్తించనేలేదని రైల్వే గణాంకాలు వెల్లడించాయి. దేశ ఆర్థిక రాజధానిగా పిలిచే ముంబైలో సబర్బన్ రైళ్లు అత్యంత కీలకం. ఇది నిత్యం రద్దీగానే ఉంటాయి. ఈ రైళ్లలో ప్రతి రోజూ సుమారు 65 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. కేవలం సెంట్రల్ రైల్వేలోనే నిత్యం 30 లక్షల మందికి పైగా ప్రయాణిస్తుంటారు. అదే పశ్చిమ రైల్వే, సెంట్రల్ రైల్వేలో రెండింటిని కలిపి లెక్కిస్తే ప్రతి రోజు సుమారు 65 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలోనే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ మెయిన్‌లైన్, హార్బర్‌లైన్?, ట్రాన్స్‌హార్బర్‌లైన్లలో మూడు వేల రైళ్లను నడుపుతోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని లోకల్ ఏసీ రైళ్లను కూడా నడుపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే 'పీక్' అవర్‌లో జనం ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ఉంటారు. ఇలా రైళ్ల రద్దీ కారణంగా ప్రమాదకరమైన ప్రయాణం చేయడం వల్ల గడిచిన పదకొండు సంవత్సరాల్లో 6500 మంది ప్రయాణికులు మరణించారు. మరోవైపు రైలు ప్రమాదాల నివారణపై సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా ప్రజలకు ముఖ్య సూచనలు చేశారు. సురక్షిత ప్రయాణం చేయాలని కోరిన ఆయన, ఇంకా స్టేషన్లలో ప్రకటనల ద్వారా ప్రయాణికులకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా కదులుతున్న రైలు నుంచి ఎక్కడం, దిగడం, వంతెనలు ఉపయోగించకుండా పట్టాలు దాటడం వంటివి మానుకోవాలని సూచించారు. దాదాపు 15 వేలకు మందికి పైగా పౌరులు పట్టాలు దాటుతుండగా ప్రాణాలు కోల్పోయారని రైల్వే శాఖ చెబుతోంది. ఈ ప్రమాదాల్లో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా మారిపోవడం వల్ల రైల్వే పోలీసులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. అలాంటి సందర్భాల్లో మృతుల వద్ద ఉన్న గుర్తింపు కార్డు, వారు ధరించిన దుస్తులు, మొబైల్ ఫోన్ ఆధారంగా వారిని గుర్తిస్తున్నారని చెప్పింది.

## గుడ్ల వినియోగం... ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్ వెనుకంజ

**న్యూఢిల్లీ:** కోడిగుడ్ల తలసరి వినియోగంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌లను భారత్ అధిగమించింది. ఆదాయం పెరగడంతో పాటు పోషకాహారంపై అవగాహన పెరగడమే దీనికి ప్రధాన కారణంగా నిపుణులు చెబుతున్నారు. అయితే, ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్ ఇంకా చాలా వెనుకబడే ఉన్నారు. 'అవర్ వరల్డ్ ఇన్ డేటా' గణాంకాల ప్రకారం.. తలసరి గుడ్ల వినియోగంలో భారత్ 2018లో పాకిస్థాన్‌ను అధిగమించింది. మూడు దశాబ్దాలకు పైగా మనకంటే ముందున్న పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టి అప్పటి నుంచి ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. 2022 నాటికి, భారత్‌లో వార్షిక తలసరి గుడ్ల వినియోగం 4.6 కిలోలుగా నమోదు కాగా, పాకిస్థాన్‌లో ఇది 3.7 కిలోలుగా ఉంది. ఇదే సమయంలో బంగ్లాదేశ్‌లో 3.6 కిలోలు, శ్రీలంకలో 3.7 కిలోలు, నేపాల్‌లో కేవలం 2 కిలోలుగా నమోదైంది. దక్షిణాసియాలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, ప్రపంచ సగటుతో పోల్చినప్పుడు భారత్ వినియోగం చాలా తక్కువ. 2022లో ప్రపంచవ్యాప్తంగా తలసరి గుడ్ల వినియోగం 10.4 కిలోలుగా ఉంది. అంటే, ప్రపంచ సగటులో మనం సగం కంటే తక్కువే తింటున్నామని స్పష్టమవుతోంది. భారత ప్రభుత్వ గణాంకాల మంత్రిత్వ శాఖ (2023-24) నివేదిక ప్రకారం, భారతీయుల ఆహార ఖర్చులో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు తమ నెలవారీ ఖర్చులో 11.1%, గ్రామీణ ప్రాంతాల్లో 9.8% కూల్ డ్రింకులు, చిప్స్ వంటి ప్రాసెస్డ్ ఫుడ్ కోసమే వెచ్చిస్తున్నారు. పాలు, కూరగాయల కన్నా వీటికే ఎక్కువ ఖర్చు చేస్తుండటం గమనార్హం. గుడ్ల వినియోగం పెరగడం మంచి పరిణామమే అయినా, ప్రాసెస్డ్ ఫుడ్ వైపు మొగ్గు చూపడం ఆహార అలవాట్లలోని మరో కోణాన్ని తెలియజేస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**అత్యాచార ఘటన...**

## సొంత పార్టీ నేతలపై మహువా ఆగ్రహం



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో న్యాయ కళాశాల విద్యార్థిని (24)పై జరిగిన అత్యాచార ఘటన కాకరేపుతోంది. ఈ క్రమంలో బాధితురాలిదే తప్పంటూ అధికార టీఎంసీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా స్పందిస్తూ సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. భారత్‌లోని అన్ని పార్టీల్లో స్త్రీ ద్వేషులు ఉన్నారని రాసుకొచ్చారు. అలాంటి అసహ్యకరమైన వ్యాఖ్యలు ఎవరు చేసినా తమ పార్టీ ఖండిస్తుందంటూ పేర్కొన్నారు. మరో పోస్టులో విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. ఫిర్యాదు చేసిన 12 గంటల్లోపే పోలీసులు నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. మహిళలపై జరిగే నేరాలను టీఎంసీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఏ మాత్రం సహించదన్నారు. ఈ సందర్భంగా బీజేపీపై కూడా విమర్శలు చేశారు. ఈ అత్యాచార ఘటనపై టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, ఎమ్మెల్యే మదన్ మిత్రా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. విద్యార్థినిపై ఆమె స్నేహితులు అత్యాచారం చేస్తే ఎవరేం చేస్తారని, పోలీసులు కళాశాలల్లో ఉంటారా అని కల్యాణ్ అనగా... ఆ విద్యార్థిని ఒంటరిగా కాలేజీకి వెళ్లకపోతే ఇలాంటి ఘటన జరిగి ఉండేది కాదని మిత్రా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంతో పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమైనవని... పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగినట్టు వైద్యపరీక్షల్లో నిర్ధారణ అయిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

**మీడియాలో చూసే తెలుసుకున్నాం: లా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్**

విద్యార్థినిపై... పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు విద్యాసంస్థ ప్రాంగణంలోనే దారుణానికి ఒడిగట్టిన ఘటనపై న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నయన ఛటర్జీ స్పందించారు. ఈ దారుణం జరిగినట్లు తమ దృష్టికే రాలేదని... మీడియాలో వార్తలు చూసే తాము విషయం తెలుసుకున్నామని చెప్పారు. అత్యాచారం జరిగినట్లు బాధితురాలు ఫిర్యాదు ఇచ్చిన మరునాడు పోలీసులు కళాశాలకు వచ్చారని... అయితే, ఈ విషయం గురించి తమకు సమాచారం ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. తాము వచ్చిన విషయం సెక్యూరిటీ గార్డుకు కూడా చెప్పవద్దని పోలీసులు తనను కోరినట్లు చెప్పారు. అనంతరం గ్రౌండ్ ఫ్లోర్‌లోని రెండు గదులను పోలీసులు సీజ్ చేశారని వైస్ ప్రిన్సిపాల్ అన్నారు. బాధితురాలు కూడా కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. అత్యాచార కేసులో ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా తమ పూర్వ విద్యార్థి అని... కళాశాలలో బోధనా సిబ్బంది తక్కువగా ఉండడంతో కొన్ని నెలల క్రితం అతడిని తాత్కాలిక అధ్యాపకుడిగా నియమించినట్లు చెప్పారు. ఆమె వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలేజీలో ఇంత దారుణ ఘటన జరిగినా... అందులోని ఉన్నతస్థాయి అధికారులకే తెలియలేదంటే అక్కడి విద్యార్థుల గురించి వారు ఏం పట్టించుకుంటున్నారని మండిపడ్డారు. దర్యాప్తు వేగవంతం చేసి... నిందితులకు వెంటనే కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినిపై పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు కళాశాల ప్రాంగణంలో అత్యాచారానికి పాల్పడిన ఘటన ఈ నెల 25న చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా(31) సహా కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. మనోజిత్‌కు టీఎంసీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నట్లు తెలుస్తోంది. నిందితులకు సెక్యూరిటీ గార్డు సహకరించినట్లు అనుమానించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

## అమెరికాలో భారతీయ మహిళ అదృశ్యం

**వాషింగ్టన్:** పెద్దలు కుదిర్చిన పెళ్లి కోసం అమెరికా వెళ్లిన భారతీయ మహిళ కనిపించకుండా పోయింది. ఆమె కోసం అమెరికా పోలీసులు గాలిస్తున్నారు. భారత్‌లోని ఆ మహిళ కుటుంబ సభ్యులను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నారు. భారత్‌కు చెందిన 24 ఏళ్ల సిమ్రాన్ జూన్ 20న అమెరికా చేరుకున్నారు. పెద్దలు కుదిర్చిన వివాహం కోసం ఆ దేశానికి వచ్చినట్లు అమెరికా అధికారులకు తెలియజేశారు. కాగా, అమెరికా వచ్చిన కొన్ని రోజులకే సిమ్రాన్ అదృశ్యమైనట్లు న్యూజెర్సీ అధికా రులు తెలిపారు. జూన్ 25న ఆమె చివరిసారి కనిపి ంచిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి నట్లు పేర్కొన్నారు. ఫోన్ చూస్తున్న ఆమెలో ఎలాంటి ఆందోళన కనిపించలేదని అన్నారు. మరో వైపు కుదిర్చిన పెళ్లి కోసం కాకుండా స్వేచ్ఛగా ట్రావెల్ చేసేందుకు సిమ్రాన్ అమెరికా వచ్చి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. సిమ్రాన్ ఇంగ్లీష్ మాట్లాడలేదని, అమెరికాలో ఆమెకు బంధువులు ఎవరూ లేరని తెలిపారు. భారత్‌లోని ఆమె బంధువులను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదన్నారు.

## చెత్త లారీలో మృతదేహం!

**బెంగళూరు:** ఓ గుర్తు తెలియని మహిళను చంపి, గోనె సంచిలో కుక్కి చెత్త లారీలో పడేసిన దారుణ ఘటన కర్నాటక రాజధాని బెంగళూరులో ఆదివారం ఉదయం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. ఒక వ్యక్తి ఆటోలో వచ్చి, గోనెసంచిని చెత్త లారీలో వేసిన దృశ్యాలు ఓ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆ పుటేజ్ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు.

కొన్ని వారాల క్రితం బెంగళూరులోనే ఇద్దరు పిల్లల తల్లి అయిన మహిళను ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తి దారుణంగా చంపేశాడు. ఆ ఘటనను మరువకముందే తాజాగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## విమాన ప్రమాదంలో కుట్ర కోణంపై దర్యాప్తు: కేంద్రం

**న్యూఢిల్లీ:** ఎయిరిండియా విమాన ప్రమాదంలో కుట్రకోణంపై కూడా దర్యాప్తు చేయిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇటీవల గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఏఐ-171 విమానం కూలిపోయి 279 మంది మరణించిన ఘటనలో కుట్ర కోణంపై కూడా తాము దృష్టి సారించామని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ చెప్పారు. ఈ విమాన ప్రమాదం కేసును ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేస్తోందని మంత్రి తెలిపారు. పుణేలో జరుగుతున్న ఓ సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రమాదం స్థలం నుంచి రికవరీ చేసిన బ్లాక్‌బాక్స్ ఏఏఐబీ ఆధీనంలో ఉందని, విశ్లేషణ కోసం దానిని విదేశాలకు పంపబోమని స్పష్టంచేశారు. 'విమాన ప్రమాదంపై ఏఏఐబీ పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించింది. అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. కుట్ర ఏదైనా ఉందా... అనే అంశంపై కూడా దృష్టిపెట్టారు. సీసీటీవీ దృశ్యాలను విశ్లేషిస్తున్నారు. రెండు ఇంజిన్లు ఒకేసారి విఫలం కావడం అనేది గతంలో ఎన్నడూ జరగలేదు. ఇది అరుదైన కేసు. దర్యాప్తు నివేదిక వస్తే గానీ రెండు ఇంజిన్లు విఫలం అయ్యాయా... లేక ఇంధన సరఫరాలో సమస్య తలెత్తిందా అనేది తేలుతుంది. బ్లాక్ బాక్స్‌లోని కాక్‌పీట్ వాయిస్ రికార్డర్‌లో పైలట్ల సంభాషణ నిక్షిప్తమై ఉంది. నివేదిక మూడు నెలల్లో వస్తుంది. ఇప్పుడే దానిపై మాట్లాడటం తొందరపాటు అవుతుంది' అని మురళీధర్ చెప్పారు. విశ్లేషణ కోసం బ్లాక్‌బాక్స్‌ను విదేశాలకు పంపనున్నారనే ప్రచారాన్ని మంత్రి కొట్టిపారేశారు. అది ఎక్కడికీ పోదని, దర్యాప్తు సంస్థల కస్టడీలోనే ఉందని చెప్పారు. దేశంలో వినియోగిస్తున్న 33 డ్రీమ్‌లైనర్ విమానాలను డీజీసీఏ ఆదేశాల మేరకు క్షుణ్ణంగా తనిఖీలు చేశారని తెలిపారు. ప్రజలు భయపడటం లేదని, వారు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారని అన్నారు.

**విజిలెన్స్ చర్యను ప్రశ్నించిన ఎమ్మెల్యేపై**

# ఐదేళ్ల సస్పెన్షన్ వేటు

**చండీగఢ్:** మాజీ ఐపీఎస్ అధికారి, అమృత్‌సర్ నార్త్ ఎమ్మెల్యే కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. పార్టీ నుంచి ఐదేళ్ల పాటు సస్పెండ్ చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే కారణంగా పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. అకాలీదళ్ సీనియర్ నేత బిక్రమ్ మజీథియాపై విజిలెన్స్ కేసు వ్యవహారంలో ఆప్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై విజయ్ ప్రతాప్ బహిరంగ విమర్శలు చేసిన క్రమంలో ఆయనపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. దాడుల సమయంలో మజీథియా భార్య విజిలెన్స్ టీమ్‌తో గొడవ పడుతున్న వీడియోను సోషల్ మీడియాలో విజయ్ ప్రతాప్ పోస్ట్ చేశారు. విజిలెన్స్ ఆపరేషన్ తీరుపై విమర్శలు గుప్పించారు. 'మజీథియా జైలులో ఉన్నారు. ఆయనపై ఎలాంటి ఇన్వెస్టిగేషన్ చేపట్టలేదు. ఆయనను ప్రశ్నించడం కూడా జరగలేదు. ఆయన బెయిల్ పొందేందుకు అనుమతించాలి' అని అన్నారు. మజీథియా నివాసంపై తెల్లవారుజామున దాడులు జరగడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. రాజకీయ వేత్త అయినా, నటుడయినా, డబ్బున్న వాడు, పేదవాడు, మిత్రుడు, శత్రువు ఇలా ఎవరైనా కావచ్చు... ప్రతి కుటుంబానికి ఒక గౌరవం అంటూ ఉంటుంది. ఉదయమే ఇంటిలోకి చొరబడం తప్పు... అనైతికం... అని ఆయన తన ట్వీట్‌లో ఖండించారు. ఎవరు అధికారంలోకి వచ్చినా రాజకీయ కారణాలతో పోలీసులను, విజిలెన్స్ శాఖలను దుర్వినియోగం చేస్తున్నారని విజయ్ ప్రతాప్ ఆరోపించారు. సొంత ప్రయోజనాలకే ఆయా విభాగాలను వాడుకుంటున్నారనేది నిజమని, ఇందువల్ల ఎవరూ ప్రయోజనం పొందలేరని వ్యాఖ్యానించారు. దీంతో ఆయనపై ఆప్ చర్యలకు దిగింది. తద్వారా పార్టీలో అసమ్మతిని ప్రోత్సహించేది లేదని, ముఖ్యంగా పంజాబ్‌లో డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంశ చాలా కీలకమని, పార్టీ విధానమే శిరోధార్యమని సంకేతాలు పంపింది.

## త్వరలో డీకే శివకుమార్ సీఎం

**కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు**

**బెంగళూరు:** కర్నాటకలో రెండుమూడు నెలల్లో ముఖ్యమంత్రి మారుస్తారని... డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కాబోతున్నారంటూ అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలతో కర్నాటకలో రాజకీయాలు వేడెక్కాయి. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుగా పేరున్న ఎమ్మెల్యే హెచ్ఏ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ.. డీకే రాబోయే రెండు, మూడు నెలల్లో ముఖ్యమంత్రి అయ్యే అవకాశం లభిస్తుందని తెలిపారు. సెప్టెంబర్ తర్వాత రాష్ట్రంలో 'విప్లవాత్మక' రాజకీయ పరిణామాలుంటాయన్న సహకార మంత్రి కేఎన్ రాజన్న ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. తాజాగా ఇక్బాల్ మాట్లాడుతూ 'ఈ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మన (కాంగ్రెస్) బలం ఏంటో మీ అందరికీ తెలుసు. విజయం సాధించడానికి ఎవరు పోరాటం, కృషి చేశారో.. తన శక్తిని ధారపోశారో అందరికీ తెలుసు, ఆయన (డీకే) వ్యూహం, ఆయన పనులన్నీ చరిత్రగా మారాయన్నారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందా? అని రామనగరంలో విలేకరులు ప్రశ్నించగా... తాను ఊహాగానాలు నమ్మనని.. హైకమాండ్ పరిస్థితి తెలుసుకుని సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుని... ఆయనకు అవకాశం ఇస్తుందనే పూర్తి నమ్మకం ఉందన్నారు. సెప్టెంబర్ తర్వాత విప్లవాత్మక రాజకీయ పరిణామాలుంటాయని, నేతలు మాట్లాడుతున్నది దీని గురించేనని... రెండు, మూడు నెలల్లో నిర్ణయం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య తనయుడు, కాంగ్రెస్ ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య ముఖ్యమంత్రి మార్పును కేవలం ఊహాగానాలు మాత్రమేనంటూ తోసిపుచ్చారు.

## ఎమర్జెన్సీపై పోరాడిన వారిని స్మరించుకోవాలి

**మన్‌కీబాత్‌లో ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ:** దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. నాడు జార్జిఫెర్నాండెజ్‌ను సంకెళ్లతో బంధించారని గుర్తు చేశారు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో ఎమర్జెన్సీ తొలగిపోయిందని, దానిని విధించినవారు ఓడిపోయారన్నారు. ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తవడాన్ని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించిన ప్రధాని, ఎమర్జెన్సీపై పోరాడిన మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను ప్రస్తావించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా స్మరించుకోవాలనీ అది రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మనల్ని ప్రేరేపిస్తుందని చెప్పుకొచ్చారు. జనాభాలో 64 శాతం కన్నా ఎక్కువ మంది దాదాపు 95 కోట్లమంది ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని ప్రధాని వివరించారు. 2015లో సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్ల మందికి అందేవని గుర్తుచేశారు. శాశ్వత అంధత్వానికి దారితీసే ట్రాకోమా వ్యాధి నుంచి భారత్ పూర్తిగా విముక్తి పొందినట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ నిర్ధారించిందని 123వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో మోదీ తెలిపారు. ఇటీవలి అంతర్జాతీయ యోగా డేను యావత్ ప్రపంచం జరుపుకుందనీ, అందరి జీవితాల్లో యోగా భాగమవుతోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. జూన్ 21న జరిగిన యోగా డే కార్యక్రమాల్లో దేశ, ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది పాల్గొన్నారని గుర్తు చేశారు. దాదాపు 10 ఏళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేటా మరింత విస్తరిస్తోందని తెలిపారు. చాలాకాలం తర్వాత అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైందన్న మోదీ... యాత్రికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం భద్రాచలం ప్రాంతంలో మహిళలు మిల్లెట్లతో బిస్కెట్లు తయారు చేస్తున్నారనీ అవి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. వాళ్లే పర్యావరణహితమైన గిరి శానిటరీ ప్యాడ్స్‌ను ఉత్పత్తి చేస్తున్నారనీ, 3 నెలల్లోనే 40వేల ప్యాడ్స్‌ను తయారుచేశారని మోదీ ప్రశంసించారు.

విశాలాంధ్ర
హైదరాబాద్

# ఉజ్జయిని మహంకాళి ఎదుర్కోలు ఉత్సవంలో మంత్రి పొన్నం పూజలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఘటోత్సవాలు ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈనెల 26న గోల్కొండ బోనాలతో ఆషాఢ మాస బోనాలు ప్రారంభం అయ్యాయని, ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఘటోత్సవాలు ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. జులై 1న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం జరుగుతుందని, జులై 13 ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలు ఉంటాయని, 14న రంగం కార్యక్రమం ఉంటుందన్నారు.

20 న లాల్ దర్వాజా సింహవాహిని బోనాలు జరుగుతాయని, జంట నగరాల్లో బోనాల ఉత్సవాలు ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. హైదరాబాద్ ఆషాఢ మాస బోనాలు ఉత్సవాల్లో ప్రజలు భాగస్వామ్యులు అయి అమ్మవారి కృపకు పాత్రులుకావాలని కోరారు.

## 'ఆలయ నిర్మాణం' పుస్తకాన్ని ఆవిష్కరించిన వేం నరేందర్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : శిల్పాగమ శాస్త్రాలను అనుసరించి, ఆలయ నిర్మాణ పద్ధతులను, డిజైన్లతో సహా రచించిన 'ఆలయ నిర్మాణం' పుస్తకాన్ని ముఖ్యమంత్రి సలహాదారుడు, వేంనరేందర్ రెడ్డి నగరంలో ఆదివారం ఆవిష్కరించారు. భూ పరీక్ష నుంచి ప్రతిష్ట వరకు గల వివిధ నిర్మాణ దశలు, ఉపపీఠం నుంచి కలశం వరకు, గర్భాలయం నుంచి గోపురం వరకు వివరాలతో పాటు చిత్రాలను కూడా పొందుపరిచిన రచయిత డా. పి.సుబ్రమణి, సంపాదకుడు డా.ఈమని శివనాగిరెడ్డిలను, ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందించిన ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఉప అధ్యక్షులు మొగళ్ల రాజిరెడ్డిని వేంనరేందర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, శిల్పి బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకం దేవాదాయ శాఖ, తి.తి.దే దేవస్థానాలు, ఇంకా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయ నిర్మాణ శిల్పులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆగమ, శిల్ప శాస్త్రాల్లోని విషయాలతో పాటు, ఆలయ వివిధ భాగాలను ప్రమాణ సహితంగా వేసిన చిత్రాలు తెలుగు శిల్పలకు అందుబాటులోకి తేవాలని ఈ పుస్తకం ముద్రించినట్లు మొగళ్ల రాజిరెడ్డి అన్నారు.

## ట్యాక్స్‌బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సీఏ చంద్రశేఖర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణా ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సీఏ చంద్రశేఖర్ వేముల ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. హైదరాబాద్ నగరంలో ఆదివారం అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు సీఏ హితేశ్ జైన్ అధ్యక్షతన జరిగిన వార్షిక సాధారణ సభలో 2025-26 సంవత్సరానికి కార్యవర్గానికి ఎన్నికలు ఎలెక్షన్ ఆఫీసర్ అమృత్ కుమార్ పారదర్శకంగా నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా సీఏ చంద్రశేఖర్ వేములతో పాటు ఉపాధ్యక్షులుగా సీఏ పీవీ నారాయణరావు, కార్యదర్శిగా సీఏ ఆశిష్ జోషి, సంయుక్త కార్యదర్శిగా ఐటిపి అజయ్ కుమార్ భవలే, కోశాధికారిగా టాక్స్ అడ్వొకేట్ సోమేశ్వర్ నెమానిలు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా సీఏ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో టాక్స్ బార్ అసోసియేషన్‌ను బలోపేతంచేయడం, కొత్త సభ్యులను చేర్చడం, వర్క్‌షాప్‌లు సెమినార్ల ద్వారా విద్యా వేదికలను అందించడం, రెగ్యులేటరీ అధికారుల మధ్య వారధిగా వ్యవహరించడం, ప్రభుత్వ వేదికలపై ప్రోయాక్టివ్ పాత్ర పోషించడం, అసోసియేషన్‌కు మరింత గుర్తింపు తీసుకురావడం ప్రధాన లక్ష్యాలు అని తెలిపారు. ఈ సభలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు సీఏ రాందేవ్ భుటాడా, సీఏ పూర్ణచంద్ర రావు, ఐటిపి మధుసూదన్ బోజ్జా, సీఏ వెంకట రామ్, తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారావు తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## జూలై 21న పటాన్ చెరువులో బోనాల పండుగ

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ఆషాడ మాసంలో నిర్వహించే బోనాలను పటాన్ చెరువు పట్టణంలో జులై 21వ తేదీ సోమవారం నిర్వహించేందుకు పట్టణ పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించినట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బోనాల పండుగ ఏర్పాట్లపై ఆదివారం పటాన్ చెరువు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన పట్టణ పుర ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ 21వ తేదీన నిర్వహించనున్న బోనాల పండుగ సందర్భంగా ప్రభుత్వం తరపున అన్ని దేవాలయాల వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో.. ఆనందోత్సాహాల మధ్య పండుగను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984-85 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఉప్పర్‌పల్లి ఇంపీరియా బ్యాంకెట్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎనభై మంది విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, ముగ్గురు ఉపాధ్యాయులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. చిన్న నాడు తాము చదువుకున్న రోజుల్లో మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. తమ కు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తమకు పాఠాలు చెప్పి నేడు స్వర్గంలో ఉన్న గురువులను, తమతో చదువుకొని మరణించిన స్నేహితులను గుర్తు చేసుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. తాము నేడు ఏ పని చేస్తున్నాం.. ఎక్కడెక్కడ స్థిరపడ్డామో వివరించారు. అందరు కలసి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నలభై సంవత్సరాల జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వై.శ్రీధర్, ఎం.శ్రీనివాస్ యాదవ్, ఎండీ షర్ఫుద్దీన్, బి.వేణుగోపాల్, సామ సుమన్‌రెడ్డి, కాశీ విశ్వనాథ్ గౌడ్, ఎం.రాంబాబు యాదవ్, వేముల చక్రపాణి, ఎస్.నర్సిహ్మారెడ్డి, బి.ఆంజనేయులు, ఎ.భీమయ్య, మంజూర్ అహ్మద్. కె.విజయ్ కుమార్, రవీందర్ షిండే, ఎం.నాగభూషణం, విజయలక్ష్మీ, కె.సరోజ, వనితారెడ్డి, రమాదేవి, ఎన్.బాబురావు, ఎ సత్యనారాయణ, జి. చిమన్ లాల్, సయ్యద్ హిదాయతుల్లా షఫీ, జయశ్రీ., రాజేందర్, నాగ భూషణం, తదితరులు పాల్గొన్నారు.

# మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహా న్యూస్ ఛానల్ కార్యాలయం పై జరిగిన దాడిని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. మహా న్యూస్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ దాడిని ఆయన "హేయమైన చర్య"గా అభివర్ణించారు. మీడియా స్వేచ్ఛపై దాడి చేయడం అనేది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. చానల్ కార్యాలయంపై కొందరు గుండాలు, రౌడీల మాదిరిగా దాడికి పాల్పడటం దుర్మార్గంగా అభివర్ణించారు. మీడియా సంస్థలపై భయభ్రాంతులు కలిగించే ప్రయత్నాలను ప్రజాస్వామ్యం సహించదన్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డారని వెల్లడించారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకులు, సినీతారలు, న్యాయమూర్తులు, మహిళా ఐఏఎస్ అధికారులు, చివరికి తమ పార్టీ నాయకుల ఫోన్లను సైతం ట్యాప్ చేశారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ చర్యను ఆయన "దేశ చరిత్రలో అమానుషమైన చర్య"గా పేర్కొన్నారు. ఇదంతా ఒక పెద్ద కుట్రగా అభివర్ణించిన మహేష్ గౌడ్, ఐపీఎస్ అధికారి ఉండాల్సిన స్థాయిలో ఉండాల్సిన వ్యక్తి స్థానంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రభాకర్ రావును ప్రత్యేకంగా నియమించారని తెలిపారు. అతన్ని ఫోన్ ట్యాపింగ్ కు వెసులుబాటుగా ఉపయోగించారని ఆరోపించారు. "వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు ఎవరిచ్చారు" అని ప్రశ్నించిన ఆయన, ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి కేవలం ప్రభాకర్ రావు, రాధాకృష్ణ మాత్రమే బాధ్యులు కాదని, అప్పటి ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, సంబంధిత అధికారులు, డీజీపీ, లీగల్ ప్రిన్సిపల్ సెక్రటరీ, హోం సెక్రటరీలూ దీనికి బాధ్యత వహించాల్సిందిగా పేర్కొన్నారు.

# బాలబాలికలకు ఆర్థిక సాయానికి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు స్పాన్సర్షిప్ ప్రత్యేక ఆర్థిక సాయం అందించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, జిల్లా సంక్షేమ అధికారి, మహిళా శిశు సంక్షేమ శాఖ అక్కేశ్వరరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. తల్లి దండ్రులు కోల్పోయిన బాలలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బాధితుల పిల్లలు, పై రెండు కారణలు కలిగి ఆర్థిక సమస్యలతో చదువుకు ఆటంకం కలిగే పిల్లలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేయబోయే బాలలు సంబంధిత ధ్రువపత్రాలు జిరాక్స్ కాపీలను జత చేస్తూ వారు ఏ కాటగిరికి (పైన సూచించిన) చెందిన వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు (డెత్ సర్టిఫికెట్, ఆరోగ్య, మెడికల్, ఆధార్కార్డు, రేషన్కార్డు, పాఠశాల నుంచి పొందిన బోనోఫైడ్), పాస్పోటోను కలిపి కార్యాలయంలో లభించే దరఖాస్తు ఫారంతో జతచేసి అందజేయాలన్నారు.

స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో బాలల పరిరక్షణ విభాగం అధికారులు పరిశీలించి అర్హులైన బాలబాలికల జాబితాను స్పాన్సర్షిప్ కమిటీ వాస్తవ పరిస్థితులతో, వివరాలతో కూడిన నివేదికను అందజేస్తామన్నారు. కమిటీ ఎంపిక చేసిన 150 బాలబాలికలకు మాత్రమే ఆర్థిక సహాయం అందజేయబడుతుందని తెలిపారు. అర్హులైన వారికి ప్రతి నెల రూ.4 వేలు, స్పాన్సర్ మొత్తం బాలబాలికల బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతా నందు జమ చేస్తామన్నారు. ఈ డబ్బులను తల్లి లేదా గార్డియన్ ద్వారా డ్రా చేయటానికి అర్హులు అని, ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సహాయం పొందుతున్న బాలల పరిస్థితి తెలుసుకొని సమీక్షను నిర్వహించి కలెక్టర్ నివేదికను అందజేస్తారని చెప్పారు. దరఖాస్తులను జులై 22వ తేదీలోగా జిల్లా కేంద్రంలోని జిల్లా బాలల రక్షణ విభాగం, హైదరాబాద్ రూమ్ నెం.405, 4వ అంతస్తు స్నేహసిల్వర్ జుబ్లీ భవన్-కలెక్టరేట్ ప్రాంగణం, లక్డికాపుల్, హైదరాబాద్‌లోని కార్యాలయంలో అందజేయాలన్నారు.

# నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలి

విశాలాంధ్ర - కాప్రా : భారత దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూలై 2న ఛలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు, ఈ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బేగ్, టి.సత్య ప్రసాద్‌లు మాట్లాడుతూ నరేంద్రమోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని, దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పికొట్టాలని వారు అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పడం చూస్తే, మన దేశ ప్రతిష్టను మోడీ తాకట్టు పెట్టాడనడానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మోడీ ట్రంప్ మాటలను సైతం ఖండించలేదని వారు అన్నారు.

భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని బహిర్గతం చేసిన మోడీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారతీయ ప్రయోజనాలను కాపాడతామని గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం వాస్తవానికి, ఇటువంటి కఠినమైన బహిష్కరణ చర్యల నేపథ్యంలో తన సొంత ప్రజలకు కనీస గౌరవాన్ని అందించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ముందు లొంగిపోయారని మండిపడ్డారు. "మోదీ అమెరికా సందర్శించినప్పుడల్లా కోట్లాది రూపాయలు ప్రచారం కోసం ఖర్చు చేస్తారు. 'హౌడీ మోడీ', 'నమస్తే ట్రంప్' వంటి ప్రజా దుర్వినియోగ కార్యక్రమాలు చేపడుతున్నారే తప్ప, భారత దేశంలో యువతకు అవసరమైన నిర్దిష్ట ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని వారు ధ్వజమెత్తారు. ట్రంప్‌ను ప్రపంచ అధ్యక్షుడుగా చేసేందుకే మోడీ విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మోడీ, ట్రంప్ వల్ల ఆయా దేశాలకు ఒరిగిందేమి లేదని వారు ఉద్ఘటించారు. అందుకే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చామని, రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున యువజన సంఘ శ్రేణులు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ విడుదల కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, మోసిన్, ప్రదీప్, గిరి, ప్రభు పాల్గొన్నారు.

## శ్రీ వరసిద్ధి వినాయక చండీయాగంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ లోనీ గోపాల్ నగర్ లోగల శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో యాగశాల ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు హాజరై చండీయాగం హోమం ప్రత్యేక పూజ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్లో 5 ఎం.ఎల్.డి వాటర్ రిజర్వాయర్, గౌతమ్ నగర్ ఆర్.యు.బి నిర్మాణం కొరకు, జె.ఎల్.ఎస్.ఎన్ నగర్‌లో దేవాదాయ శాఖ భూముల విషయంలో పర్మినెంట్ స్టే ఆర్డర్ తీసుకురావడం లాంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, వరసిద్ధి వినాయక దేవాలయానికి తనవంతుగా ఆర్థిక సహాయం అందిస్తానని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉమామహేశ్వర్ మధుసూదన్, సాంబమూర్తి, భాస్కర్, శ్రీనివాసులు సాంబమూర్తి, సత్యనారాయణ, విష్ణుమూర్తి, ఉషాదేవి, సరోజ, బిఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, బైరు అనిల్, సిద్ధి రాములు, కృష్ణ గౌడ్, హేమంత్ పటేల్, శశిధర్, వాసు, లావణ్య శ్రీలత, సుధా, కార్యకర్తలు మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - అమనగల్లు : తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఉద్యమ కారుడు, మాజీ గిడ్డంగుల కార్పోరేషన్ చైర్మన్ సాయిచంద్ మౌర్య పోషించిన పాత్ర, అందించిన సేవలు మరువలేనివని, ఆయన సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సాయిచంద్ ద్వితీయ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సింగిల్ విండో చైర్మెన్ గంప వేంకటేష్ గుప్తా, మాజీ జడ్పీటీసీ జరుపుల దశరథ్ నాయక్‌తో కలిసి, సాయిచంద్ చిత్ర పటానికి, ఆయన పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంబాల పరమేష్ మాట్లాడుతూ, తన ఆట పాటలతో తెలంగాణ ఉద్యమంతో పాటు, తెలంగాణ పునర్నిర్మాణంలో సాయిచంద్ విశేషమైన పాత్ర పోషించారని ఆయన సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో తన ప్రతిభావంతమైన గొంతుతో ప్రజల హృదయాలను దోచిన ఓ గొప్ప గాయకుడు సాయిచంద్ తన పాటతో ఉద్యమ జ్వాలను రగిలించిన మాన్యుడని ఆయన పాడిన పాటలు తెలంగాణ ప్రజల ఆత్మగా మారి ఉద్యమాన్ని బలపరిచాయని పేర్కొన్నారు.

## నిరుద్యోగ యువతకు శుభవార్త.. ఉచితంగా డేటా ఇంజనీర్ కోర్సు

మహబూబ్‌నగర్: శ్రీ సత్యసాయి సేవా సంస్థ, నిరుద్యోగ యువత కోసం శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత డేటా ఇంజనీర్ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సుకు 2022-2025 మధ్య బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్ లేదా ఎంసీఏ పూర్తిచేసిన పట్టభద్రులు అర్హులు. ఆసక్తి ఉన్నవారు సేథు.ఏఐ (www.sethu.ai) లో నమోదు చేసుకోవచ్చు లేదా 9052372023కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు బేసిక్, అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్క్యూఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. తరగతులు హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్‌లో ఆఫ్‌లైన్‌లో జరుగుతాయి. కోర్సు పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్ సహాయం కూడా అందిస్తారు.

## మహా న్యూస్ ఛానల్‌పై బిఆర్ఎస్ దాడిని ఖండించిన సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహా న్యూస్ ఛానల్‌పై బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులో ఆయన మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు జర్నలిస్టులపై దాడి చేస్తూ, పెద్ద పెద్ద రాళ్ళతో విధ్వంసానికి పాల్పడడం, బీభత్సం సృష్టించడం దుర్మార్గమని అన్నారు. ఇది ముమ్మాటికీ పత్రిక స్వేచ్ఛపై తీవ్రమైన దాడి అని వ్యాఖ్యానించారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## జులై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర - మొయినాబాద్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమైన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాల అమలుకు సమరశీల పోరాటాలు తప్పవని, దానిలో భాగంగానే జులై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఏఐటీయూసీ అధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కరానికి, కార్మిక భద్రథకి, సంక్షేమానికి అనేక పోరాటాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకున్నారని అన్నారు. కార్మిక చట్టాలని కరోనా కాలంలో మోడీ ప్రభుత్వం ముజువాణి ఓటుతో పార్లమెంట్‌లో మార్పులు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని అన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలను సంతృప్తి పరచడానికి, వారి ఆదాయాలను మరింత రెట్టింపు చేయడానికి, కార్మికవర్గం రక్తాన్ని పీల్చి పిప్పి చేయడానికి నాలుగు లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. కార్మిక చట్టాల పరిరక్షణ కొరకు జులై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదంగా విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు మక్బుల్, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల, ఓటీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహా న్యూస్ ఛానల్‌ను సందర్శించిన గాంధీ

విశాలాంధ్ర - శేర్లింగంపల్లి: మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ మహా న్యూస్ ఛానల్ సీఎండీ వంశీ ని కలిసి మహా న్యూస్ యాజమాన్యానికి, సిబ్బందికి, జర్నలిస్టులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ మీడియా ఛానల్ మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది హేయమైన చర్య అని, మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై దుండగులు దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణం అని తెలియచేసారు. ఒక పిరికి పొంద చర్య అని ,సభ్య సమాజం తలదించుకునేల వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నాను అని ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు చోటు లేదు అని బెదిరింపులు, దాడులతో మీడియాను కట్టడి చేయాలనే ఆలోచన మంచిది కాదు. ప్రజలు, సమాజం దీన్ని ఆమోదించరు. మహా న్యూస్ యాజమాన్యానికి, సిబ్బందికి, జర్నలిస్టులకు సంఘీభావం తెలుపుతున్నాను అని చైర్మన్ గాంధీ తెలియచేసారు.

మహారాజశ్రీ అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
IA 445/2024 IN OS 16/2024
బిట్వీన్:
బొడ్డేటి అరుణ ప్రశాంతి....పిటీషనర్/వాది.
అండ్:
కొణతాల మాణిక్య భాగ్యలక్ష్మి
మరి ఒకరు...... రెస్పాండెంట్లు
IA నోటీస్
టు,
2వ రెస్పాండెంట్.
కొణతాల వెంకట వంశీ క్రిష్ణారావు S/O సత్యనారాయణ మూర్తి. వయసు 53 సంవత్సరములు. హిందూ. నివాసం PLOT NO-114.ఆనంద సాధన. ధరణి లేఔట్. సికింద్రాబాద్.
పై నెంబర్ IAలో పై కోర్టు వారు పంపిన సమన్లు మీరందుకోనందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం తే 28-7-2025 ది కి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని, మీ తరపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల అక్షేపనలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు IA తీర్మానించబడును.
V.S.S.R.B.శ్రీనివాస్.
అడ్వకేట్, అనకాపల్లి.
CELL:-9440332949.

మహారాజశ్రీ అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
OS 16/2024
బిట్వీన్:
బొడ్డేటి అరుణ ప్రశాంతి.....వాది.
అండ్:
కొణతాల మాణిక్య భాగ్యలక్ష్మి
మరి ఒకరు......ప్రతివాదులు
దావా సమను
టు,
2వ ప్రతివాది:-
కొణతాల వెంకట వంశీ క్రిష్ణారావు S/O సత్యనారాయణ మూర్తి. వయసు 53 సంవత్సరములు. హిందూ. నివాసం PLOT NO -114.ఆనంద సాధన. ధరణి లేఔట్. సికింద్రాబాద్.
పై నెంబర్ దావలో పై కోర్టు వారు పంపిన సమన్లు మీరందుకోనందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం తే 28-7-2025 ది కి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని, మీ తరఫున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల అక్షేపనలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడును.
V.S.S.R.B.శ్రీనివాస్.
అడ్వకేట్, అనకాపల్లి.
CELL:-9440332949.

## గోదావరి-బనకచర్లపై జులై1న పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల అంశంపై జులై 1న రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణా రాష్ట్ర ప్రజాప్రతినిధులందరికి నిజ నిజాలు తెలిపే విదంగా ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహించేం దుకు నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా ఆయన నీటిపారుదల రంగ అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బ తింటున్నాయాన్నది సమగ్రంగా వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జులై 1 మంగళవారం రోజున డాక్టర్ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మద్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్య అతిధులుగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలతో సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం హాజరు కానున్నారు. అంతేగాకుండా తెలంగాణా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ, లోకసభ సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులతో పాటు కార్పొరేషన్ చైర్మన్‌లు డైరెక్టర్‌లు వివిధ విభాగాలకు చెందిన కమిషన్ల చైర్మన్‌లు, సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## టీటీపీఓసీ 2025 లో ప్రెప్ఇన్‌స్టా భాగస్వామ్యం

**విశాలాంధ్ర - శేర్లింగంపల్లి:** భారతదేశంలోని ప్రముఖ ప్లేస్‌మెంట్ ప్రిపరేషన్, నైపుణ్యాభివృద్ధి వేదిక అయిన ప్రెప్ఇన్‌స్టా, జూన్ 6, 7 తేదీల్లో షాద్నగర్‌లోని పద్మజా పామ్ గ్రూప్ రిసార్ట్‌లో జరిగిన కెరీర్ నెక్సస్ 2025 కి గౌరవంగా హాజరైంది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ కన్సోర్షియం (టీటీపీఓసీ) ఏర్పాటు చేసింది. రెండు రోజుల పాటు సాగిన ఈ సదస్సు విద్యా సంస్థలు, కార్పొరేట్ నియామకదారుల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి ప్రధాన వేదికగా నిలిచింది. దేశవ్యాప్తంగా వందలాదిమంది టీపీఓలు, హెచ్ఆర్ అధిపతులు, ఎడ్టెక్ నేతలు, పాలసీ మేకర్లు పాల్గొని, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, నైపుణ్యాభివృద్ధి భవిష్యత్తును పునర్నిర్వచించాలనే లక్ష్యంతో చర్చించారు. ప్రెప్ఇన్స్టా సీనియర్ డైరెక్టర్ మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ, "భారతదేశంలో ప్లేస్‌మెంట్ లాండ్‌స్కేప్ వేగంగా మారుతోంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది గ్రాడ్యుయేట్లు తయారవుతున్నా, పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా ఉద్యోగానికి సిద్ధంగా ఉండే వారి శాతం చాలా తక్కువగా ఉంది. ఇది విద్యార్థుల విజయాన్ని పటిష్టంగా మద్దతిచ్చే ప్లేస్‌మెంట్ పద్ధతుల తరం కావాలి" అని అన్నారు.

## సోలార్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర- దుండిగల్ :** సహజ వనరులైన సోలార్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రిసోల్ సోలార్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ సహజ వనరులైన సౌరవిద్యుత్‌ను అందరూ వినియోగించుకోవడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జీడిమెట్ల డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ నేత రాజ్‌కుమార్‌కు సన్మానం

**విశాలాంధ్ర - బషీర్‌బాగ్ :** టీఎన్జీవోస్ యూనియన్ సెంట్రల్ ప్రెసిడెంట్ మరం జగదేశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం హుస్సేని ముజీబ్, ఉపాధ్యక్షుడు ఎం. భాస్కర్, ట్రెజరర్ పవన్, ఈసీ పదరావురావు, కార్యవర్గం ఉద్యోగులకు పదోన్నతుల కోసం కృషిచేసిన టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ తెలంగాణ స్టేట్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టరు శ్రీనివాస్ రెడ్డిలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. చార్మినార్ జోన్‌లో (9) సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులను కల్పించారని పేర్కొన్నారు. ప్రమోషన్ ప్రతిపాదనలను హైదరాబాద్ డీఈవో రోహిణి కార్యాలయం నుంచి ఆర్జెడి ఎస్సీకి పంపారు. అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెంట్ జి. రాజ్‌కుమార్ పదోన్నతుల కొరకు కృషి చేశారు. 5వ జోన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్లు వెంకట్ రాములు, శివకుమార్‌లు పదోన్నతులు పొందారు. ఈ సందర్భంగా ఆర్జెడీఎస్ఈ విజయలక్ష్మి విజయ్, అసిస్టెంట్ డైరెక్టర్ శాస్త్రి, సూపరింటెంట్ శేషికాంతరెడ్డి, శ్రీనివాస్, అశ్వినిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, ఫిరోజ్ అహ్మద్, సుదర్శన్, శ్రీనివాస్ బాబు, అరుణ జ్యోతి, రెహమాన్ రమాకాంత్, మధు, గిరీష్, పరమేష్, సంతోష్, దామోదర్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశాలాంధ్ర - మొయినాబాద్:** మండలంలోని కనకమామిడి జిల్లా పరిషత్ పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు అదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు సన్మానించారు.

## గుల్ మోహర్ గార్డెన్స్ నూతన కమిటీ ఎన్నిక

**విశాలాంధ్ర - కాప్రా :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గుల్ మోహర్ గార్డెన్స్‌లో నూతనంగా ఎన్నికైన కమిటీ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్ రెడ్డిలను సన్మానించి, అనంతరం నూతన కమిటీని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గుల్ మోహర్ గార్డెన్స్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. తన దృష్టికి తెచ్చిన పలు వినతులను ఓపెన్ జిమ్, బోర్వెల్, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాలు, చెట్ల కొమ్మలను తొలగింపు వంటి సమస్యలు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి శశికిరణ్, సాయిచంద్, ప్రవీణ్, రూపేష్, విజయశ్రీ, గాయత్రి పాల్గొన్నారు.

# వైభవంగా గోల్కొండ మహంకాళి అమ్మవారి జాతర

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** వచ్చిన భక్తులందరికీ ప్రశాంతంగా అమ్మవారి దర్శనం కల్పించేలా పోలీస్ శాఖతో పాటు దేవాదాయ అధికారులు సిబ్బందికి దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావు సూచించారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున చేసిన ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండాలని సూచించారు. మెడికల్ స్టాల్‌ను సందర్శించి భక్తులకు అందుతున్న వైద్య సదుపాయాలు అలాగే హెచ్ఎండిఏ ఏర్పాటు చేసిన మంచినీటి స్టాల్స్‌లను ఆయన పరిశీలించి త్రాగునీటి ఇబ్బంది లేకుండా భక్తులకు మంచినీటి సదుపాయం కల్పించాలని సూచించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులను సూచించారు. గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారి జాతర అంగరంగ వైభవం కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులు, పుర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ప్రభుత్వం ఆషాడ బోనాల ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ అన్ని శాఖల అధికారులకు సమన్వయ పరుస్తూ జాతరలో ఎక్కడ కూడా సమస్యలు ఇబ్బందులు కలగకుండా జాతరలో ఎక్కడ కూడా సమస్యలు ఇబ్బందులు కలకుండా అన్ని శాఖల అధికారులు, పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తులకు పూర్తిస్థాయిలో సహకారాన్ని అందిస్తున్నారు. తొలి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకోవడం జరుగుతుంది. కోటపైన భక్తులు రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తూ తొక్కిసలాట జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. వైద్య సదుపాయాలకై వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్యరీత్యా ఉన్న వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. జాతరలో విదేశీయులు రావటం ఒక ఆకర్షణగా నిలిచింది. వచ్చే భక్తులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఏర్పాటు చేసిన పోలీస్ పాయింట్, అలాగే జూబ్లీహిల్స్ పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం నిగా పెట్టి పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవాదాయశాఖ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, హైదరాబాద్ నగర సివి ఆనంద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌లు నియమించిన అధికారులకు జగదాంబ మహంకాళి జాతర ప్రశాంతగా జరిగే విధంగా ఆదేశాలిస్తున్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్, పీస్ కమిటీ సభ్యులు హెచ్ఎండిఏ వాటర్ స్టాల్స్, మెడికల్ క్యాంప్స్, అంబులెన్సు నిర్వహణ, జిహెచ్ఎంసి ద్వారా పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగుతున్నాయి.

# పట్టాలు వచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తాం : సీపీఐ

**విశాలాంధ్ర - మేడిపల్లి:** మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండలం కార్యదర్శి రచ్చ కిషన్ అధ్యక్షతన ఆదివారం ఉదయం జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు వి.ఎస్ బోస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్‌లు హాజరవడం జరిగినది. స్వాతంత్ర సమరయోధురాలు తొలి దశ తెలంగాణ సాయుధ పోరాట వీరనారి సుగుణమ్మ మరణానికి తీరని లోటు అని వారి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు తెలిపారు. జనరల్ బాడీ సమావేశాన్ని ఉద్దేశించి వారు ఇరువురు మాట్లాడుతూ భగత్‌సింగ్ నగర్ కాలనీలో గత 20 సంవత్సరాల క్రితం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం గుడిసెలు వేయడం జరిగినది. గతంలో ఈ భూమి మీద కోర్టులో అనేక న్యాయ పోరాటాలు చేసి ఈ భూమి పేదలు నివాసం ఉంటున్నారని అప్పుడు వేసిన కోర్టులో కేసు కొట్టి వేయడం జరిగినది. మరల కొంతమంది భూముల ధరలు పెరగడంతో కొంతమంది దురుద్దేశంతో పేద ప్రజలను ఇక్కడి నుంచి ఎలాగైనా తీసేయాలని దురుద్దేశంతో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను కూడా వాటిపై కోర్టు నుంచి నోటీసులు ఇవ్వడం జరిగినది. ఈ భూమిపై గత 20 సంవత్సరాల నుంచి పేద ప్రజలు జీవనం సాగిస్తున్నారు. కావున ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే గుర్తించి ఇప్పటివరకు వచ్చిన పట్టాలను కొంత మంది పేదవాళ్లకు పట్టాలు రాని వాళ్లకు కూడా పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద వారికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అలాగే స్వాతంత్ర సమరయోధురాలు తొలిదశ తెలంగాణ సాయుధ పోరాట వీరనారి సుగుణమ్మ మరణం పార్టీకి తీరని లోటు అని వారి పోరాటాల నేటి యువత ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలను కొనసాగించాలని వారు అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, జె.లక్ష్మి, ధర్మేందర్, నిమ్మల నరసింహ, మండలం పార్టీ సీనియర్ నాయకులు విబి. బాలరాజ్, మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ కౌన్సిల్ సభ్యులు సిహెచ్ మాధవి, కే ప్రమీల, బాపరాజు, భూతం ఐలయ్య, కే మహాలక్ష్మి, నర్సమ్మ, ఎండి అన్వర్, ఘట్కేసర్ మండల్ సిపిఐ పార్టీ నాయకులు జై చందర్, భగత్ సింగ్ నగర్ వాసులు జి నాగరాజు, ఇస్తారు, సోమరాజు, ఉపేందర్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**విశాలాంధ్ర - పటాన్ చెరువు :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరువు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తూ ముందుకు వెళ్తున్నామని పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ బీహెచ్ఈఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం ఏర్పడిన బిహెచ్ఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీతో పాటు సమీప కాలనీల ప్రజల కోసం ఏడు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. కాలనీలో గుడి, మసీదు, చర్చి నిర్మాణాల కోసం 30 లక్షల రూపాయల సొంత నిధులు అందించడం జరిగిందని గుర్తు చేశారు. అతి త్వరలో మరో 70 లక్షల రూపాయలు కేటాయించి నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 20 కాలనీలో ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందిస్తున్నామని.. మిగిలిన కాలనీల ప్రజల కోసం త్వరలోనే పైపులై నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నూతన కమ్యూనిటీ హాల్లో ఫ్లోరింగ్ నిర్మాణ పనులకు సొంత నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన అందిస్తూ ప్రతి ఒక్కరి ఆర్థిక అభ్యున్నతి లక్షంగా పనిచేస్తున్నామని తెలిపారు.

అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, జ్ఞానేశ్వర్, రాజు, కృష్ణ, శ్రీకాంత్, మల్లేష్, బీహెచ్ఈఎల్ యూనియన్ ప్రతినిధులు రెహమాన్, దామోదర రెడ్డి, మల్లేష్, మల్లికార్జున గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మీడియాపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య

**విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్ :** మీడియాపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని.ప్రభుత్వం తక్షణమే స్పందించి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర మఫిషియల్ కమిటీ కన్వీనర్ గుడుపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. టియుడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో మహా న్యూస్ ఛానల్‌పై జరిగిన దాడికి నిరసనగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ముఖ్య కూడలిలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు నిరంతరం పాటుపడుతుంటే వీధి రౌడీల్లా వచ్చి మీడియా ఛానళ్లపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచిన జర్నలిస్టులపై దాడులు చేయడం ఒక పిరికిపంద చర్యగా భావిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చెక్కల శ్రీశైలం మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం సమాచార సేవ చేస్తున్న మీడియా రంగాలపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. మహా న్యూస్ ప్రధాన కార్యాలయం పై జరిగిన దాడి సంఘటనలు సభ్య సమాజంలో తలదించుకు నేలా ఉన్నాయని, పత్రికా స్వేచ్ఛను హరిస్తే వాస్తవాలు వెలుగులోకి ఎలా వస్తాయని, వాస్తవాలను ప్రజలకు తెలియజేసే మీడియాపై దాడులు చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. నరసింహ మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాలో ఉన్న నాయకులు ప్రధాన పక్షానికి మంచి సలహాలు సూచనలు ఇచ్చి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా పాటుపడాలి కానీ, వార్తా ప్రసార కథనాలను అడ్డంపెట్టుకుని మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసు యంత్రాంగం దాడి చేసిన వారిని పట్టుకుని తీవ్రంగా శిక్షించాలన్నారు. టియుడబ్ల్యూజే ఐజేయు ప్రింట్ మీడియా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, జిల్లా కార్యదర్శిలు దన్నారం రమేష్,ఎండి. ఇలియస్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఆకుల శ్రీనివాస్, అల్వాల దర్శన్, మొహమ్మద్ సమీ, విష్ణు, నీరటి శివకుమార్, ఫయాజ్, సలీం, సాబీర్, శ్రీకాంత్, కాజా సోయల్, శ్రావణ్ గౌడ్, మహమ్మద్ రియాజ్, కార్తీక్, రమేష్, ఎక్బాల్‌లు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై అధికారుల మౌనం

**విశాలాంధ్ర - మొయినాబాద్ :** రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న భారీ అక్రమ నిర్మాణాలపై అధికారులు మౌనంగా ఉండటం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోంది. ముఖ్యంగా హిమాయత్ నగర్‌లోని సర్వే నెంబర్లు 146, 147, ఎన్కెపల్లిలోని సర్వే నెంబర్లు 63, 55, చిలుకూరులోని సర్వే నెంబర్ 263 లలో ఇతర సర్వే నెంబర్లలో జీవో నెం.111 నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ అక్రమాలకు సంబంధించి ఇప్పటికే ఎన్నోసార్లు పత్రికలో వార్తలు వచ్చినా, లెక్కకు మించిన ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీనిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలకు అధికారులకు సంబంధాలు ఉన్నాయా, లేదా ముడుపుల ప్రభావమా అనే అనుమానాలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇది అధికారుల నిర్లక్ష్యానికి, అవినీతికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు.

**ప్రభుత్వంపై సడలుతున్న నమ్మకం..**

అక్రమ భవనాలపై మౌనం అనేది అధికార నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని బలహీనపరిచే విధంగా అధికార వ్యవస్థ వ్యవహరిస్తోంది" అని స్థానికులు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నారు. అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని, ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం

**విశాలాంధ్ర - తుర్కయంజాల్ :** ప్రజసమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని పార్టీ నాయకులు ఓరుగంటి యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సీపీఐ రాగన్నగూడ శాఖ మహాసభ జిల్లా సమితి సభ్యులు పి శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం అంటే అది ప్రజల సిద్ధాంతమని, నిరంతరం ప్రజల సమస్యలపై పనిచేసే సిద్ధాంతం అని అన్నారు. ప్రజల కష్టాలు ఎక్కడ ఉంటే అక్కడ ఎర్ర జెండా ఉంటుందని అన్నారు. దేశంలో ప్రజలు తీవ్రమైన ఆర్థిక అసమానతలతో ఉన్నారని, ఆర్థిక సమానత్వాన్ని సాధించకుండా దేశం ముందుకు పోదని అని అన్నారు. రాగన్నగూడ శాఖ పరిధిలో అనేకమైన డ్రైనేజ్ సమస్యలు, మంచినీటి సమస్యలు, కాలనీ రోడ్డు సమస్యలు ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై పనిచేయాలని అన్నారు. రాగన్నగూడ వార్డు పరిధిలోని సమస్యలపై సిపిఐ పార్టీ పోరాడుతుందని అన్నారు. యువత మత్తుకు బానిస కాకుండా విద్యార్థులకు యువకులకు అవగాహన కల్పించాలని వారు తెలిపారు. అనంతరం సీపీఐ రాగన్నగూడ శాఖ నూతన కార్యదర్శిగా పల్లపు శివకుమార్, సహాయ కార్యదర్శిలుగా శ్రీకాంత్, లోకేష్‌లతో పాటు 9 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు పి.శివకుమార్ గౌడ్, జనార్ధన్, శ్రీనివాస్ గౌడ్, కొండిగారి శివకుమార్, శ్రీకాంత్, గోవర్ధన్, లోకేష్, పృధ్వి, వంశీ, నాగేశ్వర్, దేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పరస్పర సహకారంతోనే ప్రగతి సాధ్యం

**విశాలాంధ్ర - రాజేంద్రనగర్ :** మార్కండేయనగర్ సత్య సాయి పొదుపు సంఘం 25 సంవత్సరాల వార్షికోత్సవం శివరాపల్లి ప్రజా భవన్లో సత్యసాయి పొందుపు సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఆ సంఘం రజతోత్సవ మహా సభలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం స్థాపించిన సత్యసాయి పొదుపు సంఘం నెలకు రూ.30 పొదుపుతో ప్రారంభమై 664 మంది సభ్యులకు సేవలందిస్తు ఐదు కోట్ల టర్నోవర్తో అభివృద్ధి పథంలో కొనసాగడం సంతోషకరంగా ఉందన్నారు. సంఘం తలపెట్టిన ఫంక్షన్ హాల్ నిర్మాణానికి తన వంతు సహాయా సహకారాలు అందిస్తాను అని అన్నారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపక కార్యదర్శి, సలహాదారుడు గద్దె యాదగిరి, సలహాదారులు ఏర్వ సత్యనారాయణ, గద్దె క్రిష్ణ, పగిడిమర్రి వాను, సంఘం ఉపాధ్యక్షుడు మునగపాటి విష్ణు, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, సహాయ కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్, కోశాధికారి కోటపవన్ కుమార్, పాలక మండలి సభ్యులు కంది అశోక్, కైరంకొండ శంకర్, విడెం రమేష్, శిరందాను నరేందర్, గంజి నరేష్, గంజి ధనంజయ్, బాత్కు విజయ్ కుమార్, బూసం భాను చందర్ తదితరులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఘనంగా సన్మానించారు.

## సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : కూన

**విశాలాంధ్ర- దుండిగల్:** ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి గాజులరామారం 127 డివిజన్ శ్రీ శ్రీ చిత్తరమ్మ దేవస్థానం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కొండడి యాదవరావుకు రూ.60,000, కదలి సత్యనారాయణ రూ.37,500, భల్లం ఉషారాణికి రూ.35,000, విజయరామ రాజు రూ.32,500, విట్టల్ 60,000ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సిఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం నిరుపేదలకు వరంగా మారిందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ద్వారా బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వ సంక్షేమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన మాజీ మేయర్

**విశాలాంధ్ర - మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్, రాంనగర్ కాలనీలో ఆదివారం యుజీడీ, సీసీ రోడ్డు నిర్మాణ పనుల పర్యవేక్షణ ఆదివారం ఉదయం మాజీ కార్పొరేటర్ బొడిగే స్వాతి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్‌తో కలిసి పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ ప్రజల అవసరాల దృష్ట్యా యుజీడీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, ప్రజల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. స్థానిక ప్రజలు ఈ పనుల పట్ల సంతోషం వ్యక్తం చేయడమే కాకుండా, నాయకులు భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్లు శారదా ఈశ్వర్ రెడ్డి, యాసారం మహేశ్వరి మహేష్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు బొడిగె రాందాస్ గౌడ్, చిలుముల జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంగూరి పరమేశ్వర్, కవిడ కుమార్, గౌడ్, చిలుముల రవిశంకర్ రెడ్డి, పాండు, రమేష్, బద్దం అంజి రెడ్డి, పన్నాల జంగారెడ్డి, గున్నాల అశోక్ రెడ్డి, మర్రి జంగారెడ్డి, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, కోక్కు వెంకటేష్, బల్లెపు నర్సింగ్ రావు, దేగ శీను, బొడిగె భాస్కర్ గౌడ్, రమేష్, బోడిగే శ్రీనివాస్ గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

## గిరిజన నేత రాంబల్ నాయక్‌ను పరామర్శించిన హరీష్‌రావు

**విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్ :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం ఎక్లాస్ ఖాన్ పేట గ్రామం పొడగుట్ట తండాకు చెందిన మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు భారత రాష్ట్ర సమితి గిరిజన నాయకులు రాంబల్ నాయక్ తండ్రి ఇటీవలే మరణించిన విషయం తెలుసుకొని రాంబల్ నాయక్ ఇంటికి వెళ్లి పరామర్శించిన బీఆర్ఎస్ పార్టీ మాజీమంత్రి హరీష్ రావు, రాంబల్ నాయక్ తన తండ్రిని కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. రాంబల్ నాయక్ తండ్రి మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మంత్రి హరీష్ రావు తో పాటు రాంబల్ నాయక్ ను పరామర్శించిన వారిలో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ ఎస్టీ ఎస్సీ కమిషన్ సభ్యులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రవి యాదవ్ పాల్గొన్నారు.

# సుగుణమ్మ ఆశయాల సాధనకు కృషి

## సంస్మరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసేందుకు,. అణగారిన వర్గాలకు ప్రాణం పోసేందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీల విలీనాన్ని కాంక్షించిన సుగుణమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని వక్తలు అన్నారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ ఇంద్రజిత్ గుప్తా సమావేశ మందిరంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ప్రముఖ కమ్యూనిస్టు నేత శాకమూరి సుగుణమ్మ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ... సుగుణమ్మ మరణం మహిళా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. ఆమె ఊపిరి ఉన్నంత వరకు ఉద్యమాల కోసం పని చేశారని గుర్తు చేశారు. సమాజం మనకు ఏం ఇచ్చిందనే భావనతో కాకుండా, మనం సమాజానికి ఏం చేశామనే ఆలోచనతోనే ఆమె ఉద్యమంలో పాల్గొన్నారని నారాయణ అన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆదర్శవంతమైన జీవితం గడిపిన సుగుణమ్మ ... గొప్ప పోరాట యోధురాలని కొనియాడారు. ఉద్యమాలను ఎలా చేయాలో రాబోయే తరాలకు ఆమె బాట వేశారన్నారు. ఆమె జీవితం మొత్తం కమ్యూనిస్టు ఉద్యమాలతోనే ముడిపడిందన్నారు. భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చిన సుగుణమ్మ ఉద్యమ కాలంలో ఎన్నో కష్టాలను అనుభవించారని, ఆమె భర్త ఎస్.వి.కె. ప్రసాద్ తోడుగా ఉద్యమంలో పాల్గొన్నారని, కమ్యూనిస్టులు ఏకం కావాలన్నదే ఆమె చివరి కోరిక అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలవాలని ప్రజలు బలంగా కోరుతున్నారని, సుగుణమ్మ కోరిక కూడా అదేనని అన్నారు. కర్రగుట్ట, చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులను కేంద్రం ఊచకోత కోస్తుంటే ఎందుకు ఆత్మవిమర్శ చేసుకోవడం లేదని, తుపాకీతో కేంద్రాన్ని పడగొట్టే సత్తా ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై చర్చించాలని, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఐక్యత దిశగా చర్చలు కొనసాగాలని ఆకాంక్షించారు. సీపీఐ, సీపీఐ (ఎం) చీలిపోవడం ఒక చీకటి రోజుగా అభివర్ణించారు. ఈ రెండు పార్టీలు కలవాలని తీర్మానం చేసుకున్న తర్వాత కూడా ఇంత వరకు కలవలేదన్నారు. ముందుగా ప్రజాసంఘాలను కలిపేందుకు తీర్మానించినప్పటికీ ఫలితం లేకుండాపోయిందన్నారు. సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే సుగుణమ్మ ఉద్యమ బాట పట్టారని, ఆమె త్యాగాలు తమకు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో శక్తివంతమైన ఉద్యమం రావాలంటే సుగుణమ్మ స్ఫూర్తితో వామపక్ష పార్టీల ఐక్యతను ఆచరణలోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఫౌండేషన్ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పది మందిలో చైతన్యం తీసుకొస్తూ సుగుణమ్మ ఉద్యమాలను నడిపించారని గుర్తు చేశారు. ఆమె ఆశయ సాధన దిశగా ముమ్ముందు పనిచేస్తామన్నారు. ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు, సీపీఐ సీనియర్ నాయకులు ప్రేమ్, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి, ఫౌండేషన్ పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నేదునూరి జ్యోతి, సుగుణమ్మ కుమార్తె డాక్టర్ శోభ, కుమారులు డాక్టర్ రవి, రమేష్, ఆమె సంరక్షకులు జిలాని... సుగుణమ్మ ఉద్యమ చరిత్రను గుర్తు చేశారు. తొలుత సుగుణమ్మ చిత్రపటానికి నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ మాజీ ఎమ్మెల్సీ పి.జె. చంద్రశేఖర్, సీనియర్ నాయకురాలు డాక్టర్.బి.వి.విజయలక్ష్మి, ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జె.కల్పన, ఎన్ఆర్ఆర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డా.టి. సురేశ్, సభ్యులు కె. జ్యోస్నా ఐద్వా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇందిర పాల్గొన్నారు.

# ప్రమాదంలో లౌకికవాదం

## పరిరక్షణకు ఐక్య పోరాటాలు అవశ్యం: రామకృష్ణ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకైన భారతదేశంలో లౌకికవాదం ప్రమాదంలో పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఎన్డీయే పాలనలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ నిర్వీర్యమవుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమైక్యవాదం పరిరక్షణకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌వారు ఏకం కావాలని, ఐక్య ఉద్యమాలను చేపట్టాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండల కేంద్రంలో కమ్యూనిస్టు నాయకుడు లక్ష్మన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థూపావిష్కరణ జరిగింది. రామకృష్ణతో పాటు సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి నీలకంఠాపురం రఘువీరా రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణ, రఘువీరారెడ్డి మాట్లాడుతూ సమసమాజం కోసం గతంలో జరిగిన ఐక్యపోరాటాలను గుర్తుచేశారు. అవినీతి, అక్రమాలు పెరిగి... వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయన్నారు. రాజ్యాంగంలోని 'సెక్యులర్' పదాన్ని తొలగించాలనే బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు సాహసోపేత నిర్ణయాలతో ముందుకెళుతున్నాయని ఉద్ఘాటించారు. రాజకీయంగా భేదాభిప్రాయాలు ఉండవచ్చుని కానీ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రామకృష్ణ, రఘువీరా రెడ్డి చెప్పారు. తమ ఐక్యపోరాటాలకు పూర్వవైభవం తేవాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని రామకృష్ణ డిమాండ్ చేశారు. బనకచర్ల, గోదావరి నదుల అనుసంధానం కోసం రూ.82,000 కోట్లు అవసరమని ముఖ్యమంత్రి చెబుతున్నారన్నారు. హంద్రీనీవా, గాలేరు నగరి, వెలుగొండ సొరంగం పూర్తి చేయకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టడాన్ని తప్పుపట్టారు. ప్రతి ఎకరాకు సాగు-తాగునీరు ఇవ్వాలని, ప్రభుత్వ విధానాల్లో మార్పు తేవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సంజీవప్ప, గోపాల్ పాల్గొన్నారు.

**నకిలీ స్టాంపుల కుంభకోణంపై సమగ్ర విచారణకు డిమాండ్**

నకిలీ స్టాంపుల కుంభకోణంపై సమగ్ర విచారణకు రామకృష్ణ డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి కుంభకోణాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తక్షణమే స్పందించాలని, వినియోగదారుల అనుమానాలు నివృత్తి చేయాలని హితవు పలికారు. ప్రజల డబ్బుకు రక్షణ కల్పించాలని... ఆదాయానికి గండి కొట్టేది ఎంతటి వారైనా ఉపేక్షించరాదని అన్నారు. ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి స్పందించి... విచారణ జరిపేలా సంబంధిత శాఖలకు తక్షణాదేశాలివ్వాలని కోరారు.

# ఆమెకు అండగా ఉన్నాం...

## బాధితురాలి ఆచూకీ అందించడంలో పోలీసులు విఫలం

### కోల్‌కతా అత్యాచార ఘటనపై ఎన్‌సీడబ్ల్యూ

కోల్‌కతా: న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచార దురాగతం జరిగిన దక్షిణ కోల్‌కతాలోని న్యాయ కళాశాలను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సభ్యురాలు అర్చన మజుందార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పోలీసులు బాధితురాలి ఆచూకీ తెలపలేదన్నారు. 'కమిషన్ ఆమె అండగా ఉంది... బాధితురాలికి ఆమె కోరుకున్నంత కాలం సహాయం చేయడమే ఎన్‌సీడబ్ల్యూ ఉద్దేశం' అని ఆమె అన్నారు. బాధితురాలి తల్లిదండ్రులతో కూడా మాట్లాడటం అవసరమని తెలిపారు. ఇది ఎన్‌సీడబ్ల్యూ ద్వారా జరిగే దర్యాప్తులో భాగమని... అటువంటి సందర్భాలలో బాధితురాలితో పాటు తల్లిదండ్రులతో కూడా ఎన్‌సీడబ్ల్యూ మాట్లాడుతుందని, వారికి ఏమి అవసరమో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుందని, ఆమె భద్రత, విద్యను ముందుకు తీసుకెళ్లడంలో సహాయం మొదలైన వాటితో సహా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుందని చెప్పారు. న్యాయ కళాశాలను సందర్శించిన సమయంలో మజుందార్ -అక్కడ ఉన్న పోలీసు అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. కళాశాలలో ఉన్న అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలు కాకుండా ఆమెతో పాటు వచ్చిన మరో ఇద్దరు వ్యక్తుల మొబైల్ నంబర్లను నోట్ చేసుకున్న తర్వాత క్యాంపస్‌లోకి ప్రవేశించడానికి అనుమతించినట్లు చెప్పారు. 'వీడియోగ్రఫి లేదా స్టిల్ ఫోటోగ్రఫీని లోపలికి అనుమతించలేదు' అన్నారు. మజుందార్ తరువాత క్యాంపస్‌లోకి ప్రవేశించి జూన్ 25న జరిగిన సంఘటన జరిగిన గార్డ్ రూమ్‌ను సందర్శించారు. 'నేను నా పనిని పూర్తి చేయలేకపోయానని నివేదిస్తాను' అని అన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రధాన నిందితుడు, పూర్వ విద్యార్థి, ఇద్దరు విద్యార్థులతో పాటు కళాశాల గార్డును శనివారం ఉదయం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేయడానికి అసిస్టెంట్ కమిషనర్ హోదా అధికారి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ను ఏర్పాటు చేసింది. బీజేపీ, వామపక్షాలు సహా ప్రతిపక్ష రాజకీయ పార్టీలు తృణమూల్ కాంగ్రెస్ పాలిత పశ్చిమ బెంగాల్‌లో విద్యాసంస్థల్లో భద్రత లేదని ఆరోపిస్తూ సామూహిక అత్యాచార ఘటనపై నిరసనలు చేపట్టాయి.

# 'ఆలయ నిర్మాణం' పుస్తకం ఆవిష్కరించిన వేం నరేందర్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: శిల్పాగమ శాస్త్రాలను అనుసరించి ఆలయ నిర్మాణ పద్ధతులను డిజైన్లతో సహా రచించిన 'ఆలయ నిర్మాణం' పుస్తకాన్ని ముఖ్యమంత్రి సలహాదారుడు, వేం నరేందర్ రెడ్డి నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. భూ పరీక్ష నుంచి ప్రతిష్ట వరకు గల వివిధ నిర్మాణ దశలు, ఉపపీఠం నుంచి కలశం వరకు, గర్భాలయం నుంచి గోపురం వరకు వివరాలతో పాటు చిత్రాలను కూడా పొందుపరిచిన రచయిత డా.పి.సుబ్రమణి, సంపాదకుడు డా.ఈమని శివనాగిరెడ్డిని, ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందించిన ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ (కాంగ్రెస్) తెలంగాణ రాష్ట్ర ఉప అధ్యక్షులు మొగళ్ల రాజిరెడ్డిని వేం నరేందర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, శిల్పి బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకం దేవాదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయ నిర్మాణ శిల్పులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. మొగళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ఆగమ, శిల్పా శాస్త్రాల్లోని విషయాలతో పాటు ఆలయ వివిధ భాగాలను ప్రమాణ సహితంగా వేసిన చిత్రాలు తెలుగు శిల్పులకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ పుస్తకం ముద్రించినట్లు తెలిపారు.

# కరేడు గ్రామస్థుల నిర్బంధం దుర్మార్గం

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన కరేడు గ్రామస్థులపై పోలీసుల నిర్బంధం, అరెస్టులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. కరేడులో షిర్డిసాయి అనుబంధ ఇండోసోల్ కంపెనీకి 8,458 ఎకరాల భూమిని అప్పనంగా అప్పగించేందుకు చేస్తున్న భూసేకరణకు వ్యతిరేకంగా, బలవంతపు సేకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ భూ పోరాట సాధన కమిటీ అధ్వర్యంలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన గ్రామ ప్రజలపై పోలీసులు అత్యంత నిర్బంధంగా వ్యవహరించి, అరెస్టులకు పాల్పడటం దుర్మార్గమని తెలిపారు. నాడు చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను తప్పుపట్టారని పేర్కొన్నారు. అదానీ కంపెనీతో సోలార్ విద్యుత్ ఒప్పందాలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, బలవంతపు భూసేకరణ, అధిక ధరలు వంటి వాటిని గతంలో చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం కూడా ఆ అనాలోచిత నిర్ణయాలనే అమలు చేయటం విచారకరమని తెలిపారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు సైతం కరేడు గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ నిర్బంధకాండ కొనసాగించటం దారుణమని, ప్రభుత్వం పోలీసుల్ని ప్రయోగించి రైతులు, గిరిజనులు, మహిళలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కరేడు గ్రామస్థుల ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన ఏఐసీపీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# మహాకూటమి ప్రభుత్వం రాగానే వక్ఫ్ చట్టం బుట్టదాఖలు

## 'సేవ్ వక్ఫ్, సేవ్ కాన్‌స్టిట్యూషన్' ర్యాలీలో తేజస్వి

పాట్నా: బీహార్ నుంచి ఎన్డీయేను సాగనంపే రోజులు దగ్గరకొచ్చాయని, మహాకూటమి అధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని, అది జరిగిన వెంటనే వక్ఫ్ చట్టాన్ని బుట్టదాఖలవుతుందని ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ఉమ్మడి పోరుకు సిద్ధం కావాలని, ప్రలోభాలకు తలొగ్గవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. చారిత్రక గాంధీ మైదానంలో ఆదివారం నిర్వహించిన 'సేవ్ వక్ఫ్, సేవ్ కాన్‌స్టిట్యూషన్' ర్యాలీలో తేజస్వి పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు నల్ల బ్యాండ్లు ధరించి హాజరయ్యారు. తేజస్వి మాట్లాడుతూ 'వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆర్జేడీ బలంగా పోరాడుతుందని మన జాతీయ అధ్యక్షుడు లాలు ప్రసాద్ స్పష్టంగా చెప్పారు. మన ఎంపీలు పార్లమెంటు ఉభయ సభల్లో ఈ చట్టాన్ని వ్యతిరేకించారు. దీనిపై కోర్టును కూడా ఆశ్రయించాం' అని అన్నారు. బీహార్ నుంచి ఎన్డీయే బయటకు వెళ్లిపోతోందని గుర్తు పెట్టుకోవాలని ముస్లిం సోదరులను కోరుతున్నానన్నారు. 'నవంబరులో నూతన పేదల అనుకూల ప్రభుత్వం ఏర్పాటు కాబోతోంది. వక్ఫ్ చట్టాన్ని బుట్ట దాఖలు చేస్తుంది' అని తేజస్వి చెప్పారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు అందరూ కలిసి పోరాడటం, త్యాగాలు చేయడం ద్వారానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని కేంద్రంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గుర్తుపెట్టుకోవాలన్నారు. దేశం ఎవరి సొంత ఆస్తి కాదని, అలా ప్రవర్తించడం ఆక్షేపణీయమన్నారు. ఓటర్ల జాబితా సమీక్షల నెపంతో బీజేపీకి మద్దతిచ్చే ఎన్నికల సంఘం ప్రయత్నాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ప్రజల ఓటు హక్కును హరించే కుట్రలను ఐక్యంగా తిప్పికొట్టాలని తేజస్వీ యాదవ్ పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం వక్ఫ్, ప్రజాస్వామ్యం,దేశ సంస్కృతి, సమిష్టివాదాన్ని పరిరక్షించేందుకు ఉద్దేశించినదని అన్నారు. తన బాల్యం పాట్నాలో గడిచిందని, తన తాత జాకీర్ హుస్సేన్ బీహార్ గవర్నర్‌గా పనిచేశారని చెబుతూ రాష్ట్రంలో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ర్యాలీలో కాంగ్రెస్ ఎంపీలు ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, సయ్యద్ నాసిర్ హుస్సేన్ పాల్గొన్నారు. ఇమ్రాన్‌కు అభిమానుల నుంచి ఘన స్వాగతం లభించింది. కాగా, స్వతంత్ర ఎంపీ పప్పుయాదవ్, ఏఐఎంఐఎం బీహార్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అక్తారుల్ ఇమాన్ తదితరులు ప్రసంగించారు.

**తేజస్వి వైపు దూసుకొచ్చిన డ్రోన్**

ర్యాలీలో మాట్లాడుతున్న సమయంలో ఒక డ్రోను తేజస్వి వైపుకు దూసుకురావడం కలకలం రేపింది. ర్యాలీ చిత్రీకరణ కోసం ఏర్పాటు చేసిన డ్రోను తన వైపుకు రావడాన్ని గమనించిన తేజస్వి ప్రసంగించడం ఆపేసి, వెనక్కి జరిగారు. నిమిషాల వ్యవధిలోనే ప్రసంగాన్ని పునః ప్రారంభించారు. ఈ డ్రోన్‌ను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. డ్రోన్లు వంటివి ఎగరవేయకుండా ఈ ప్రాంతంలో నిషేధం ఉందని, జనాన్ని నియంత్రించడంలో పోలీసులు నిమగ్నం కావడంతో ఇది తమ గమనానికి రాలేదని, దీనిపై దర్యాప్తు చేస్తామని పాట్నా సెంట్రల్ ఎస్పీ దీక్ష చెప్పారు.

# కమ్యూనిస్టుల ఐక్యత అవసరం

## వామపక్ష నేతల పునరుద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత అవసరమని వామపక్ష, ప్రజాతంత్ర నేతలు పునరుద్ఘాటించారు. కార్మికవర్గ అగ్రగామి దళం, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణకర్త అమరజీవి మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో 'వర్తమాన రాజకీయ పరిస్థితులు-కమ్యూనిస్టు ఉద్యమాల ఐక్యత, సామాజిక న్యాయం-కర్తవ్యాలు' అంశాలపై ఎంసీపీఐ(యూ) అధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యులు తూమాటి శివయ్య అధ్యక్షోపన్యాసం చేస్తూ... దేశంలో సామాజిక న్యాయం కమ్యూనిస్టుల ఐక్యత, కర్తవ్యంగా ఓంకార్ ఆశయాలు సాధించాలన్నారు. ఎంసీపీఐ(యూ) పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం మాట్లాడుతూ బహుజనులు, కార్మికవర్గం రాజ్యాధికారం రావాలనేది ఓంకార్ ఆశయమని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మతోన్మాదం ఏ రూపంలో ఉన్నప్పటికీ దానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ లాల్-నీల్ మైత్రి నినాదంతో కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీని ఎదుర్కొనేందుకు వామపక్ష, కాంగ్రెస్, ప్రజాతంత్ర శక్తులు, బీజేపీయేతర పార్టీలు సంఘటితం కావాలన్నారు. జులై 9న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెకు పూర్తి మద్దతుగా నిలవాలని కోరారు. ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకులు ఓంకార్‌తో సీపీఐ రాష్ట్రంలో నడిపిన ఎల్‌డీఎఫ్ ఉద్యమాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రధాన వక్తలుగా విచ్చేసిన లాల్-నీల్ మైత్రి నిర్వాహకులు, ప్రొఫెసర్ మార్క్ శంకర్ నారాయణ, మార్క్సిజం, అంబేద్కర్ ఆలోచన విశ్లేషకులు అబ్దుల్ నూర్ బాషా ప్రసంగిస్తూ... లాల్-నీల్ మైత్రి ఐక్యత అవసరం ఉందని, మనువాద శక్తులను తిప్పికొట్టాలన్నారు. తెలంగాణ ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యులు గాదగోని రవి మాట్లాడుతూ ఓంకార్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు నిజమైన ఘన నివాళి అని అన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాస్తి కిషోర్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులపై దాడులు చేయిస్తోందని, ప్రశ్నించే గొంతులను నొక్కుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూసీఐ నాయకులు కె.సుధీర్, ఆర్ఎస్పీ నాయకులు కె.జానకి రాములు, సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ పొలిట్ బ్యూరో సభ్యులు మన్నవ హరిప్రసాద్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు హరినాథ్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటీ నాయకులు కె.ఎం.ఎ.సుభాన్, వివిధ వామపక్ష, ప్రజాతంత్ర, ప్రజా సంఘాల నేతలు మరీద్ ప్రసాద్, పి.కోటేశ్వరరావు, పిట్ట వరప్రసాద్, ఖాదర్ బాషా, ఎ.వెంకటేశ్వర్లు, మణికంఠ, వ్రాణపూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత వక్తలను ఎంసీపీఐ(యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.కె.ఖాదర్ బాషా ఆహ్వానించారు.

# 'సూరాడ'కు కేంద్ర సాహిత్య యువ పురస్కారం

## చంద్రబాబు, లోకేశ్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ జిల్లా మత్స్యకార గ్రామానికి చెందిన యువ రచయిత సూరాడ ప్రసాద్‌కు తెలుగు సాహిత్యంలో ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. ఆయన రచించిన 'మైరావణ' నవలకు కేంద్ర సాహిత్య యువ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా సూరాడకు అభినందనలు తెలిపారు. యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. పేద మత్స్యకార కుటుంబంలో పుట్టి సాహిత్యంపై మక్కువతో రాసిన రెండో నవలకే ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య యువ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందదాయకమని చంద్రబాబు అన్నారు. ఇంతటి అద్భుత ప్రతిభ కనబరిచిన ప్రసాద్‌కి అభినందనలు తెలిపారు. సముద్రపు లోతు చూసే మత్స్యకారులకు మనిషి జీవితపు ఎత్తుపల్లాలు చూడడం కష్టమేమీ కాదు అని నిరూపించిన ప్రసాద్ సూరాడ రానున్న రోజుల్లో సాహిత్యపు శిఖరం తాకాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నానని పేర్కొన్నారు. 'మైరావణ' నవలకు ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య యువ పురస్కారం అందుకున్న సూరాడ ప్రసాద్‌కి లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విశాఖ జిల్లా రాంబిల్లి మండలం వాడరాంబిల్లికి చెందిన ప్రసాద్ ...తన రెండో నవలకే పురస్కారం అందుకోవడం ప్రశంసనీయమని కొనియాడారు. మత్స్యకార గ్రామం నుంచి ఎదిగిన ప్రసాద్ తన నవలా రచనలతో యువతకు ఎంతో స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నానన్నారు.

# జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ఇదే సమయం

## సీజేఐ గవాయ్‌కు సైనిక, ప్రభుత్వ మాజీ అధికారుల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ఇదే సమయమని, దీనిపై పిటిషన్ల విచారణకు సుప్రీం ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సీజేఐ బీఆర్ గవాయ్‌కు ప్రభుత్వ-సైనిక మాజీ అధికారులు బహిరంగ లేఖ రాశారు. 2019 ఆగస్టు నుంచి ఇప్పటివరకు హోదా పునరుద్ధరించకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎప్పటికప్పుడు హామీ ఇస్తున్నారు తప్ప ఆచరించడం లేదన్నారు. పహల్గాం ఉగ్ర దాడి తర్వాత హోదా పునరుద్ధరణ చర్చనీయాంశంగా మారింది. తాజా పరిణామాల క్రమంలో జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధ రించడానికి ఇదే సరైన సమయమని మాజీ అధికారులు అభిప్రాయ పడ్డారు. దశలవారీగా రాష్ట్ర హోదాను పునరుద్ధ రిస్తారని 2023, డిసెంబరులో సుప్రీం ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ చెప్పడాన్ని వారు గుర్తుచేశారు. ఏ రాష్ట్రాన్ని పూరిగా కేంద్ర పాలిత ప్రాంతంగా స్థాయి తగ్గించరాదనే రాజ్యాంగబద్ధ అంశాన్ని కొట్టిపారేసే వాదన వినిపించారని, ఇలాంటి పరిస్థితి ఏ రాష్ట్రానికైనా రావచ్చనే సంకేతాలు ఇచ్చారన్నారు. భవిష్యత్‌లో ఏ రాష్ట్రానికి ఇటువంటి పరిస్థితి రాకూడదని, అందుకోసం మీ వంతు కృషి చేయాలని సీజేఐనుద్దేశించి అన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ముందుగా ఖండించినది జమ్మూకశ్మీర్ ప్రజలేనని మాజీ అధికారులు గుర్తుచేశారు. 2024 అక్టోబరులో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, ప్రాంతీయ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ ఎన్నికైందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగించే ప్రభుత్వానే ప్రజలు కోరుకున్నారని తెలిపారు. పౌర, రాజకీయ హక్కుల పునరద్ధురణ అవసరమన్నారు. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా తొలగింపు రాజ్యాంగ విరుద్ధమంటూ దాఖలయ్యే పిటిషన్లపై విచారణకు సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని సీజేఐని వారు డిమాండ్ చేశారు. సాధ్యమైనంత తర్వగా రాష్ట్ర హోదా పునరుద్ధరించడం, భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి ఏ రాష్ట్రానికి రాకుండా చూడటం కూడా అవసర మన్నారు. సీజేఐకు లేఖ రాసిన వారిలో జమ్మూకశ్మీర్ గ్రూప్ ఆఫ్ ఇంట్రాలొక్యూటర్స్ మాజీ సభ్యులు రాధా కుమార్, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి గోపాల్ పిళ్లై, ఆర్మీ రిటైర్డ్ మేజర్ జనరల్ అశోక్ కె.మెహతా, రిటైర్డ్ ఎయిర్ వైస్ మార్షల్ కపిల్ కాక్, భారత అంతర్రాష్ట్ర మండలి మాజీ కార్యదర్శి అమితాబాపాండే ఉన్నారు.

# ప్రకృతి విలయాలతో పాక్ కకావికలం

ఇస్లామాబాద్: ప్రక్రియ విలయాలతో పాకిస్థాన్ కకావికలమవుతోంది. ఒకవైపు వర్షాలు, వరదలు ముంచేస్తుంటే, మరోవైపు భూకంపం వణికిస్తోంది. ఆదివారం తెల్లవారు జామున 3.30 గంటలకు బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి తమ ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. రరా షైమ్, ఖింగ్రీ, వాస్తు సహా అనేక ప్రాంతాల్లో భూ ప్రకంపనలు సంభవించాయి. భూకంపం ధాటికి చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. అనేక చోట్ల ఇళ్ల గోడలు బీటలు వారాయి. బర్కన్ పట్టణం నుంచి 60 కిమీల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. రరా షైమ్‌లోని ఇంటి పైకప్పు కూలిన ఘటనలో దంపతులు ఇద్దరు గాయపడ్డారు. మొత్తంగా ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ మేరకు పారామిలటరీ లీవైస్ అధికారి తౌఖీర్ షా వెల్లడించారు. కాగా, 5.5 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు కొన్ని వార్తా నివేదికలు పేర్కొన్నాయి.

**వర్షాలు-వరదల్లో 38 మంది మృతి**

వర్షాలకు సంబంధించిన వేర్వేరు ఘటనల్లో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. 63 మందికి గాయాలయ్యాయి. ఈ మేరకు జాతీయ విపత్తు నిర్వహణ యంత్రాంగం (ఎన్‌డీఎంఏ) వెల్లడించింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు 78 ఇళ్లు ధ్వంసం కాగా, 30 పశువులు చనిపోయినట్లు తెలిపింది. ఖైబర్ పఖ్‌తుంఖ్వా ప్రావిన్స్ పరిస్థితి దారుణంగా ఉందని, అక్కడ 19 మంది చనిపోగా, 41 మందికి గాయాలయ్యాయని వెల్లడించింది. అలాగే తూర్పు పంజాబ్ ప్రావిన్స్‌లో మరో 12 మంది మృతి చెందగా, ఆరుగురు గాయపడినట్లు ఒక ప్రకటన వెలువరించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.